4-7Pg1exHMNWJQE.qxdo/p:4-7Pg1exHMNWJQE.qxd 1/1/02 7:03 AM Page 1

సాహితి
గత వారం వేదాలు శంకర ద్రోహం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-7-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 154 పేజీలు: 16 వెల: 6.50

రూ.52వేల కోట్లతో
రక్షణరంగ కొనుగోళ్లు
అయోధ్య ట్రస్టు
లావాదేవీల రీఆడిట్
5లో

# 'ఉక్కు' సంకల్పం సాకారం

## జమ్మలమడుగులో ఉక్కు కర్మాగార పనులను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### ఇక సీమ కరవు నేలకాదు..జలకళ ప్రాంతం

### రూ.16,350కోట్ల పెట్టుబడితో రెండుదశల్లో విస్తరణ

### సోలార్ ఎనర్జీలో మరిన్ని ప్రాజెక్టులు: సిఎం


శుక్రవారం జమ్మలమడుగులో ఉక్కుకర్మాగార పనులను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**జమ్మలమడుగు, జులై 3, ప్రభాతవార్త:** ఎట్టకేలకు దశాబ్దం తర్వాత ఉక్కు సంకల్పం నెరవేరింది రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జమ్మలమడుగు మండలంలో 16,350కోట్లతో నిర్మించనున్న ప్రతిష్టాత్మకమైన జేస్‌డబ్ల్యు రాయలసీమ ఉక్కు కర్మాగార పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాయలసీమ స్టీల్‌ప్లాంట్ నిర్మాణంకోసం దశాబ్దకాలం పాటు ఎదురు చూశామని ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరుతోందన్నారు. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, సీమ అంటే స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్-రాయల్ ఎన్‌ఫీల్డ్, కియా కార్లు, హీరో బైక్, డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ సీమ అంటే ఇకపై కరవు నేలకాదు జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతమన్నారు. విభజన తరువాత అవాంతరాలు, అడ్డంకులు, అవమానాలు దాటుకొని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారం భించామన్నారు. రాయలసీమ ప్రజలందరికి మరొకసారి శుభాకాంక్షలు >>2

## ఇంటికో పారిశ్రామికవేత్త

### కుప్పం నుంచే మొదలు: సిఎం చంద్రబాబు

**కుప్పం, జూలై 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నామని అభివృద్ధి, స ంక్షేమం, సుపరిపాలనే తమ లక్ష్యమని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం పొగురుపల్లి పారి శ్రామికవాడ వద్ద 3వేల కోట్లకు పైగా పెట్టు బడులతో వచ్చిన అతా గ్రూప్, అడిడాస్ షూ కంపెనీ, పయనీర్ ఆంప్స్ తదితర కంపె నీలకు శంకుస్థాపన చేశారు. 200కోట్లతో రూపుదిద్దుకున్న ఏబీస్ ప్రోటీన్ కంపెనీని, 44 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కును సిఎం ప్రారంభించారు.పలుసంస్థలతో >>2


శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీ ఇచ్చిన విందులో సంతూర్ వాయిస్తున్న జపాన్ ప్రధాని సనాయె తకాయిచి

## జపాన్ ప్రధానికి మోడీ 'సాంస్కృతిక విందు'

### సంతూర్ వాయించిన తకాయిచి

### 10 బిలియన్ డాలర్ల జపాన్ పెట్టుబడులు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జులై 3:** భారత్ జపాన్ దేశాల మధ్య పెట్టుబడి భాగస్వామ్యం క్రమంగా బలపడుతోందని మోడీ అన్నారు. గడిచిన యేడాది కాలంలో సుమారు 120 కొత్త వ్యాపార ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 10 బిలియన్ డాలర్లకు పైగా జపాన్ పెట్టుబడులు భారతదేశానికి రానున్నాయని స్పష్టం చేశారు. ఫైనాన్షి యల్ సర్వీసెస్ ఏజెన్సీల మధ్య కుదిరిన ఒప్పందం, మూలధనం, పెట్టుబడుల ప్రవాహాన్ని మరింత సులభతరం చేస్తుందని మోడీ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని హైదరాబాద్ భవన్‌లో జరిగిన ప్రత్యేక భేటీ అనంతరం మోడీ జపాన్ ప్రధాని సనాయే తకాయిచి గౌరవార్థం విందు ఇచ్చారు. ముందుగా జరిగిన భేటీలో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, బయో >>2

# గవర్నర్‌తో డి.సిఎం పవన్ భేటీ

### రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, ఈగల్ ఐజి నివేదికపై గవర్నర్ నజీర్‌కు వివరణ

### సోషల్ మీడియా దుర్వినియోగంపైనా ప్రస్తావన


శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయిన డి.సిఎం పవన్

**విజయవాడ,జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ సయ్యద్‌అబ్దుల్ నజీర్‌తో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులతో పాటు ఈగల్ ఐజీ రవికృష్ణ అందించిన రిపోర్టును అబ్దుల్ నజీర్ దృష్టికి పవన్ తీసుకెళ్లారు. సోషల్ మీడియాలో పోస్టులు, రెచ్చగొట్టే ప్రసంగాలు, కులమత విద్వేషాలు వ్యాఖ్యలను గవర్నర్‌కుపవన్ కల్యాణ్ వివరించినట్లు సమాచారం.సామాజిక మాధ్యమాల్లో కొందరు వ్యక్తిగత కేంద్రీకరించి పోస్టింగులు పెట్టడం,పోలీసు పరంగా ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలను డీసీఎం పవన్ కల్యాణ్ గవర్నర్ జస్టిస్ సయ్యద్‌అబ్దుల్ నజీర్‌కు వివరించినట్లు సమాచారం, సోషల్ మీడియా వేధింపులు, ట్రోలింగ్ అంశాలతోపాటు మహిళలను టార్గెట్ చేస్తూ అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై సైబర్ క్రైమ్ విభాగం ద్వారా తీసుకుంటున్న కఠిన చర్యలను ఉప ముఖ్యమంత్రి ఈగిల్ నివేదిక ద్వారా గవర్నర్ వివరించారు. గంజాయి, డ్రగ్స్ అణచివేతకు తీసుకుంటున్న చర్యలను గవర్నర్ పవన్‌కు వివరించారు.కీలకంగా పర్యావరణం,వన్య ప్రాణ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరిం చారు.ఇటీవల 18నగర వనాలను అభివృద్ధి చేసి, ప్రారంభించామని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో అభివృద్ధి గురించి వివరించారు.గవర్నర్ డీసీఎం ఆరోగ్య సమస్యలను గురించి అడిగి, తగిన శ్రద్ధతీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యంపట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. సామాజిక మాధ్య మం అనే అంశాలు తెలుసుకోవడానికి, ఒకరితో ఒకరు అను సంధానం అవ్వడానికి, ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి, శక్తి వంతమైన వేదికలామారిందని చెప్పారు. ఈ పేరుతో కొం దరు వాక్‌స్వాతంత్రాన్ని దుర్వినియోగం చేయటాన్ని ఆయన తప్పుబట్టారు. వాక్ స్వాతంత్రం అపరిమితమైన హక్కు కాదని, పరిమితులు ఉన్నాయని పవన్ పేర్కొన్నారు. ఎదు టివారి హక్కులకు భంగం కలిగించినప్పుడు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ అంటే ఫ్రీడమ్ టు అబ్యూస్ కాదని స్పష్టంచేశారు. కొన్నేళ్లుగా సోషల్ మీడియా దుర్వినియోగం, ఆందోళన కలిగించే స్థా యికి చేరుకుందని తెలిపారు. చాలా మంది ఫేక్ అకౌంట్స్ వెనక దాక్కొని వ్యక్తిగత దూషణలు, పరువు తీసే ప్రయ త్నాలు, ఫేక్ ప్రొపగాండా, మార్ఫింగ్ ఫోటోలు, ఆర్గనైజ్డ్ హరాస్మెంట్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చివరికి దేవుళ్లని, దేవతలపైనా ఉద్దేశపూర్వకంగా అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సోషల్ మీడి యా దుర్విని యోగం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ వెల్లడించారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించేం >>2

## కొత్తగా మూడు పోలీసు కమిషనరేట్లు

### తిరుపతి, గుంటూరు, రాజమండ్రిలో ఏర్పాటు

**విజయవాడ,జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కొత్తగా మూడు పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత మెరుగుపరచడం, పోలీసు వ్యవస్థను ఆధునికీకరించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణ యం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రం లో కొత్తగా మరో మూడు పోలీస్ కమిష నరేట్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాల పోలీస్ విభాగాలను కమిషనరేట్లుగా అప్‌గ్రేడ్ చేయా లని ప్రభుత్వం యోచిస్తోంది. పెరుగుతున్న జనాభా, నగరాల విస్తరణ, అదేవిధంగా నేరాల నియంత్రణను మరింత సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఈ ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. జిల్లాల వారీగా ఉన్న పోలీస్ యంత్రాంగాన్ని కమిషనరేట్ స్థాయికి పెంచడం ద్వారా మరింత మెరుగైన రక్షణ, వేగవంతమైన సేవలు ప్రజలకు అందుతాయని >>2



## ఎసిబి వలలో మరో అవినీతి 'చేప'

### రూ.3లక్షల లంచం తీసుకొంటూ పట్టుబడిన తిరుపతి జిల్లా మత్స్యశాఖ డిడి రెడ్డన్న

**తిరుపతి,జులై 3ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వపరంగా లబ్ధిదారులకు అందించే రాయితీని పొందడానికి ఏకంగా ప్రభుత్వ అధికారి 3లక్షలు రూపాయలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటూ తిరుపతి ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. శుక్రవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. 30లక్షలు రూపాయలు రాయితీకోసం 3లక్షలు లంచం ఇవ్వాల్సి రావడంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉన్నతాధికారి అవినీతి తిమింగళం అవినీతి వెలుగుచూసింది. ఎసిబి అధికారులు తెలిపిన వివరాలమేరకు చంద్రగిరి నియోజకవర్గం మల్లం గుంటలో నివాసముంటున్న సుభాన్ భార్య హిమ బిందు పేరున 50లక్షలు రూపాయలు అంచనాతో >>2

# లిఫ్ట్ ఇరిగేషన్‌కు కొత్త రూపు

### పదేళ్ల నిర్వహణకు 4,500కోట్లతో టెండర్లు

### శాశ్వత సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ,జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట నియోజకవర్గంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. 15 కోట్లతో అక్కడి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల రిపేర్లు, పది సంవత్స రాలుపాటు నిర్వహణ పనుల కోసం 4,500 కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్లు రామానాయుడు చెప్పారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగానికి 18వేల కోట్లు అప్పు పెట్టి వెళ్లిపో యాడన్నారు.పోలవరం డయాఫ్రమ్వాల్, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల విధ్వంసానికి జగన్ కారకుడు అయ్యాడు అన్నారు. నిర్వహణ పనులు కోసం ఐదేళ్లలో వైసిపి 200 కోట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలోనే 1200 కోట్లు ఖర్చు చేసినట్లు రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కింద 8.2 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉండగా గొడ్డలి పార్టీ విధ్వంసం వల్ల నాలుగు లక్షల ఎకరాలు మూత పడింది అన్నారు. వైకాపా హయాంలో మరమ్మత్తులకు ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీములు మూతపడ్డాయి అన్నారు. రాష్ట్రంలో 1023 లిఫ్ట్ స్కీములు ఉంటే కేవలం 166 మాత్రమే పని చేస్తున్నాయని మంత్రి చెప్పారు. 2021 నుండి వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీంపనిచేయపోవటానికి వైసిపి ప్రభుత్వ నిర్వాకమే కారణమని ఆయన అన్నారు. 15 కోట్లతో చేపడుతున్న ప్రస్తుత పున రుద్ధరణ పనులు పూర్తి అయితే జగ్గయ్యపేట, >>2





## హైకోర్టుకు ముగ్గురు అదనపు జడ్జిలు

### కేంద్రం ఉత్తర్వులు జారీ

**విజయవాడ,జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది.

హైకోర్టు న్యాయమూర్తుల నియా మక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.



## పెళ్లి బృందం ఆటో, టూవీలర్‌ను ఢీకొన్న లారీ

### నలుగురు మృతి, ఆరుగురికి తీవ్రగాయాలు

### కంభం పట్టణంలో దుర్ఘటన

**ఒంగోలు, జులై 3 ప్రభాతవార్త:** గిద్దలూరు నుండి కంభం వస్తున్న పెళ్లి బృందం ఆటోను, ఓ ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చిన తౌడు లోడ్ లారీ బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఓ చిన్నారితో సహా నలుగురు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో కంభం పట్టణంలోని వై జంక్షన్ సమీపంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు గిద్దలూరు మండలం నల్లబండ బజారుకు చెందిన వారు కంభం పట్టణానికి చెందిన మండ్లా పాములేటి అనే యువకునికి తమ కుమార్తె ఆవుల వీరక్కను ఇచ్చి శుక్రవారం ఉదయం >>2


ఎలైట్ ప్లేయర్స్‌తో మంత్రి లోకేష్ విందు

## రాష్ట్రంలో ప్రపంచశ్రేణి 'స్పోర్ట్ సెంటర్'

### జెఎస్‌డబ్ల్యు సంస్థ సహకారంతో ఏర్పాటు, ఎలైట్ ప్లేయర్స్‌తో మంత్రి లోకేష్ విందు సమావేశం

**విజయవాడ.జూలై 3 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు జెఎస్ డబ్ల్యు సంస్థ ముందుకు వచ్చిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. కామన్ వెల్త్, ఆసియా గేమ్స్ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఎలైట్ ప్లేయర్స్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో శుక్రవారం రాత్రి డిన్నర్ మీట్ నిర్వహించారు. ఆద్యంతం ఆహ్లాదంగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై క్రీడాకారుల నుంచి సలహాలను స్వీకరించారు. క్రీడాకారుల కుటుంబ నేపథ్యం, ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సవాళ్లు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహం వంటి వాటిపై క్రీడాకారులను వాకబుచేశారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో మంచి కోచ్‌లు ఉండేవారని, 2019లో ప్రభుత్వం మారాక వారందరినీ తొలగించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో గుంటూరులో చంద్రబాబు విదేశీ కోచ్‌లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఏర్పాటుచేశారన్నారు. దీనిపై మంత్రి లోకేష్ స్పం దిస్తూ పాలకులు మారినా పాలసీలు మారకూడదన్నారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి అత్యుత్తమ కోచ్‌లను ఏపీలో ఏర్పాటుచేసి, సెంటర్ ఆఫ్ఎక్సలెన్స్ తీసుకొస్తామన్నారు. రాష్ట్ర అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు జెఎస్ డబ్ల్యు సంస్థ అంగీకారం తెలిపింది. ఇందుకు అవసరమైన ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలో గ్రిఫిత్ యూనివర్సిటీ విద్యతో క్రీడలకు ప్రత్యేక శిక్షణ అందిస్తోందని తెలిపారు. అక్కడ కరిక్యులమ్‌ను అథ్లెటిక్స్‌కు అనుగుణంగా రూపొందించారని అన్నారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. స్పోర్ట్స్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామని అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ ఎరెనా ఉండాలన్నది తమ అభిమతంగా పేర్కొన్నారు. స్పోర్ట్స్ ను ప్రోత్సహించడంపై తల్లిదండ్రుల్లో కూడా అవేర్ నెస్ రావాల్సి ఉందని అన్నారు. ఇందులో భాగంగానే గతఏడాది నిర్వహించిన డీఎస్సీలో తొలిసారిగా క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ అమలుచేశామని చెప్పారు. గ్రామస్థాయి >>2



శుక్రవారం జమ్మలమడుగులో నిర్మించనున్న ఉక్కుకర్మాగార నమూనా చిత్రాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు తదితరులు

# 'ఉక్కు' సంకల్పం సాకారం

>> తెలిపారు. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓ సారి, 2023లో మరోసారి శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. గడిచిన రెండేళ్లలో చాలా అంశాల్ని పరిష్కరించి ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. 1100 ఎకరాల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఉక్కు కర్మాగారం ఏర్పాటు అవుతోందన్నారు. మొదటి దశలో రూ.4వేల కోట్లు, రెండో దశలో రూ.11850 కోట్లు పెట్టుబడి పెడుతున్నారని ఉక్కు రాష్ట్రం ఏపీ, విశాఖతో పాటు రాయలసీమగా ఉక్కు ప్రాంతంగా తయారవుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌తో పాటు సోలార్ ఎనర్జీ క్యాప్టివ్ ప్లాంట్‌ను జేఎస్‌డబ్ల్యూ ఏర్పాటు చేస్తోంది. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో వ్యర్థాల నుంచి వచ్చిన ఇనుము సేకరించి ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11440 కోట్ల ఆర్థిక సాయం తెచ్చి కాపాడామన్నారు. నక్కపల్లిలోనూ అర్సెలాల్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీల్లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టారు. రాయలసీమ ప్లాంట్ బళ్లారి కంటే అధిక సామర్థ్యంతో పని చేయాలని జేఎస్‌డబ్ల్యూను కోరుతున్నానన్నారు. రాయలసీమ ప్రాంతంలో అత్యంత నాణ్యమైన ముడి నుము ఖనిజాన్ని కూడా సరఫరా చేసేందుకు ఏపీ సిద్ధమన్నారు. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ కూడా రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు ఏర్పాటు చేస్తామన్నారు. రాయలసీమకు ఎవరి వల్ల నష్టం జరిగిందో ప్రజలు గమనించాలని కోరారు. జెఎస్‌డబ్ల్యూ ప్లాంట్‌తో ఈ ప్రాంతంలో సామాజికంగా, ఆర్థికంగా ప్రభావం ఉంటుందని గతంలో కియా ప్లాంట్ తీసుకొచ్చాను. అన్ని దేశాలకు ఆ సంస్థ కార్లను ఎగుమతి చేస్తోందని గుర్తు చేశారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ జయంత్ ఆచార్య మొదలైన వాణిజ్య ప్రముఖులు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సీఎం ఒక రోజు జిల్లా పర్యటను ముగించుకొని మధ్యాహ్నం 2.40 గంటలకు హెలీప్యాడ్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో కుప్పం బయలుదేరగా సాదర వీడ్కోలు పలకారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, డీఐజీ కొయా ప్రవీణ్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు భూపేష్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు సీఎంకు వీడ్కోలు పలికారు.

## కొత్తగా మూడు పోలీసు కమిషనరేట్లు

>> ప్రభుత్వం భావిస్తోంది. ఈ నూతన కమిషనరేట్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అప్పుడే అడుగులు వేశారు. కొత్తగా ప్రతిపాదించిన ఈ మూడు కమిషనరేట్లకు సంబంధించిన సరిహద్దుల నిర్ణయం, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాల ఎస్పీలను ఆయన ఆదేశించారు. వీటితో పాటూ కమిషనరేట్ పరిధిలోకి వచ్చే కొత్త పోలీస్ వింగ్స్, అదనపు సిబ్బంది అవసరాలు, ఇతర సాంకేతిక వసతులపై సమగ్ర అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను, ప్రతిపాదనలను వెంటనే పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలని డీజీపీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే ఆయా నగరాల్లో ట్రాఫిక్, క్రైమ్ కంట్రోల్ వంటి విభాగాలు మరింత బలోపేతం కానున్నాయి.

## 'స్పోర్ట్స్ సెంటర్'

>> నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని అన్నారు. విశాఖ క్రికెట్ స్టేడియంలో ఒక స్టాండ్ కు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరుపెట్టామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి విద్యార్థుల ఆసక్తిమేరకు వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు మాట్లాడుతూ కొరియాలో ఆర్చరీ క్రీడాకారులకు రోబోతో ముందస్తు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. స్పోర్ట్స్ ఆడే సమయంలో క్రీడాకారులు గాయపడినపుడు రికవరీ చాలా ముఖ్యమని, దీనిపై దేశంలో కొన్నిచోట్ల మాత్రమే రికవరీ సౌకర్యాలు ఉన్నా యని చెప్పారు. ఈ ఏడాది భారత అథ్లెట్లు 26 జాతీయ రికార్డులను బ్రేక్ చేశారని క్రీడాకారులు చెప్పగా, లోకేష్ అభినందనలు తెలిపారు. సింగపూర్ స్పోర్ట్స్ కాలేజిలో ఎఐ ద్వారా బౌలింగను కోచ్ లు పర్యవేక్షి ంచడం చూశానని అన్నారు. ఈ డిన్నర్ మీట్ లో కామన్ వెల్త్, ఆసియా గేమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు పివి సింధు (బ్యాడ్మింటన్), సాత్విక్ సాయిరాజ్ (బ్యాడ్మింటన్), జ్యోతిక శ్రీ (అథ్లెటిక్స్), భవానీ కార్తీక్ (పారా స్విమ్మింగ్), వెంకటరామిరెడ్డి (అథ్లెటిక్స్), ఆర్.స్వాతి (అథ్లెటిక్స్), భవానీ యాదవ్ (అథ్లెటిక్స్), కుసుమ రావాడ (అథ్లెటిక్స్), గణేష్ మణిరత్నం (ఆర్చరీ), రష్మి (అథ్లెటిక్స్), మల్లల అనూష (అథ్లెటిక్స్), శిరీష (అథ్లెటిక్స్), కుంజా రజిత (అథ్లెటిక్స్), యుక్తశ్రీ (ఆర్చరీ), తీర్థసామదేవ్ (స్విమ్మింగ్) పాల్గొన్నారు.

**క్రీడాకారులకు ఆర్థికసాయం మంజూరు:** ఈఏడాది ఆసియన్ గేమ్స్, కామన్ వెల్త్ గేమ్స్, పారాకామన్ వెల్త్ గేమ్స్ కు ఎంపికైన 18మంది అథ్లెట్లశిక్షణ కోసం ప్రభుత్వం రూ.2,23,25,000లను విడుదల చేసింది. క్రీడాకారుల అవసరాన్నిబట్టి మరింత సాయం ఇస్తామన్నారు.




హాస్వాంగ్ (అడిడాస్) సంస్థ ఛైర్మన్ లీను సత్కరిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

# ఇంటికో పారిశ్రామికవేత్త

>> ఎంఒయులు కుదుర్చుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రావాలన్నదే తన ఆశయమన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారిని తాను ఆహ్వానిస్తున్నానన్నారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎంతో కీలకంగా మారిందన్నారు. తద్వారానే వైజాగ్‌కు 1.35లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ సంస్థ వచ్చిందన్నారు. ప్రఖ్యాత అడిడాస్ షూ కంపెనీ కోసం వేరే రాష్ట్రాలు పోటీపడ్డాయన్నారు. అయితే ఆసంస్థ కుప్పంకు రావడం జరిగిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వంపై వారికి ఉన్న విశ్వాసం అన్నారు. కుప్పంలో వేలకోట్ల రూపాయల పెట్టుబడులతో పారిశ్రామిక వేత్తలు రావడం ఆనందంగా ఉందన్నారు. కుప్పానికి ముున్ముందు బెంగళూరు నుంచి ఉద్యోగాలకు వచ్చేలా ఇక్కడ అభివృద్ధి చేస్తామన్నారు. కుప్పంలో ఇప్పటికే 9322కోట్లతో 27 పరిశ్రమలు వచ్చాయని తద్వారా 39535మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపుకు :** విధ్వంసంనుంచి వికాసం వైపుకు రాష్ట్రంలో పాలన జరుగుతోందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తమపై నమ్మకంతో ఎన్నికల్లో గెలిపించారన్నారు. ప్రజల తలసరి ఆదాయం పెంచేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఉపాధి, యువతకు ఉద్యోగాలు, రైతులకు ఆదాయవ వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. కుప్పం నుంచే ఇంటికో పారిశ్రామికవేత్త రావాలనే కార్యక్రమంకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఆవిష్కరణల నుంచి స్టార్టప్ కంపెనీలు మరిన్ని రావాలన్నారు. దేశంలోనే డ్వాక్రా సంఘాలు నెంబర్‌వన్ స్థానంలో ఉన్నాయని కేంద్రం ఇచ్చిన రేటింగ్స్‌లో పేర్కొందన్నారు. 1.49లక్షల మంది మహిళలు 1400కోట్ల రుణాలు తీసుకుని తిరిగి చెల్లిస్తున్నారన్నారు. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా చేయా లనేది తన లక్ష్యమన్నారు. రైతులకు ఎఫ్‌పిఒల ద్వారా ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టామ న్నారు. తిరుపతి శ్రీ సిటీలో 300 కంపెనీలు ఉన్నాయని అక్కడ కూడా యూనివర్సిటీని ప్రారంభించామన్నారు. కుప్పంలో మూడు సంస్థల ద్వారా పి4 కార్యక్రమంలో భాగంగా 9వేల కుటుంబాలను దత్తత తీసుకున్నా య న్నారు. ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గించేం దుకు చర్యలు చేపట్టామన్నారు. కుప్పానికి గండికోట నుంచి తాగునీరు తెచ్చి ఇంటింటికీ కొళాయి ద్వారా, పరిశ్రమలకు నీరు అందిస్తా మన్నారు. అనంతరం సిఎం చంద్రబాబునా యుడు పొగురుపల్లిలోనే రా త్రి బాగా పొద్దుపోయే దాకా పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. అంతకుముందు సిఎంకు ద్రవిడ వర్సిటీలో హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారా ం, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కన్వీనర్ చంద్రశేఖర్, నాలుగు మండలాల అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

# సిట్ అధికారులు నన్ను హింసించే అవకాశం

## విజయవాడ కోర్టుకు సస్పెండయిన సిఐ నాగరాజు లేఖ

### సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ కేస్టోడియల్ డేత్ కేసు వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సీఐ నాగరాజు కేసులో ఒక అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు నాగరాజు న్యాయస్థానానికి ఒక సంచలన లేఖ రాశారు. సాయికృష్ణ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను పూర్తిగా నిర్దోషినని, తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులు కావాలనే తప్పుడు ఆధారాలను సృష్టించి ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికిస్తున్నారని సీఐ నాగరాజు ఆరోపించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారుల అభ్యర్ధన మేరకు విజయవాడ కోర్టు నాగరాజును 8 రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇప్పటికే అనుమతించింది. ఈ నేపథ్యంలో నాగరాజు సిట్ విచారణలో తనను హింసించే అవకాశం ఉందంటూ కోర్టు రాసిన లేఖలో అభ్యర్దించారు, సిట్ అధికారులు కావాలనే తప్పుడు ఆధారాలను సృష్టించి ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికిస్తున్నారని సీఐ నాగరాజు ఆరోపించారు. ఎనిమిది రోజుల కస్టడీ విచారణ సమయంలో అధికారులు తనపై థర్డ్ డిగ్రీ ఉపయోగించకుండా, శారీరకంగా, మానసికంగా వేధించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోర్టును వేడుకున్నారు. అంతేకాకుండా, సిట్ అధికారులు జరిపే విచారణ ప్రక్రియ అంతా చట్ట ప్రకారం తన న్యాయవాదుల సమక్షంలోనే జరిగేలా చూడాలని లేఖలో అభ్యర్థించారు. సిట్ అధికారులు కావాలనే తప్పుడు ఆధారాలను సృష్టించి ఈ కేసులో తనను అన్యాయంగా ఇరికిస్తున్నారని సీఐ నాగరాజు ఆరోపించారు. ఎనిమిది రోజుల కస్టడీ విచారణ సమయంలో అధికారులు తనపై థర్డ్ డిగ్రీ ఉపయోగించకుండా, శారీరకంగా, మానసికంగా వేధించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోర్టును వేడుకున్నారు. అంతేకాకుండా, సిట్ అధికారులు జరిపే విచారణ ప్రక్రియ అంతా చట్ట ప్రకారం తన న్యాయవాదుల సమక్షంలోనే జరిగేలా చూడాలని లేఖలో అభ్యర్థించారు.

# లిఫ్ట్ ఇరిగేషన్‌కు కొత్త రూపు

>> నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించగలదన్నారు. 2014 19 టిడిపి ప్రభుత్వంలో, వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం నిర్వహణ కోసం, 5.36 కోట్లు ఖర్చు చేసి సాగునీరందించామని ఆయన గుర్తు చేశారు. 2027 ఖరీఫ్ సీజన్ నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంస మైందనడానికి ఐడిసినే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన ఉదహరించారు. రాజధాని విషయంలో జగన్ మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. పూటకో మాట, పేటకోమాట అన్న చందంగా ఉంది ఆయన తీరు అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతిని ఆహ్వానించి అధికారంలోకి వచ్చాక, మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాటాడారు అన్నారు. తెలంగాణకు హైదరాబాదు, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధాని నగరాలుగా ఉంటూ లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయన్నారు. అలాగే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ గా ముఖ్యమంత్రి రూపకల్పన చేశారన్నారు. ఫలితంగా ఏటా లక్ష కోట్లు రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. ఈ లక్షకోట్లతో 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీకేసినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఐడీసీఎండి తిరుమల రావు, కెడిసి సిఈ రాంబాబు పాల్గొన్నారు.




## త్వరలో కృష్ణానదిలో మరింత ఆహ్లాదకర బోటింగ్

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏపీలో పర్యాటక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుంది. ఇందులో భాగంగా ఏపీలో నదులు, సముద్ర తీర ప్రాంతాలు ఉన్నచోట పర్యాటకంగా అభివృద్ధి చేసే ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే ఏపీలోని బీచ్ లపై ప్రత్యేకమైన ఫోకస్ పెట్టి అభివృద్ధి చేస్తున్న సర్కార్, కృష్ణానదిలో పర్యాటకులకు మరింత ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభూతిని కలిగించడం కోసం డీజిల్ బోట్లకు బదులు సోలార్ శక్తితో నడిచే బోట్లను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఈ మేరకు ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఏపీటీడీసీ బోర్డు సమావేశంలో సోలార్ బోటు నమూనాను కూడా సభ్యులకు ప్రదర్శించారు. ప్రయోగాత్మకంగా ఏపీలో నాలుగు సోలార్ మెకనైజ్డ్ బోట్ లను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం విజయవాడ ప్రాంతంలో కృష్ణా నదిలో పర్యాటకుల సేవ కోసం డీజిల్‌తో నడిచే బోట్ లు వినియోగంలో ఉన్నాయి. ఈ మేరకు ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఏపీటీడీసీ బోర్డు సమావేశంలో సోలార్ బోటు నమూనాను కూడా సభ్యులకు ప్రదర్శించారు.

## డెల్టా ర్యాంకింగ్‌లో పార్వతీపురం దేశంలోనే నం.1స్థానం

**విజయనగరం (పార్వతీపురం మన్యం జిల్లా), జూలై 3 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఉన్న జిల్లాలలో పార్వతీపురం మన్యం జిల్లా డెల్టా ర్యాంకింగ్స్‌లో చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఆకాంక్ష జిల్లా కార్యక్రమం ఏడిపి మార్చి 2026లో ఈ విజయాన్ని చేజిక్కించుకుంది. నీతి అయోగ్య ప్రకటించిన ఆకాంక్ష జిల్లా కార్యక్రమం డెల్టా ర్యాంకింగ్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 123 ఆకాంక్ష జిల్లాల మధ్య పార్వతీపురం మన్యం జిల్లా ఆరోగ్యం అండ్ పోషణ థీమ్ దేశవ్యాప్తంగా రెండవ స్థానం సాధించడం ద్వారా మరో విశిష్ట ఘనతను అందుకుంది. ఒకే డెల్టా ర్యాంకింగ్ చక్రంలో రెండు థీమ్స్‌లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన దేశం నుండి తొలి ఆకాంక్ష జిల్లా పార్వతీపురం మన్యం జిల్లా చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు దేశంలో ఏ ఇతర జిల్లాలు కూడా ఈ విధమైన అరుదైన ఘనతను సాధించలేదు ఈ అసాధారణ విజయానికి జిల్లా పరిపాలన సమన్వయంతో చేసిన కృషి శాఖల మధ్య సమగ్ర సమన్వయం నిరంతర పర్యవేక్షణ వినూత్న కార్యక్రమాలు మరియు గ్రామస్థాయి వరకు అమలు చేసిన అభివృద్ధి చర్యలు ప్రధాన కారణంగా నిలిచాయి. ప్రత్యేకించి ఆరోగ్య పోషణ మౌలిక వసతుల రంగాల్లో చేపట్టిన ఫలప్రదమైన చర్యలు జిల్లా పురోగతికి దోహదపడ్డాయి. ముఖ్యంగా గిరిజన మరియు వెనుకబడిన వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఈ ఘనత సాధ్యమైంది. ఈ చారిత్రాత్మక విజయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కాకుండా పార్వతీపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ఆకాంక్ష జిల్లాలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అభివర్ణించారు

## సిట్ అధికారుల పిటిషన్‌పై విచారణ ఆదివారానికి వాయిదా

**విజయవాడ.జూలై3,ప్రభాతవార్తప్రతినిధి:** లాకప్‌డేత్ నిందితుడు నాగరాజు కస్టడీ విచారణపై సిట్ అధికారుల లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసుల కస్టడీ విచారణపై దిగువ కోర్టు ఇచ్చిన నిబంధనల్లో మార్పు కోరుతూ సిట్ పిటిషన్ చేసింది. సిట్ అధికారుల పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఆదివారానికి వాయిదా వేసింది.

# 'సాంస్కృతిక విందు'

>> టెక్నాలజీ రంగాల్లో కుదిరిన ఒప్పందాల ద్వారా, ప్రపంచ ఆరోగ్య భద్రతకు కూడా దోహదం చేస్తాయని తెలిపారు. జపాన్ నుంచి భారత్‌కు 10 లక్షలకోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, రానున్న దశాబ్ద కాలంలో దేశంలో పనిచేస్తున్న జపాన్ కంపెనీల సంఖ్యను రెట్టింపు చేయడమేనని స్పష్టం చేశారు. దేశంలో నిరంతరంగా జరుగుతున్న సంస్కరణలు వ్యాపారం చేసే సౌలభ్యాన్ని మెరుగుపరిచాయని, ఈ అవకాశాన్ని జపాన్ కంపెనీలు కూడా సద్వినియోగం చేసుకోవచ్చునని మోడీ పేర్కొన్నారు. ఇంధన ఆర్థిక భద్రతలపై ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు మోడీ పేర్కొన్నారు. "ఆర్థిక భద్రత కోసం మేమిప్పుడు ఒక ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశాం. దీని ద్వారా, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, అధునాతన మెటీరియల్స్ వంటి వ్యూహాత్మక రంగాల్లో సరఫరా గొలుసులను బలోపేతం చేస్తాం. నేటి అనిశ్చిత యుగంలో, ఆర్థిక, ఇంధన భద్రత ప్రాముఖ్యతను భారత్, జపాన్ దేశాలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు దేశం అంతటా 1000 బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల ప్లాంట్లను స్థాపించ డంలో భారత్ జపాన్ బయోగ్యాస్ చొరవ మాకు సహాయపడుతుంది. ఇది మా గోబర్ధన్ చొరవను మరింత బలోపేతం చేస్తుంది. గ్రామాల్లో సుస్థిరత, శ్రేయస్సు, గ్రామీణ జీవనోపాధికి కొత్త ఊపునిస్తుందని మోడీ పేర్కొన్నారు.

**సంతూర్ వాయించిన జపాన్ ప్రధాని**

జపాన్‌ప్రధాని గౌరవార్థం హైదరాబాద్ హౌస్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక విందు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసారు. ఈసందర్భంగా ప్రధానిమోడీ భారత్‌లోని విశేష ప్రాచుర్యం ఉన్నవాయిద్యం సంతూర్‌ను వాయించాలని కోరారు. ముందు తకైయిచి కొంత తటపటా యించినా ప్రధానిమోడీ ముందుగా తాను సంతూర్‌ను వాయించి తదనం తరం తకాయిచి ప్రోత్సహించడంతో ఆమె సంతూర్‌ను వాయించి ఆనందం వ్యక్తంచేసారు. తకాయిచి సంతూర్ వాయిస్తుండగా ప్రధానిమోడీతో సహా అక్కడున్న అతిథులందరూ చపట్లతో జపాన్ ప్రధానిని అభినందించారు.

# ఎసిబి వలలో మరో అవినీతి 'చేప'

>> మల్లంగుంటలోనే మత్స్య పరిశ్రమ క్రింద చేపలు, రొయ్యలు ఇతర జలచరాలను పెంచడం కోసం కార్యాచరణ రూపొందించాడు. ఇందుకు సంబంధించిన పరిశ్రమ స్థాపన అంచనాను తయారుచేశాడు. 50లక్షలు రూపాయలు పెట్టుబడితో ఏర్పాటుచేసే ఈ పరిశ్రమకు ప్రధానమంత్రి యోజన పథకం క్రింద 60శాతం రాయితీకి దరఖాస్తుచేసుకున్నాడు. ఈ దరఖాస్తులను తిరుపతినగరంలోని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ రెడ్డన్నను కలిశాడు. తన పరిశ్రమకు సంబంధించిన రికార్డులను ,దరఖాస్తులను సమర్పించాడు. అయితే రాయితీ కోసం తన సంతకం చేయడానికి 4.50లక్షలు రూపాయలు లంచం ఇవ్వాలని రెడ్డన్న కొంతకాలం క్రిందట డిమాండ్ చేశాడు. అయితే బాధితులు అంతపెద్దమొత్తంలో ఇచ్చుకోలేమని మొరపెట్టుకున్నారు. చివరకు 3లక్షలు రూపాయలు లంచం నగదుగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మొత్తాన్ని తాను చెప్పిన చోటుకు, ఆ వ్యక్తికి అప్పగిస్తే రాయితీ కోసం ఫైల్ కదలడానికి సంతకం చేస్తానని తేల్చి చెప్పేశాడు. దీంతో బాధితుడు సుభాన్ చేసేది లేక తిరుపతిలోని ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎసిబి డిఎస్పీ సీతారామారావు సిబ్బంది సూచనలతో 3లక్షల లంచం డబ్బుల్లో శుక్రవారం ఉదయం ఒకలక్ష రూపాయలు లంచం నగదు తిరుపతిలోని అన్నారావు కూడలి వద్ద రెడ్డన్న స్నేహితుడు నాగరాజుకు అందిస్తుండగా పథకం ప్రకారం ఎసిబి అధికారులు అతనిని పట్టుకున్నారు. ఆ తరువాత అతని సహాయంతో జిల్లా మత్స్యశాఖ కార్యాలయంకు చేరుకున్నారు. అక్కడ డిడి రెడ్డన్నను అదుపులోకి తీసుకున్నారు. ఆధారాలతో పక్కాగా లంచం నగదు తీసుకుంటూ పట్టుబడటంతో నాగరాజును, డిడి రెడ్డన్నను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు ఎసిబి అధికారులు రెడ్డన్న ఇంటిని, కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయనకు సంబంధించి కడపలోనూ ఆస్తులు ఉండటంతో అక్కడా సోదాలు చేశారు. రాత్రికూడా సోదాలు కొనసాగుతుండటంతో శనివారం పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ఎసిబి అధికారులు రెడ్డన్నను, నాగరాజును తదుపరి చర్యలకు అరెస్ట్ చేయనున్నారు. జిల్లా మత్స్యశాఖ కార్యాలయంపై ఎసిబి అధికారుల దాడులతో ఆ కార్యాలయం ఉద్యోగులు బెంబేలెత్తారు. ఇంకా ఇలాంటి అక్రమాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంగా ఎసిబి అధికారులు విచారణ చేస్తున్నారు.

## పెళ్లి బృందం ఆటో, టూవీలర్‌ను ఢీకొన్న లారీ

>> కంభంలో వివాహం జరిపించేందుకు గిద్దలూరునుంచి గురువారంరాత్రి 10:30 గంటలకు పెండ్లి కుమార్తెతో సహా పదిమంది ఆటోలో బయలుదేరగా మరో ఇద్దరు ద్విచక్ర వాహనంలో కంభంకు బయలుదేరారు. రాత్రి ఒంటిగంట సమయంలో కంభం వై.జంక్షన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న వినాయక స్వామి గుడి వద్దకు వచ్చి ఆటోను ఆపుకుని గుడి వద్ద కొబ్బరికాయ కొట్టేందుకు పెళ్లి కుమార్తె, మరో ఇద్దరు ఆటో దిగారు మిగిలిన వారందరూ ఆటోలోనే కూర్చొని ఉండగా అదే సమయంలో మదనపల్లి నుంచి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు తౌడు లోడుతో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆటోను, ఆటో వెనుక ఉన్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం దిగి ఆటో వెనక నిలుచున్న ఆవుల అంకాలు (21), ఆవుల నాగేష్ (18) లనుతొక్కించుకొని, ఆటోను బలంగా ఢీకొనడంతో ఆవుల అంకాలు భార్య ఆవుల రామానుజమ్మ(19), నాగరాజు మైసమ్మల కుమార్తె చిన్నారి నాగేశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న ఆవుల వీరమ్మకు కాలు విరగగా, ఆవుల ఓబులమ్మ రెండు కాళ్లు, నల్లబోతుల సంజీవరా యుడు, మైసమ్మలకు తలకు తీవ్ర గాయాలుగా వారిని మొదట మార్కాపురం ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అ నంతరం వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే పోలీసులుసంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంతీరును పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మార్కాపురం ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. లారీ మితిమీరిన వేగంతో రావడం వలనే ప్రమాదం చోటుచేసు కుందని స్థానికులు తెలిపారు.

## గవర్నర్‌తో డి.సిఎం పవన్ భేటీ

>>దుకు ప్రత్యేక వ్యవస్థని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్క్రీన్‌షాట్స్, లింక్స్, వీడియోలతో ఫిర్యాదు చేయాలని వాటి ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి నేరాలకి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ వ్యవస్థనుబలోపేతం చేయడానికి, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే ఇవాళ గవర్నర్‌తో పవన్ కల్యాణ్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

04-07-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
చవితి మ.12.37,
ధనిష్ఠ మ.1.41
వర్జ్యం : రా.9.19-రా.11.01
దు.తె.5.39-7.19
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** వేటిని లెక్క చేయక బాధ్యతలు నిర్వహించి మంచి వ్యక్తిగా పేరు పొందుతారు. క్రీడల యందు రాణిస్తారు.

**వృషభం:** రాబోయే కాలములో చెల్లించవలసిన ధనమును గూర్చి, ఇప్పుడే ఘర్షణ పడవద్దు. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:** అత్యంత కఠినమైన ప్రతిష్ఠాత్మకమైన వ్యవహారాలను మధ్య వర్తులకు అప్పగిస్తారు. ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**కర్కాటకం:** ప్రముఖులను కలుసుకొని కీలక విషయాలపై చర్చిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**సింహం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వస్త్రలాభం.

**కన్య :** మీ ఆత్మీయులతో సమాలోచనలు చేసి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అధిక శ్రమ చేయకుండానే లక్ష్యసాధనను సాధిస్తారు.

**తుల:** ముఖ్యమైన పత్రములను పోగొట్టు కొనటం వంటి సమస్యలు సాంకేతిక ఇబ్బందులు సంభవించకుండా జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** కొద్దిపాటి మనస్పర్థలు, చర్చలు వంటివి ఇబ్బందిని కలిగించినా, ముఖ్యమైన కార్యక్రమాలను పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంత ప్రయోజనాలు కలిసి వస్తాయి. అన్ని పనులు సకాలంలో పూర్తిచేస్తారు. వాహనసౌఖ్యం కలదు.

**మకరం:** తాత్కాలిక ప్రయోజనముల కొరకు మీకు ఇష్టంలేకపోయినా కొందరితో కలిసి పనిచేయవలసి వస్తుంది. వస్త్రలాభం.

**కుంభం:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యవహారాలతో సన్నిహితుల సాయం అందుకుంటారు.

**మీనం:** కుటుంబంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వివిధ సమాచార సాధనము లను వినియోగించుకొని విజయాలను సాధిస్తారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## డి.సిఎం పవన్‌తో ఈగల్ చీఫ్ భేటీ



**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఆకే రవికృష్ణ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిరాకరణ ఈగల్ విభాగం తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను ఈ నివేదికలో వివరించారు. సోషల్ మీడియా వేదికపైను, ట్రోలింగ్ అంశాలతో పాటు మహిళలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై సైబర్ క్రైమ్ విభాగం ద్వారా తీసుకుంటున్న కఠిన చర్యలను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. సామాజిక మాధ్యమాలో శృతి మించి వ్యాఖ్యానాలు, పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశలో పోలీసు నిఘా పెట్టాలని ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణకు డిప్యూటీ సీఎం పవన్ సూచించారు. కీలకంగా గంజాయి, డ్రగ్స్ విషయంలో నిఘా ఎక్కువగా ఉండాలన్నారు. విద్యాసంస్థలు, రద్దీగా ఉండే ప్రాంతాలు, క్రీడా ప్రాంగణాల వద్ద నిఘా ఉండాలన్నారు. ఈ మత్తుపదార్థాలు అమ్మేవారిపైనా తీసుకునే వారిపైనా కఠిన చర్యలుండాలన్నారు. ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై దృష్టిపెట్టాలన్నారు. అరాచకశక్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

**మూలపేట జెడ్పీ హైస్కూలు సిబ్బందికి పవన్ అభినందనలు:** గత విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో కాకినాడ జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలను సాధించిన పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో, గురువారం 7వ తరగతి నుంచి ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం వరకు అడ్మిషన్లు లేవంటూ నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసిన క్రమంలో పవన్ కళ్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల బోధన విధానాలు, బోధనేతర సిబ్బంది సహకారంతో అత్యుత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసే స్థాయికి మూలపేట ఉన్నత పాఠశాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సిబ్బందిని ప్రశంసించారు. ఈసారి పిఠాపురం పర్యటన సందర్భంగా మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శిస్తానని ఉప ముఖ్యమంత్రి మాటిచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు.. మూలపాడు జెడ్పీ హైస్కూల్ సాధించిన ఫలితాల స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# అనంతలో దొంగ నోట్ల తయారీ ముఠా

**• విజయవాడ పోలీసుల మెరుపు దాడులు • రెడ్ హ్యాండెడ్‌గా ఇద్దరు కేటుగాళ్లు అరెస్ట్ • నకిలీ కరెన్సీ, ముద్రణ యంత్రాలు, ల్యాబ్ టాప్ స్వాధీనం**





**అనంతపురం(క్రైమ్) జులై 3 ప్రభాతవార్త:** డబ్బును సంపాదించడం కన్నా ప్రింట్ చేసుకొని వాటిని అమాయకులను మోసం చేసి వారికి అంటగట్టి కోటేశ్వరులు కావడం ఈజీ అనుకున్నారు... కానీ చట్టానికి అడ్డంగా దొరికిపోయారు.. ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ నోట్ల ముఠాలు రాష్ట్ర సరిహద్దులు దాటి నెట్వర్క్ అనంతపురం జిల్లాకు కూడా విస్తరిస్తున్న ఉదంతం ఒకటి అనంతపురం జిల్లాలో వెలుగుజూసింది. ఈ వ్యవహారం జిల్లా వాసులకు కుదిపేసింది. పోలీసులు రంగ ప్రవేశంతో నకిలీ నోట్ల ముద్రణ కాస్తా బట్టబయలు అయింది. ముఠా సభ్యులు పోలీసుల చేతికి చిక్కి చివరకు కటకటాల పాలయ్యారు. ఈ ఉదంతానికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. అనంతపురం నగర నడిబొడ్డున కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న దొంగ నోట్ల తయారీ కేంద్రాన్ని విజయవాడ పోలీసులు అత్యంత వ్యూహాత్మకంగా దాడి చేసి బట్టబయలు చేశారు. ఈ ఆపరేషన్లో దొంగ నోట్లను ముద్రిస్తున్న ఇద్దరు ప్రధాన నిందితులను రెడ్ హ్యాండెడ్ గా అదుపులోకి తీసుకోవడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. పేద, సామాన్య ప్రజలను ముంచేలా భారీ ఎత్తున కరెన్సీని ముద్రించి మార్కెట్లోకి వదిలేందుకు ప్రయత్నించిన ఈ ముఠా గుట్టును సైబర్, ఇంటెలిజెన్స్ సమాచారంతో పోలీసులు రట్టు చేశారు. నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న శారదా నగర్ లోని ఒక నివాస గృహంలో ఈ దొంగ నోట్ల ముద్రణ తంతు సాగుతోంది. నమ్మదగిన సమాచారంతో ప్రత్యేకంగా రంగంలోకి దిగిన విజయవాడ స్పెషల్ పోలీస్ టీమ్, గురువారం రాత్రి హఠాత్తుగా సదరు ఇంటిపై మెరుపు దాడులు నిర్వహించింది. ఈ సమయంలో రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో హై క్వాలిటీ పేపర్లపై నోట్లను ప్రింట్ చేస్తున్న అనంతపురానికి చెందిన రాజు, సురేష్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా వల పన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో ఈ నకిలీ నోట్ల వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు తేలిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అనంతపురానికి చెందిన రాజు, సురేష్‌లతో పాటు విజయవాడకు చెందిన మరికొందరు కీలక వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. ఈ నకిలీ కరెన్సీని రాష్ట్రవ్యాప్తంగా వివిధ వ్యాపార కేంద్రాలు, నగరాలు, పట్టణాలు, ఇతర రద్దీ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో చెలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు జరిపిన ఈ విస్తృత సోదాలల్లో నిందితుల రూమ్ నుండి దొంగ నోట్లను ముద్రించేందుకు ఉపయోగించే అత్యాధునిక కలర్ ప్రింటింగ్ మిషన్లు, స్కానర్లను, కొన్ని సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నోట్ల డిజైనింగ్, సాఫ్ట్వేర్ మేనేజ్మెంట్ కోసం వాడిన ఒక ల్యాప్టాప్, నిందితుల వద్ద ఉన్న సెల్ఫోన్లను, భారీ మొత్తంలో ముద్రించి రవాణాకు సిద్ధంగా ఉంచిన నకిలీ నోట్లను పోలీసులు సీజ్ చేశారు. సాంకేతిక ఆధారాల కోసం ల్యాప్టాప్, ఫోన్ల డేటాను నిపుణుల విశ్లేషణకు పంపారు. ఈ కేసు విజయవాడ పరిధితో ముడిపడి ఉండటంతోపాటు అక్కడి నుంచే ప్రధాన నిందితులకు ఆదేశాలు అందుతుండటంతో.. అరెస్ట్ చేసిన రాజు, సురేష్ లను విజయవాడ పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం భారీ భద్రత నడుమ విజయవాడకు తరలించారు. ఈ ముఠాలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? వీరికి కరెన్సీ కాగితాలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి? ఇప్పటివరకు మార్కెట్లోకి ఎంత మొత్తంలో నకిలీ కరెన్సీని చలామణి చేశారు. అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. పండుగల సీజన్, వ్యాపార లావాదేవీలు ఎక్కువగా జరిగే సమయంలో ఇలాంటి నోట్లు మార్కెట్లోకి వస్తే ఆర్థిక వ్యవస్థకు, సామాన్య వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రజలు కూడా నగదు తీసుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## దివ్యాంగుల సాధికారతపై జాతీయ అవార్డులకు నామినేషన్లు ఆహ్వానం

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగుల సాధికారతజాతీయ అవార్డులకు అర్హులైన వ్యక్తులు, సంస్థల నుండి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారత విభాగం తెలియజేసిందని రాష్ట్ర దివ్యాంగులు, ట్రాన్సు జెండర్స్, సీనియర్ సిటిజన్స్ శాఖ సంచాలకులు యం.వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

దివ్యాంగుల సాధికారతకు వినూత్న రీతిలో విశేష కృషి చేసి వారి జీవన విధానాన్ని మెరుగుపర్చేందుకు పాటుపడిన వారిని గుర్తించి గౌరవించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సాధికారత జాతీయ అవార్డులను ఇవ్వనుందని తెలిపారు. దివ్యాంగుల సాధికారతకు సంబంధించి నేషనల్ అవార్డు ఫర్ ఇండివిడ్యువల్ ఎక్సెలెన్స్ 2026, నేషనల్ అవార్డు ఫర్ ఇనిస్టిట్యూషన్స్ ఎంగేజ్డ్ ఇన్ ఎంపవరింగ్ పెర్సన్స్ విత్ డిజబిలిటీస్ 2026 పేరిట ఈజాతీయ అవార్డులను ప్రదానం చేయనుందని డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

ఈఅవార్డులకు సంబంధించిన పూర్తి ఎలిజిబులిటీ క్రైటీరియు, నామినేషన్ల పంపే విధానం తదితర వివరాలు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ లో జాతీయ అవార్డు మార్గదర్శకాల్లో పొందుపర్చబడి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈఅవార్డులకు సంబంధించిన దరఖాస్తులు, నామినేషన్లను ఈనెల 31వ తేదీలోగా ఆన్లైన్ విధానంలో సమర్పించేందుకు అందుబాటులో ఉంటుందని డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు. కావున రాష్ట్రంలోని అందరు జిల్లా కలక్టర్లు, వివిధ శాఖల విభాగాధిపతులు ఈసమాచారాన్ని క్షేత్రస్థాయి వరకు చేరవేసి అర్హులైన వ్యక్తులు, సంస్థల నుండి దరఖాస్తులు, నామినేషన్లు సకాలంలో చేరే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

## రాజధాని అమరావతి పనుల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్ష

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని పనుల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్షించారు. అమరావతిలో ప్రాజెక్టుల వారీగా పనుల పురోగతిపై చర్చించారు. ఆటంకం లేకుండా పనులు జరుగుతున్నాయని ఇంజినీర్లు వివరించారు. పరిపాలన అనుమతులు పొందిన ప్రాజెక్టులకు టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారంపై మంత్రి నారాయణ చర్చించారు. వీలైనంత త్వరగా అధికారులు, ఉద్యోగుల నివాసాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## 'భావప్రకటన స్వేచ్ఛ అంటే అసభ్య పదాలకు లైసెన్స్ కాదు్ణ

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** సామాజిక మాధ్యమం ద్వారా ఎవ్వరి మనోభావాలను దెబ్బతీసినా ఊరుకునేది లేదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే అసభ్యపదాలకు లైసెన్స్ కాదని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం వ్యూస్ పెంచుకోవడం, బ్లాక్‌మెయిలింగ్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరును ఉపయోగించడం సరికాదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రశ్నించే హక్కుంది.. కానీ హద్దులు దాటే హక్కు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రుషికొండ ప్యాలెస్ అంశంపైనా మంత్రి స్పందించారు. రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటకాభివృద్ధి, ప్రజల సందర్శన కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఓఐ)ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ.7 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇకపై పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.





## 6శాతం ఆర్‌డిఎఫ్ వినియోగించాలి

**స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి**

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సిమెంటు కంపెనీలు తమ ఇంధన అవసరాల్లో 6శాతం రిఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయల్ (ఆర్డీఎఫ్)ను తప్పనిసరిగా వినియోగించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ఆదేశించారు. విజయవాడ గురునానాక్ కాలనీలోని ఏపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పిసిబి) కార్యాలయంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని సిమెంటు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా పట్టాభి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ఈఏడాది ఏప్రిల్‌లో జారీచేసిన నిభందనల ప్రకారం సిమెంటు కంపెనీలు లెగసీవేస్ట్, ఫ్రెష్‌వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలలో తయారయ్యే ఆర్డీఎఫ్‌ను వినియోగించాలన్నారు. ఆర్డీఎఫ్ వినియోగంపై సిమెంటు కంపెనీలు ఖచ్చితమైన టైమ్‌లైన్‌ను అందచేయాలని కోరారు.

సిమెంటు కంపెనీలు ఆర్డీఎఫ్ వినియోగానికి అనువైన యంత్రాలను రిట్రోఫిటింగ్ సత్వరమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా కంపెనీల ఆర్డీఎఫ్ వినియోగంపై స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్, పొల్యూషన్ కంట్రోలు బోర్డులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటాయని, దీనికోసం ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. నిబంధనల ప్రకారం ఆర్డీఎఫ్ వినియోగించని కంపెనీలపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధ్ర కార్పోరేషన్ యండి బి. అనీల్‌కుమార్ రెడ్డి, పిసిబి సభ్యులు ఆర్.శర్వణ, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ యం.రాజశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాత ఆలయాలకు పూర్వవైభవం

**• మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం పనులకు మంత్రి లోకేష్ శంకుస్థాపన**



**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జీర్ణావస్థలో ఉన్న పురాతన ఆలయాలన్నింటికి పూర్వ వైభవం తీసుకుని వస్తామని పనులకు మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. ఆలయాల విశిష్టతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేపడతామని తెలిపారు. ప్రాచీన దేవాలయాలు మన చరిత్ర, సంస్కృతికి నిదర్శనాలన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మంగళగిరి దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నూతన యాగశాల నిర్మాణంతో పాటు వాహనశాల, గంటా మండపం పునర్నిర్మాణం, శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన నమూనా చిత్రాలను పరిశీలించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని, రాజ్యలక్ష్మీ మ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం చేసిన స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాదాయ శాఖ నిధులు రూ.6.3 కోట్ల వ్యయంతో శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణతో పాటు యాగశాల, గంటా మండపం, వాహనశాల పునర్నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా దేవాలయం అంతా పరిశీలించిన అనంతరం మంత్రి లోకేష్ అధికారులకు పలు సూచనలు చేశారు.

భక్తులకు కావాల్సిన వసతులు, ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై మాస్టర్ ప్లాన్ రూపొం దించాలని అధికారులను ఆదేశిం చారు. ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా ఆయా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి లోకేష్ సూచించారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కల్పించడంతో పాటు నిత్యప్రసాదానికి చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరిణిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందరితో కలిసి మంత్రి లోకేష్ ఫోటోలు దిగారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**తోతాపురి మామిడి రైతులకు కేంద్రం శుభవార్త**

**ఆదాయం పెంపునకు మార్గాలు అన్వేషణ**
**ధరలు తగ్గడానికి దారితీసిన కారణాలపైనా విశ్లేషణ**

## ఐసిఎఆర్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న ధరల పతనం సమస్యను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో తీసుకుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన విజ్ఞప్తికి వెంటనే స్పందించిన కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తోతాపురి మామిడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారని మంత్రి తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందు లను గుర్తించిన కేంద్ర మంత్రి, ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారని వెల్లడించారు.

ఈ కమిటీలో ఐసీ ఏఆర్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వ విద్యాలయ నిపుణులు, రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. తోతాపురి మామిడి సాగు ప్రాంతాలను సందర్శించి రైతులు, పల్ప్ పరిశ్రమలు, ఎగుమతి దారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రభుత్వ అధికారు లతో చర్చించి సమస్యల మూలాలను అధ్య యనం చేసి ఆచరణ సాధ్యమైన సూచనలు అందించనుందని చెప్పారు.

ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుం దని, అవసరమైన సమాచారం, సమన్వయం కల్పించి త్వరిత గతిన నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

రైతుల ఆదాయాన్ని పెంచడం, ఉద్యాన రంగాన్ని మరింత బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తుండటంతో తోతాపురి మామిడి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తోందని, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంపై ఇదే విధంగా చొరవతో చర్యలు కొనసాగిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**అరకు పార్లమెంట్‌లో పరిస్థితులపై మంత్రి లోకేశ్‌తో మంత్రి సంధ్యారాణి చర్చ**

విజయవాడ, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి: అరకు పార్లమెంట్‌లో పరిస్థితులపై మంత్రి లోకేశ్‌తో మంత్రి సంధ్యారాణి చర్చించారు. అరకు లోక్‌సభ నియోజకవర్గంలో కార్యక్రమాల పురోగతి నివేదికను సంధ్యారాణి మంత్రి లోకేశ్‌కు అందించారు. అనంతరం ఆ నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతంపై చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించిన ఇరువులు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 9 ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని లోకేశ్ సూచించారు. ఈ క్రమంలో త్వరలోనే అరకులోని 7 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించాలని మంత్రులు నిర్ణయించారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**• కొనుగోళ్లలో అక్రమాలు, కంపెనీల సిండికేట్‌ను సహించం • మంత్రి అచ్చెన్నాయుడు**

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రస్తుత పరిస్థితిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉన్నతస్థాయి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా ఎస్‌బీవీ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న అన్ని పొగాకు ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను వెంటనే పూర్తి స్థాయిలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు సంస్థ తప్పనిసరిగా ఆక్షన్లలో పాల్గొనాలని, ఆక్షన్లకు దూరంగా ఉండే కంపెనీలపై టొబాకో బోర్డు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా టొబాకో బోర్డు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించిన మంత్రి, కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి నాణ్యమైన బేల్స్‌పైనా సీలింగ్ విధించి కృత్రిమంగా ధరలు తగ్గించే ప్రయత్నాలు చేస్తే ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని హెచ్చరించారు. అలాంటి చర్యలు నిర్ధారణ అయితే సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను ఆదేశించారు.



పొగాకు రిజెక్షన్ రేటును గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించిన మంత్రి, అన్ని గ్రేడ్‌ల పొగాకును కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు టొబాకో బోర్డు సూచనల మేరకు మాత్రమే తమ పొగాకును ఆక్షన్‌కు తీసుకురావాలని కోరారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు రిజెక్షన్ రేటు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. పొగాకును వెంటనే విక్రయించకుండా నిల్వ ఉంచాలనుకునే రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా టొబాకో బోర్డు, బ్యాంకర్లతో చర్చించి రుణ సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, పొగాకు రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సహచర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు స్వయంగా ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడైనా కంపెనీల సిండికేట్ లేదా అక్రమాలు వెలుగుచూస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగే పరిస్థితిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదు. ప్రతి రైతుకు న్యాయమైన ధర లభించేలా, కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. అక్రమాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 6న ఉచితంగా ర్యాబిస్ నివారణ టీకాలు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త:** ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్‌జిల్లా వ్యాప్తంగా పశువైద్యశాలల్లో ఉచితంగా ర్యాబిస్‌వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జునోసిస్ దినోత్సవ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాపశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అన్ని పశువైద్యకేంద్రాలలో కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నామని పెంపుడుకుక్కల యజమానులు ఈఅవకాశాన్ని వినయోగించుకోవాలని ఆయన కోరారు. కుక్కల నుండి మనుషులకు సోకే ప్రాణాంతకమైన ర్యాబిస్ వ్యాధికి మందులు లేవని నివారణ ఒక్కటే మార్గమన్నారు. యజమానులు తమ కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ సునంద, డాక్టర్ మనోజ్, డాక్టర్ పంకజ్ పాల్గొన్నారు.

**బంగారం వేలం నోటీసు**
**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");**
**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి - పూణె రోడ్డు, అకుర్ది, పూణె 411035**
BAJAJ FINANCE

రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన రుణగ్రహీతలకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికి తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా రుణగ్రహీత(లు) అందచేసే గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది: 1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు), 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్దం ఉన్నాయి 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹ 25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి. వేలం తేదీ లో సదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన సేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏవైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(10-08-26): **అమలాపురం - మెయిన్ రోడ్;** PGC2SGL26494049. **అనకాపల్లి - భార్గవి ప్లాజా;** PBV8SGL25427941, 27745386, 27710897, 28050478, 28519525. **కళ్యాణదుర్గ్ - కళ్యాణ్దుర్గ్ రోడ్;** PIV9SGL17875216, 18034344, 25437948, 25655674, 27215376. **అనంతపుర్ - సుభాష్ రోడ్;** PGA7SGL18081949, 18143229, 24261155, 26746548, 28118932, 28259820. **బద్వేల్ - ఫోర్ రోడ్ సర్కిల్;** PJU6SGL12490693, 26967983, 27016837, 27174969, 27352910, 27343847, 27696093. **బాపట్ల - జీ బీ సీ రోడ్;** PLN3SGL28539664. **భీమవరం - ప్రకాశ్ చౌక్;** PEG7SGL23756437, 24942681. **బొబ్బిలి - పెద్ద బజార్ మెయిన్ రోడ్;** PKI4SGL25471187, 27040237, 27535436, 27791604. **చిలకలూరిపేట్ - ఎన్ఆర్‌టి సెంటర్;** PJU5SGL16497144, 24026028, 24295817, 28951075. (11-08-26) **చిరాల - సంత బజార్;** PEJ9SGL17543666, 25541171, 26778709, 27061908. **గుడివాడ - బీజీఎల్;** PNS1SGL24892602, 27206247, 27210441. **గూడూర్;** P5N7SGL11077555. **గుంటకల్ - వెజిటబుల్ మార్కెట్;** PBV9SGL13853488, 15373531, 17651590, 17690245, 17691566, 25423900, 25721598, 27420138, 28021259. **గుంటూర్ - మంగళగిరి;** POL8SGL28264365. **గుంటూరు - వినుకొండ;** PMM3SGL16545788, 17909237. **హిందూపుర్ - ధన లక్ష్మి రోడ్;** PEG4SGL24303046, 26194560, 26800830, 27197524, 28258810, 28319139. **జంగారెడ్డిగూడెం - ఏలూరు మెయిన్ రోడ్;** PGH1SGL24097496. **కదిరి - ఎన్‌టీఆర్ సర్కిల్;** PIW8SGL26221999, 26189181, 26447139, 26472705, 27044575, 27599732, 28275771, 28511068, 28877582. (12-08-26) **కాకినాడ - సర్పవరం జంక్షన్;** PIW2SGL29075805, 29085658. **కాశీబుగ్గ - కేటీ రోడ్;** PEG5SGL25655738. **మదనపల్లె - ఎన్‌టీఆర్ సర్కిల్;** PEG6SGL18020553, 24486214, 24931249, 26721772, 26970701. **నందిగామ - మెయిన్ రోడ్;** PLN1SGL16188334, 25548558, 27067555, 27338052. **నంద్యాల్ - శ్రీనివాస్ నగర్;** PEO1SGL10385305, 25467193, 26245041, 27546369. **నర్సారావుపేట్ - అరుండేల్‌పేట్;** PEO2SGL13852828, 14171625, 17866316, 26427116. **నర్సీపట్నం - మెయిన్ రోడ్;** PIW7SGL28864538. **నెల్లూర్ - బీజీఎల్;** PNZ6SGL28032160, 28252862. **నెల్లూర్ - కనకమహల్ సెంటర్;** P19ISGL15452905, 15451073, 15452473, 27614630. (13-08-26) **నెల్లూర్ - నవాబ్‌పేట్;** PXB4SGL26172039, 28019740. **నెల్లూర్ - వేదయపాలెం;** PXB5SGL24752721, 28653393. **ఒంగోలె అద్దంకి - బస్ స్టాండ్ సెంటర్;** PEJ8SGL11930110, 17790340, 25836490, 27172888. **పార్వతీపురం - ఆర్‌టీసీ బస్ స్టాండ్;** PML2SGL25556291, 27596908. **పీలేరు - కడప రోడ్;** PEG3SGL25485940, 28132437. **పొన్నూర్ - బస్ స్టాండ్;** PLN2SGL27186782, 28546962. **పులివెందుల - అంకలమ్మపేట్;** PMM4SGL27158625, 27156901. **రైల్వే - కోడూరు నేతాజీ రోడ్;** PGC5SGL25101202, 25084985, 25418441, 27333699, 29062372. **రాజమండ్రి - దేవీ చౌక్;** PBW3SGL25699104. (14-08-26) **రాయచోటి - బంగ్లా రోడ్;** PBW4SGL23767164, 24904656, 24948977, 25661201, 26452593, 27169521, 27780633, 28028230. **శ్రీకాకుళం - రామలక్ష్మణ్ జంక్షన్;** PBW5SGL26817247, 27751487, 28013231. **శ్రీకాళహస్తి - మెయిన్ రోడ్;** PGC6SGL27257799. **శృంగవరపు - కోట;** PBW6SGL27564977, 28245784, 28476018. **సుళ్లూర్‌పేట - పాండు రంగ స్ట్రీట్;** PBW7SGL25837627, 26710044, 27356226, 27346864. **తాడిపత్రి - యల్లనూర్ రోడ్;** PBW8SGL26807364. **తెనాలి - గాంధీ చౌక్;** PEK2SGL17403182. **తిరుపతి - బైరాగి పట్టెడ;** PMB8SGL27195006, 27369572. **తుని - సినిమా రోడ్;** PBW9SGL27408477, 27404454. (17-08-26) **విజయవాడ - అజిత్ సింహ్ నగర్;** PLB9SGL15501837, 17964132, 17939568, 18047057, 24885157, 26246286, 26832737, 29080824. **విజయవాడ - భవానీపురం;** PMB1SGL8867798, 14265401, 27348422. **విజయవాడ - విద్యా నగర్;** PMB3SGL24916053. **విజయవాడ - ఏలూరు రోడ్;** PMB2SGL12794290, 14107925. **విజయవాడ - గవర్నర్పేట్;** PMB7SGL27201580, 27730000, 28698511. **విజయవాడ - ఇబ్రాహీంపట్నం;** PMB6SGL14218689, 17564994, 17777551, 18208226, 24627529, 25696378, 28151643. **విజయవాడ - మొఘల్‌రాజ్‌పురం;** PGA8SGL27052507, 28293918, 28904564. **విజయవాడ - రామవరపాడు;** PMB5SGL13097094. **విజయవాడ - సత్యనారాయణపురం;** PMB4SGL18333863. (18-08-26) **వైజాగ్ - బీజీఎల్;** PNQ5SGL26847019, 27198833, 27783829, 28700011, 28659290. **వైజాగ్ - దాబాగార్డెన్స్;** PI55SGL27520779. **వైజాగ్ - ద్వారకానగర్;** PI52SGL27248541, 28248590, 28494350. **వైజాగ్ - గోపాలపట్నం;** PB91SGL28691258. **వైజాగ్ - హెచ్‌బీ కాలోనీ;** PI58SGL28955331. **వైజాగ్ - కంచరపాలెం;** PI54SGL24596758, 25747481, 26431695, 26452234, 27399324. **వైజాగ్ - కూర్మన్నపాలెం;** PI57SGL17566811. **వైజాగ్ - మధురవాడ;** PI93SGL25443908, 25890393, 27055037, 27052951, 27587977, 28863079. **వైజాగ్ - మురళీనగర్;** PML1SGL24916114. (19-08-26) **వైజాగ్ - నాడ్ జంక్షన్;** PI94SGL26864082, 26843135, 27062187. **వైజాగ్ - కొత్త గాజువాక;** PI53SGL16698991, 27718220. **వైజాగ్ - పాత గాజువాక;** PB47SGL17823884, 25477128, 26760176, 27534648. **వైజాగ్ - పెదగంట్యాడ;** PMK9SGL24716293. **వైజాగ్ - పెద్దవాల్తేర్;** PI56SGL24405448, 27417036. **వైజాగ్ - పెందుర్తి;** PI92SGL15456300, 16368133, 17444456, 23813571, 24983175. **వైజాగ్ - రవీంద్ర నగర్;** PI95SGL15075404, 28561501, 29063323. **విజయనగరం - ఫోర్ట్ ప జీ రోడ్;** PBX1SGL15412457, 24059922, 28477852. **విజయనగరం - ఎంజీ రోడ్;** PCZ4SGL26214130.

**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

వార్త

మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

- సెయింట్ థెరిస్సా

# కాయకష్టానికి కర్పూర తైలం

విధి విధానాల మార్పులతో పాత ఉపాధి పథకం కొత్త ఉపాధి పథకంగా కొత్త పేరుతో బయటికొచ్చేసింది. ఏ పథకమైనా ఏలిన వారు ఉద్దేశ్యం ఒకటైతే దాని అమలులో విఫలమవడం తథ్యమంటూ విపక్షాల శాపనార్థాలతో వెలుగు చూడటం కద్దు! మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకాన్ని కొన్నికొత్త అంశాలు చేర్చి వివిజి రామ్‌జీ చట్టంగా జనంలోకి తెచ్చారు. కొత్త చట్టంలో రాష్ట్రాలపై పెను భారం మోపగల నిబంధనలున్నాయని ఇప్పుడువిపక్షాలు గగ్గోలు పెడుతుండటం తెలిసిందే. ఈ పథకం మార్పుతో వివిధ రాష్ట్రాలను సమాయత్తపరిచేందుకు న్యూఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విపక్షాలు గట్టిగానే ఆ పథకంలో మార్పులను సూచించారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ హయాంలో అంకురార్పణ ఈ 'ఉపాధి హామీ' చట్టాన్ని తప్పనిసరిగా మార్చాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయించుకున్నాక ఉపాధి హామీ పనికాలాన్ని పెంచింది. అంతే తప్ప పథకం మెరుగుదలకు ప్రత్యేక మార్పులేవీ ఉన్నట్లు లేదు. గతంలో పదేళ్లకుపైగా ఈ పథకం గ్రామీణ ఉపాధి హామీ పథకంగా నిరంతరాయంగానే సాగినా వ్యవసాయరంగానికి తూట్లు పొడిచింది. కూలీలకు, శ్రామికులకు ఉపాధి నిధులు ముడుతున్నందున ఈ పథకం లబ్ది ద్వారా వారు ఆయా కూలీల కుటుంబాల్లో వెలుగునింపాయనడంలో ఎవరికీ ఏఅభ్యంతరం లేదు. ఈ పథకం కింద నిర్దేశిత రోజులుమాత్రమే కూలీలకు సొమ్ము ముట్టేది. గ్రామీణ ఉపాధి పనులన్నీ వ్యవసాయానికి సానుకూల పనులు కానందున వారంతా వ్యవసాయ పనుల అలవాట్ల నుంచి దూరంగా జరిగారు. కాయకష్టం చేసుకునే వారికి ఏపనైనా ఒకటే అంటుంటారు. కాగా వారు వ్యవసాయేతర పనుల అలవాట్లు తగ్గాయి. నిర్దేశిత పనుల్లోనే కాలక్షేపం చేసి వ్యవసాయ పనుల విషయంలో నైపుణ్యత కోల్పోయారు. ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీల వేతనాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా భరించేది. అందుచేత రాష్ట్ర ప్రభుత్వం జోక్యం ఎలాగూ ఉండేది కాదు. చాలీచాలని నిధులతో వివిధ పథకాల నుండి సర్దుబాటు చేసే స్థాయికి చేరుకున్నారు. కేంద్రం నిధులు అందించని సమయాల్లో ఉపాధి కూలీలు ఇబ్బందిపడేవారు. తాజాగా చూస్తే ఉపాధి కూలీలకు 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం మీద భారం పడేది. మెటీరియల్ కాంపొనెంట్‌లో కూడా 25 శాతం కేంద్రం ఇచ్చేది. మార్చిన పేరెలా ఉన్నా, మార్చిన విధానాల మేరకు 60:40 నిష్పత్తిలో ఖర్చు చేయాల్సి వచ్చింది. దామాషా నిర్ణయాలలో లెక్క చూస్తే తెలంగాణ వాటాగా 2వేల కోట్ల వరకు ఆర్థిక భారం పెరుగుతుంది. అదీగాక కొత్త చట్టం వివిజి రాంజీ ప్రతిపాదించిన కొన్ని నిబంధనలలో పేదలు వ్యవసాయ కూలీలు, గ్రామీణ కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా రూపొందించారనే ఆరోపణలున్నాయి. రాష్ట్రాల అభిప్రాయం తీసుకోకుండా వారిపై ఆర్థిక భారం మోపడం సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం అభిప్రాయపడ్తోంది. కొత్తచట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రాలకు 60శాతం నిధులందిస్తుంది. మిగిలిన నిధులు 40 శాతం రాష్ట్రాలే భరించి 'వివిజి రామ్‌జీ' పథకం విజయం పొందినట్లుగా చెప్పుకోవాలి. ఇలా అదనపు భారం భరించలేని తెలంగాణ రాష్ట్రం ఈ పథకం అమలులో మీమాంసలు వ్యక్తం చేస్తోంది. దేశ వ్యాప్తంగా ఈపథక నిర్వహణ పట్ల ఏరాష్ట్ర ప్రభుత్వమూ సానుకూలంగా లేదు. 'రామ్‌జీ' చట్టం గ్రామీణ పేదల పని హక్కును బలహీనపరచడంతోపాటు గ్రామీణ పంచాయతీల అధికారాలను తగ్గించి రాష్ట్రాల పాత్రను పరిమితం చేస్తోందన్న ఆరోపణ తెలంగాణ ప్రభుత్వానిది. తమ వంతు నిధుల బాధ్యతలను స్వీకరించకుండా తమ పాత్ర తగ్గిపోతోందనడం కరెక్ట్‌గా లేదని పథకం రూపురేఖలు, ప్రయోజనాలు సైతం మారినందున 'జీ రాంజీ'ని నిర్వహించాల్సిందేనని కేంద్రం స్పష్టం చేస్తోంది. ప్రణాళిక, పనుల ఎంపిక, నిధుల కేటాయింపు, అమలు పర్యవేక్షణ వంటి అంశాల్లో కీలకఅధికారాలను కేంద్రం వద్దనే ఉంచుకోవడం రాష్ట్రాలను కించపరచడమేనని ఆయా రాష్ట్ర ప్రభుత్వాల భావన. ఏది ఏమయినా కేంద్రం రాష్ట్రాలతో చర్చించకుండా అధిక భారం మోపడం లోపభూయిష్టమే. వీబీ -జీరామ్‌జీ పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక భారం అనే అంశం తప్పిస్తే చాలా ప్రయోజనాలున్నాయనే చెప్పాలి. గతం కన్నా ఈసారి కూలీల వేతనం పెరిగింది. అప్పట్లో ఉపాధికూలీలు ఈ పథకం ఆసరాచూసుకుని కూలీ పనులకు ఎవరూ వచ్చేవారు కాదు. వ్యవసాయానికి కూలీలు దొరికే వారు కాదు. దాంతో సాగు ఖర్చులు రైతుకి బాగా పెరిగిపోయాయి. ఇప్పుడు'ఉపాధి కూలీ రేట్లు పనిచేయదగిన పనిరోజులు కూడాపెరిగాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఈ పథకానికి వ్యవసాయానికి అనుబంధంగా రూపకల్పన చేస్తే ఉభయ తారకంగా ఉంటుందని రైతు సంఘాలు కోరుతున్నాయి. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టం 'జీ రామ్ జీ' వేతనాలు పెరిగాయి. కాబట్టి కూలీల ఉపాధి సొమ్ము కూడా వారికి అందుబాటులోనే. దీనిని వ్యవసాయదారుల పనులకు అనుసంధానిస్తే ప్రభుత్వం ఇచ్చే నెలబాటు ఖర్చుకి తోడు రైతులు కూడా మరికొంత సొమ్ము చెల్లిస్తారు. కనుక కూలీల ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయానికి కూలీల లభ్యతపై నీలినీడలు ఏర్పడవు. ఉపాధిహామీ పథకంలో యేటా కనీసపనిదినాలను తాజాగా 125 రోజులకు పెంచారు. రోజువారీ వేతనం గరిష్టంగా రూ.409గా కనిష్టం రూ.300గా ఖరారయ్యాయి. ఈ నేపథ్యంలో కొన్ని రాష్ట్రాల్లో కూలీల జీతనాతాలు పెరిగినట్లే! కానీ మోయాల్సిన నిధుల భారం తలకెత్తుకుంటే రేపో మాపో రాష్ట్రాలు చేతులెత్తేస్తే కూలీల నోట్లో మన్ను తప్పదు.

సముద్రాన్ని దాటడానికి నావ వలే, స్వర్గానికి సత్యమొక్కటే సోపానంగానీ వేరొక దారిలేదు.



స్వామి వివేకానంద

నౌకకు అండగా నిలిచే నీళ్లే ఒక్కోసారి నౌకను తలకిందులు కూడా చేయగలవు.



తిరువళ్లువర్

## ప్రజావాక్కు

### నదుల అనుసంధానం అవసరం

**ఉత్తరాన** గంగా, దక్షిణాన కావేరి నదుల అనుసంధానం భారత జలవనరుల చరిత్రలో విప్లవాత్మక అడుగు అవుతుంది. దేశంలో నీటి కొరత కంటే నీటి అసమాన పంపిణీ ప్రధాన సమస్య. వరదల సమయంలో సముద్రంలో కలిసిపోయే మిగులు జలాలను కరువుప్రాంతాలకు మళ్లించగలిగితే సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారంలభిస్తుంది. వ్యవసాయ ఆధారితదేశమైన భారత్‌కు నదుల అనుసంధానం ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది అవుతుంది. తుంగభద్ర డ్యామ్ 33క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్రజలశక్తిమంత్రి సమక్షంలోఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొనడం సహకార సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనం. 2024లో 19వ గేటు దెబ్బ తిన్నతర్వాత స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేసి, అనంతరం రూ.51 కోట్లతో కొత్త గేట్లను ఏర్పాటు చేయడం రైతుల ప్రయోజనాలను కాపాడింది. ఈసందర్భంగా చంద్ర బాబు నాయుడు గోదావరి-కావేరి, తదుపరి గంగా-కావేరీ అనుసంధానం దేశభవిష్యత్తుకు అత్యవసరమని పేర్కొన్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సర్వేయర్‌లతో భూ కబ్జాలు సరి చేయండి

**మండల** కేంద్రాలలో ఉన్న కాలనీలలో భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. రెవిన్యూ అధికారులు పోలీస్ సిబ్బందితో కలిసి భూమి కబ్జాల దరఖాస్తులు పరిష్కారం చేయాలి. ఎస్సి, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన ఇండ్ల స్థలాలు కూడా కబ్జాలు జరిగి అక్రమ మరుగుదొడ్లు నిర్మాణం చేయడం జరిగింది. కావున తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ శాఖ రికార్డ్‌లు తీసి సర్వేయర్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భూమి కబ్జాలు పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### అందరినీ సమానంగా చూడాలి

నేటి సమాజంలో ఒక తల్లి తన కొడుకుల్ని ఒకరిని ఎక్కువ ఒకరిని తక్కువ చేస్తుండడం వలన కుటుంబ వైరాలు పెరిగి గొడవలు జరుగుతున్నాయి. తల్లి అందరినీ సమానంగా చూసి అందరూ ఎదిగే విధంగా చూస్తేనే ఆ తల్లి జన్మకు ముక్తి లేదంటే ఈ జగత్తులో జీవించి వృథా.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### మద్యాన్ని నిషేధించేదెప్పుడు?

**మద్యపానం** నేడు అనేక కుటుంబాల ఆనందాన్ని దూరం చేస్తున్న ఒక ప్రమాదకరమైన దురలవాటు. క్షణిక సుఖం కోసం మద్యాన్ని ఆశ్రయించే వారు తెలియకుండానే తమ ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితిని, కుటుంబ బంధాలను కోల్పోతున్నారు. మద్యం వల్ల శారీరక, మానసిక సమస్యలు పెరిగి జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురికావడంతో పాటు పిల్లల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుంది. తాత్కాలిక మత్తు ఇచ్చే మద్యం శాశ్వత నష్టాలను మిగులుస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకొని మద్యానికి దూరంగా ఉండడంద్వారా వ్యక్తి, కుటుంబం, సమాజం అభివృద్ధి పథంలో పయనించగలవు. మద్యాన్ని ఎంత త్వరగా నిషేధిస్తే అంత మంచిది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### జీతాల పెంపు అవసరం

**దేశంలో** జరిగే ప్రతీ ఆర్థిక లావాదేవీలు, ధరల పెరుగుదలలు, పన్నులు అన్నీఉద్యోగుల జీతాలు పెంచితే ఆగిపోతాయి. అందువల్ల అందరికి జీతాలు పెంచాలా అనే భావన ప్రతీ రాజకీయ నాయకుడికీ ఉంది. మరి వారు ఒక వేలు చూపితే నాలుగు వేళ్ళు వారిని వెక్కిరిస్తూ.. అయ్యా మీ విదేశాల ట్రిప్పులు, సెక్యూరిటీ ఖర్చులు, వాహనాలు మీ వేతనాలు, మీ సమావేశాల అతిఖర్చులు, మాట్లాడితే మీ తాతల విగ్రహాలు, మీ ప్రసంగాలు, మీ సినీటైపు కార్ల ఊరేగింపులు ఇంకా చాలా ఉన్నాయి. వీటికి ఖర్చు ఎక్కువే. అందుకని అయ్యా.. ఓ మోస్తారు జీతాల పెంపుదలకే తలనొప్పి వస్తే ఇక 6 నెలల ఎరియర్స్‌కు మీకు ఎలాటి ఇబ్బంది వస్తుందో ఆలోచించండి.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### వనరులను దుర్వినియోగం చేయొద్దు

**పాలకులు** పంచుతున్న ఉచితాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింత క్రుంగదీస్తున్నాయి. అధికారం కోసం ఎవరికి తోచిన విధంగా వారు ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత బియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ఇలా అన్ని ఉచితాలు ఇస్తుపోతూ రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. అర్హులను ఆదుకుంటే పర్వాలేదు. కానీ, చాలా మంది అనర్హులు ఉచిత పథకాలవల్ల లబ్ధి పొందుతున్నారు. దాంతో ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది. నిరుపేదలకు మాత్రమే ఉచితాలు ఇస్తే బాగుంటుంది. ముందస్తు ప్రణాళికతో వనరులను సమకూర్చుకోవడం, వాటిని దుబారా చేయకుండారేపటికోసం దాచుకోవాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక విధానాలపై ఆత్మపరిశీలన?

**శక్తికి మించిన సహకారం కానీ, సహాయం కానీ చివరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేయడం అంత మంచిది కాదు. మోయలేని భారం తలకెత్తుకుంటే మొదటికే మోసం వస్తుందన్న విషయం విస్మరించకూడదు. ఏదో ఒకటి, రెండు సందర్భాల్లో అయితే అర్థం చేసుకోవచ్చు, అభినందించవచ్చు. కానీ అదే పనిగా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకుండా అందిన కాడికి అప్పులు తెచ్చి ఖర్చుపెడితే అది వ్యక్తికి కానీ, సంస్థకు కానీ, ప్రభుత్వానికి కానీ ఒకనాటికి చేతులు ఎత్తక తప్పదు. దివాలా బాటపట్టక తప్పదు. ఇదేమీ కొత్త విషయం కాదు. అందరికీ తెలిసిందే. ఎన్నో సంస్థలు వ్యక్తులు చివరకు ప్రభుత్వాలకు కూడా ఒకనాడు ఎంతో దేదీప్యమానంగా వెలుగొంది ఆ బాటలో నడిచి పతనావస్థకు చేరుకున్న ఉదాహరణలు కోకొల్లలు. ప్రపంచంలో ఎన్నో దేశాలు అవగాహన, భవిష్యత్ దృష్టి లేని నిర్ణయాలతో అతలాకుతలమై పతనాంచుకు చేరుకున్న విషయం తెలియందేమీకాదు. పొరుగునున్న శ్రీలంకను తాజాగా ఉదహరించవచ్చు.**

దామెర్ల సాయిబాబ

చాలా రోజుల తర్వాత కలిసిన మిత్రుడిని పరామర్శిస్తూ ఎలా ఉన్నావు? ఏం చేస్తున్నావు అని అడిగాడట ఒక పెద్ద మనిషి. నాకేంటి హాయిగా సొంత ఊర్లో కడుపులో చల్ల కదలకుండా వ్యవసాయం చేస్తున్నానని జవాబు ఇవ్వడంతో, ఎన్ని నాగళ్ల వ్యవసాయమని ప్రశ్నించాడట. నాది మా పటేల్‌ది కలిస్తే వంద నాగళ్ల వ్యవసాయమని ఠకీమని జవాబు చెప్పాడట. కానీ ఆయన వేషభాషలో, వ్యవహార తీరు చూస్తే ఆ స్థాయిలో ఉన్నట్లు కన్పించకపోవడంతో ఆ వంద అరకలకు సంబంధించి రెండు వందల ఎడ్లలో నీవెన్ని ఎడ్లంటే ' దొడ్లో కాలు విరిగిన ఎద్దులేస్తే, దొంగలు కొట్టుకుపోయిన ఎద్దు దొరికితే, అత్త వారింటి నుంచి వారు ఇస్తామన్న ఎద్దును తోలుకువస్తే, షావుకారు ఎద్దు కొనుగోలుకు ఇస్తానన్న అప్పు ఇస్తే నావి నాలుగెడ్లు అవుతాయన్నాడట. అంటే ఆయన వద్ద ఉన్నది ఒకే ఒక ఎద్దు. అది కూడా కాలువిరిగి దొడ్లో పడి ఉంది. ఆయన చెప్పుకుంటున్నది మాత్రం రెండువందల ఎడ్లతో వ్యవసాయం చేస్తున్నట్లు. ఇలానే ఉంది దేశంలోని అనేక రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి. ఖజానాలో నిధులు నిల్వలేవు. ఉద్యోగుల జీతభత్యాలు నెలనెలా చెల్లించడం కోసం వెతుకులాడుకోవల్సి వస్తుంది. నిత్యం రుణాల వేటలో చాలా రాష్ట్రాలు మునిగి తేలుతున్నాయి. తెలుగు రాష్ట్రాల పరిస్థితి కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేదు. అభివృద్ధిచేయాలంటే అప్పులు చేయాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. కానీ దానికి ఒక పద్ధతి, విధి విధానాలుండాలి. తీర్చే మార్గాలు ఆలోచించాలి. అవేమీ పట్టించుకోకుండా అప్పు దొరకడమే ఎంతో అదృష్టంగా భావిస్తూ అప్పుల వేటలో నిత్యం అన్వేషణలో ఉండడం ఏమాత్రం సమంజసం కాదు. శక్తికి మించిన సహకారం కానీ, సహాయం కానీ చివరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేయడం అంత మంచిది కాదు. మోయలేని భారం తలకెత్తుకుంటే మొదటికే మోసం వస్తుందన్న విషయం విస్మరించకూడదు. ఏదో ఒకటి, రెండు సందర్భాల్లో అయితే అర్థంచేసుకోవచ్చు, అభినందించవచ్చు. కానీ అదే పనిగా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోకుండా అందిన కాడికి అప్పులు తెచ్చి ఖర్చుపెడితే అది వ్యక్తికి కానీ, సంస్థకు కానీ, ప్రభుత్వానికి కానీ ఒక నాటికి చేతులు ఎత్తకతప్పదు. దివాలా బాటపట్టక తప్పదు. ఇదేమీ కొత్త విషయం కాదు. అందరికి తెలిసిందే. ఎన్నో సంస్థలు, వ్యక్తులు, చివరకు ప్రభుత్వాలకు కూడా ఒకనాడు ఎంతో దేదీప్యమానంగా వెలుగొంది ఆ బాటలో నడిచి పతనావస్థకు చేరుకున్న ఉదాహరణలు కోకొల్లలు. ప్రపంచంలో ఎన్నోదేశాలు అవగాహన, భవిష్యత్ దృష్టిలేని నిర్ణయాలతో అతలాకుతలమై పతనం అంచుకు చేరుకున్న విషయం తెలియందేమికాదు. పొరుగునున్న శ్రీలంకను తాజాగా ఉదహరించవచ్చు. ఇప్పటికీ ఆ దేశం ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకో లేకపోతున్నది. భారత్‌లో ఎన్నో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని ఆర్థిక నిపుణులు ఎంతో కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. డబుల్ ఇంజన్ సర్కారుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రపెద్దల సహాయ సహకారాలతోకొంత మేరకు ఆర్థికపరిస్థితి మెరుగ్గాకన్పిస్తున్నా తెలంగాణ రాష్ట్రంఅప్పుల ఊబిలో కూరుకుపోతున్నదేమోననే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అప్పుల మీద అప్పులు తెచ్చుకుంటున్నారు. ఇష్టానుసారంగా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి

## ఒక్క మాట

అప్పులు డెబ్బైవేల కోట్లరూపాయలలోపలే ఉంటే ఆతర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించిన నిధులతో దాదాపు ఏడెనిమిది లక్షల కోట్లకుపైగా పెరిగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత ప్రభుత్వం చేసిన అప్పుల కిస్తీలు వడ్డీలతో సహా, తాముఎన్నికల్లో ప్రకటించిన హామీలను పూర్తి చేసేందుకు కొత్తగా అప్పులుచేయాల్సి వస్తున్నది. చేసిన అప్పులకు ఏటా ముప్పయ్ వేలకోట్ల రూపాయలకు పైగా వడ్డీయే చెల్లిస్తున్నారు. ఆదాయానికి వ్యయానికి మధ్య నెలకుదాదాపు రెండు వేల రెండువందల కోట్లరూపాయలకు లోటు ఉంటున్నదని ఆర్థికశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పాతపథకాలు రద్దుచేసే పరిస్థితి లేదు. తాము ఎన్నికల్లో ప్రకటించిన పథకాలు అమలు చేయాలంటే నిధుల కొరత, దీంతో అందర్నీ సంతృప్తి పరిచేందుకు విత్త మంత్రి పడుతున్న ఇబ్బందులు, చేస్తున్న విన్యాసాలు అన్నీఇన్నీ కావు. ప్రతి అవసరానికి అప్పులపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. జీతభత్యాలకే కాదు సంక్షేమకార్యక్రమాలకు, ఇతర నిర్మాణాత్మక పనులకు నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితులుఏర్పడుతున్నాయి. 'పిట్టను కొట్టా పొయ్యిలో పెట్ట' అన్నట్లుగా ఉంది ఆర్థికపరిస్థితి. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో చాలాప్రాంతాల్లో కాంట్రాక్టర్లు పనులునిలిపివేశారు, మరికొన్ని ప్రాంతాల్లో పనులు నత్తనడక నడుస్తున్నాయి. ఆలస్యం అయ్యేకొద్దీ వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఆ భార మంతా ప్రభుత్వం మీద పడుతుంది. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సిందే. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నలక్షలాది బలహీన వర్గాలకు చేయూతనివ్వాల్సిందే. వారికి అన్నిరకాల సహకారాలు అందించాల్సిందే. ప్రజాస్వామ్యవాదులుఎవరూ దీనిని వ్యతిరేకించలేరు కూడా. కానీ వారి పేరు మీద జరుగుతున్న దోపిడీ మాటేమిటి? వారిని చూపి అనర్హులకు వందలాది కోట్లు అప్పగించడం ఎంతవరకు సమంజసం? అవినీతి, అభివృద్ధి కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు నడుపుతుంటే అవినీతి వెనక్కి గుంజుతుంటుంది. కానీ ఎక్కడ అభివృద్ధిఉంటుందో అక్కడే అవినీతి ఉంటుంది. వేలాది కోట్ల రూపాయలను వడ్డీకి తెచ్చుకుంటున్న డబ్బును ఇలాదుర్వినియోగం చేయడం ఎంతవరకు న్యాయమో పాలకులు ఒక్కసారి ఆలోచించాలి. ప్రజాసేవ కోసమే ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనట్లుగా చెప్పుకుంటున్న కొందరు నేతలు పర్సెంటేజీలు బాహాటంగా తీసుకుంటున్నారు. బహిరంగంగానే చర్చ జరుగుతున్నది. ఇక కీలక పదవుల్లో ఉన్న కొందరు అధికారుల అవినీతి అదుపు లేకుండాపోతున్నది. ఇటీవల అవినీతి నిరోధక శాఖ చేస్తున్న దాడుల్లో వందలాది కోట్లవిలువైన ఆదాయానికి మించిన ఆస్తులు వెలుగు చూస్తున్నాయి. మొన్న బుధవారం పట్టుబడ్డ ఓ అధికారి రెండు వందల కోట్ల రూపాయల అక్రమార్జనను ఏసిబి అధికారులు కనుగొన్నారు. ఆ విభాగంలో ఎంతో మంది పై అధికారులు ఉంటారు. వాళ్లందరి కళ్లుగప్పి ఇన్ని కోట్ల రూపాయలు అక్రమార్జనను ఎలాకూడగట్టగలిగాడో ఒక్కసారి ఆలోచించాలి. ఆ అధికారగణం ఏం చేస్తున్నట్లు? ఈ ఒక్క అధికారే కాదు ఏ విభాగం అధికారిపై ఆకస్మిక తనిఖీలు చేసినా వందల కోట్లఅక్రమార్జన ఆస్తులు బయటపడుతున్నాయి. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇక పైకి ఎన్ని చెప్పుకుంటున్నా మరెంతో గంభీరంగా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక ఇబ్బందులు ఏనాడో ఆరంభమయ్యాయి. ప్రభుత్వాలు ప్రకటించిన పథకాలు, ప్రాజెక్టులు పూర్తిచేయాలంటే ఎన్ని లక్షల కోట్లు అవసరం అవుతాయో ఆర్థికనిపుణులే చెప్పలేకపోతున్నారు. ఆ స్థాయిలో నిధులు సమకూర్చుకోగలుగుతారు? అప్పులు తేవడం, పన్నులు వేయడం తప్ప మరో మార్గం లేదు. ఇప్పటికే ప్రభుత్వం పెంచిన పన్నులు ప్రజా జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. ఇక అప్పులే మార్గం. ఇప్పటికే లక్షలాది కోట్లు అప్పుల్లో ఉన్నాం. వెయ్యి, రెండువేల కోట్ల చేబదుళ్లకు వెతుకులాడాల్సిన పరిస్థితుల్లో లక్షలాది కోట్లు సమకూర్చుకోవడం అంటే మాటలు కాదు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రవేశపెడుతున్న పథకాల విషయంలో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే ముఖ్యమైన ప్రభుత్వ శాఖల్లో నిజాయితీపరులైన అధికారులను, సమర్థులను నియమించి కట్టుదిట్టం చేస్తే రెవెన్యూ రాబడి మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ కోణంలో రాజకీయాలకు అతీతంగా కృషి జరగాలి. అప్పులు చేయడం కంటే అనవసరపు ఖర్చులు తగ్గించుకొని నిర్మాణాత్మకాభివృద్ధి కార్యక్రమాలు చేపడితే తప్ప ఎన్నివేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చినా, మరెన్నివేల కోట్ల రూపాయలు పన్నులు రూపంలో ప్రజలపై భారం మోపినా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడే అవకాశాలు కన్పించడం లేదు. ●

# గ్లోబల్ సిటీలో ప్రజారోగ్యంతో ఆటలా?

పురుషోత్తం నారగౌని

హైదరాబాద్.. భాగ్యనగరం పర్యాటక రంగంలో ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకోవాలని, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించాలని నిరంతరం తపిస్తున్న నగరం. కానీ, అదే నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి విక్రయశాలల్లో మనం తినే ఆహారం పరిస్థితి ఏమిటి? తాజాగా ఆహార భద్రతా అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దృశ్యాలు చూస్తుంటే, మనం తింటున్నది ఆహారమా లేక విషమా అనే భయం కలుగుతోంది. ఒకవైపు ఫ్రాన్స్‌తో పర్యాటక భాగస్వామ్యాల గురించి చర్చలు జరుపుకుంటూనే, మరోవైపు మన నగరంలోని కనీస పరిశుభ్రతను కూడా కాపాడుకోలేకపోవడం ఏ రకమైన అభివృద్ధి? ఇది ఖచ్చితంగా మన నగరానికి పట్టిన మాయని మచ్చ. హైదరాబాద్ నగరం గ్లోబల్ వేదిక కావాలంటే, కేవలం అద్దాల భవనాలు, ఫ్లైఓవర్లు సరిపోవు. ఇక్కడికి వచ్చే పర్యాటకుడు, నివసించే సామాన్యుడు కడుపు నిండా భోజనం చేసి, ఆరోగ్యంగా బయటకు వస్తాడనే భరోసా కల్పించడం పాలకులప్రాథమిక బాధ్యత. కానీ, నేడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ గడువు ముగిసిన నిల్వలు, కుళ్ళిన మాంసం, అపరిశుభ్రమైన వంటశాలలు, ఎలుకలు, బొద్దింకల స్వైరవిహారం దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒకేరోజులో పుట్టుకొచ్చిన సమస్యలు కావు. సంవత్సరాల తరబడి వ్యవస్థలో పెనవేసుకుపోయిన అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి, యజమానుల దురాశకునిదర్శనం. అధికారులు తనిఖీలు చేసి, ఏదో నామమాత్రపు జరిమానాలు విధించి, మరుసటి రోజు అదే హోటల్ యజమానిని వదిలేయడం ఏ రకమైన న్యాయం? ఒక హోటల్ నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే, అది ప్రజా ఆరోగ్యంతో ఆడుకోవడమే అవుతుంది. దీన్ని కేవలం ఒక'ఉల్లంఘన'గా చూడకూడదు, ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న 'నేరం'గా పరిగణించాలి. ఆయా హోటళ్ల యజమానుల వెనుక ఉన్న రాజకీయ రక్షణ, వ్యవస్థలోని లొసుగులువారిని భయం లేకుండా చేస్తున్నాయి. దాడులు జరిగినప్పుడు కొన్ని రోజులు హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్లీ మామూలే అనిపించడం వల్లనే ఈ వ్యాపారస్తుల్లో ఏమాత్రం భయం ఉండటం లేదు. నిజానికి, మన నగరం ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదగాలంటే, హోటల్ పరిశ్రమలో కఠినమైన 'ఫుడ్‌సేఫ్టీ ఆడిట్' విధానాన్నితీసుకురావాలి. కేవలం దాడులు చేయడం కాదు, ప్రతి రెస్టారెంట్‌కు ఒక 'హైజీన్ రేటింగ్' ఇవ్వాలి. ఆ రేటింగ్ బోర్డును హోటల్ ముందు ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి. కనీసం మూడుసార్లు నిబంధనలు అతిక్రమించిన హోటల్‌లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేసే చట్టాలు అమలు చేయాలి. వంటశాలలను మూసివేయ డం కాదు, ఆ అపరిశుభ్రతకు కారణమైన అవినీతి వ్యవస్థ ను మూసివేయండి. అప్పుడే నిజమైన 'గ్లోబల్ సిటీ'గా గర్వంగా చెప్పుకోగలం. ●

# సమాన విద్యావకాశాలకు పెరుగుతున్న సవాళ్లు

తరిగోపుల నారాయణస్వామి

భారతదేశంలో విద్యను సామాజిక మార్పుకు, ఆర్థిక అభివృద్ధికి, వ్యక్తిగత పురోగతికి, సమాన అవకాశాల సాధనకు అత్యంత శక్తివంతమైన సాధనంగా భావిస్తారు. ముఖ్యంగా గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలకు విద్య మాత్రమే జీవితాన్ని మార్చగల సాధనం. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రవేశ పరీక్షలు, అర్హత పరీక్షలు, ఉద్యోగ పరీక్షలు, పోటీ పరీక్షలు అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించబడాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయత, నిష్పక్షపాత ధోరణి, సిలబస్‌కు నిబద్ధత అనే నాలుగు సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి. అయితే ఇటీవల కొన్ని పరీక్షలలో అధికారికంగా ప్రకటించిన సిలబస్‌కు మించి, విడుదల చేసిన బ్లూప్రింట్‌కు విరుద్ధంగా, అత్యంత క్లిష్టమైన స్థాయిలో ప్రశ్నలు ఇవ్వబడుతున్నాయనే అభిప్రాయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలలో పెరుగుతోంది. పరీక్షా సంస్థలు ముందుగా సిలబస్‌ను ప్రకటిస్తాయి. పరీక్ష నమూనా, బ్లూప్రింట్, మార్కుల పంపిణీ, ప్రశ్నల స్థాయి వంటి అంశాలపై మార్గదర్శకాలు విడుదల చేస్తాయి. విద్యార్థులు కూడా అదే ఆధారంగా తమ ప్రణాళికలను రూపొందించుకుంటారు. పాఠ్యపుస్తకాలు చదువుతారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో సిద్ధమవుతారు. సంవత్సరాల పాటు కష్టపడతారు. అయితే చివరికి పరీక్షా మందిరంలో ఎదురయ్యే ప్రశ్నలు సిలబస్‌కు అతీతంగా లేదా ప్రకటించిన నమూనాకు భిన్నంగా ఉంటే అది విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఇది కేవలం ఒక పరీక్షలో వచ్చిననిరాశ మాత్రమే కాదు, అది వారిభవిష్యత్తుపై పడే భారమైన ప్రభావం. ప్రస్తుతం దేశంలో నిర్వహిస్తున్న కొన్ని ప్రవేశపరీక్షలు, అర్హత పరీక్షలు, పోటీ పరీక్షలు, నియామక పరీక్షలలో ప్రశ్నల స్థాయి అవసరానికి మించి పెరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్లికేషన్ స్థాయి ప్రశ్నలు అవసరమే అయినప్పటికీ అవి కూడా సిలబస్ పరిధిలోనే ఉండాలి. సిలబస్‌ను దాటి, ప్రత్యేక కోచింగ్ కేంద్రాల్లో మాత్రమే బోధించే అంశాలను పరీక్షలలో అడగడం సమాన అవకాశాల భావనకు విరుద్ధం. పోటీ పరీక్షలు ప్రతిభను పరీక్షించాలి కానీ విద్యార్థుల సామాజిక, ఆర్థిక నేపథ్యాలను పరీక్షించకూడదు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. వారికి అత్యాధునిక కోచింగ్ సెంటర్లు, ప్రత్యేక అధ్యయన సామగ్రి, ఖరీదైన శిక్షణా కార్యక్రమాలు అందుబాటులో ఉండవు. వారు ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఉపాధ్యాయుల బోధనపై ఆధారపడుతుంటారు. అధికారిక సిలబస్‌నే తమ ఆయుధంగా భావించి సిద్ధమవుతారు. కానీ పరీక్షల్లో సిలబస్‌కు అతీతమైన ప్రశ్నలు ఎదురైతే వారి శ్రమ ఒక్కసారిగా విలువ కోల్పోయిన భావన కలుగుతుంది. దీనివలన గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. అదేవిధంగా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు కూడా ఇలాంటి పరిస్థితుల వలన తీవ్రంగా నష్టపోతున్నారు. అనేక కుటుంబాలు అప్పులు చేసి పిల్లలను చదివిస్తుంటాయి. కోచింగ్ ఫీజు



లు, వసతి ఖర్చులు, పుస్తకాలు, ప్రయాణ ఖర్చులు భరించలేకపోయినా, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులుఅనేక త్యాగాలు చేస్తుంటారు. కానీ సిలబస్‌కు భిన్నమైన పరీక్షా విధానం కారణంగా వారి ఆశలు నిరాశగా మారుతున్నాయి. విద్యార్థుల కృషి కంటే అదనపు వనరులు కలిగిన వారికి మాత్రమే ప్రయోజనం కలిగే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది కేవలం వ్యక్తిగత నష్టం కాదు, సామాజిక అసమానతలకు కూడా కారణమవుతోంది. ఉన్నత విద్యలో ప్రవేశాలు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత వృత్తి అవకాశాలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. ఫలితంగా విద్యలో వైరుధ్యాలు, ఉపాధిలో వైరుధ్యాలు, ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతాయి. ఇది రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల సూత్రానికి కూడా విరుద్ధం. అర్హత పరీక్షల విషయంలో ఈ సమస్య మరింత ఆందోళన కలిగిస్తోంది. ఉపాధ్యాయఅర్హత పరీక్షలు, వృత్తి అర్హత పరీక్షలు, ఇతర అర్హత పరీక్షల ముఖ్య ఉద్దేశ్యం కనీస నైపుణ్యాలను అంచనా వేయడం మాత్రమే. కానీ అర్హత పరీక్షలను అత్యంత క్లిష్టంగా మార్చడం వలన అనేక మంది అభ్యర్థులు కనీస అర్హత మార్కులను కూడా సాధించలేకపోతున్నారు. అర్హతే సాధించలేకపోతే ఉద్యోగ అవకాశాలకు ద్వారాలు మూసుకుపోతాయి. ఉద్యోగ అవకాశాలు లేకపోతే ఆర్థిక పురోగతి ఆగిపోతుంది. ఫలితంగా సామాజిక చలనశీలత కూడా తగ్గిపోతుంది. పరీక్షలలో అనవసరమైన కఠినత విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతోంది. లక్ష్యాలను చేరుకోలేమనే భయం, కుటుంబ అంచనాలను నెరవేర్చలేమనే ఆందోళన, నిరంతర పోటీఒత్తిడి, అనిశ్చితి కారణంగా విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షల లక్ష్యం విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం కావాలి కానీ వారి జీవితాలను భారంగా మార్చడం కాదు. ప్రభుత్వాలు పరీక్షా సంస్థలు ఈ పరిస్థితిని అత్యంత సీరియస్‌గా పరిగణించాలి. ప్రతి పరీక్ష తప్పనిసరిగా అధికారిక సిలబస్ ఆధారంగానే నిర్వహించబడాలి. విడుదల చేసిన బ్లూప్రింట్, మార్గదర్శకాలను యథాతథంగా పాటించాలి. ప్రశ్నాపత్రాల రూపకల్పనలో సిలబస్‌కు అతీతమైన ప్రశ్నలకు అవకాశంఉండకూడదు. విద్యార్థులు చదివిన అంశాలనుంచే వివిధ స్థాయిలలో ప్రశ్నలు ఇవ్వాలి. జ్ఞాపకశక్తి, అవగాహన, అన్వయం, విశ్లేషణ వంటి స్థాయిలను పరీక్షించవచ్చుకానీ అవన్నీ సిలబస్ పరిధిలోనేఉండాలి. ప్రత్యేకంగా ప్రశ్నాపత్రాల రూపకల్పనలో ఎవరు పాల్గొంటున్నారు అనే అంశంపై కూడాపునరాలోచన అవసరం. ఆ తరగతిలో బోధించే పాఠ్యాంశాలపై ప్రత్యక్ష అనుభవం కలిగిన ఉపాధ్యాయులే ప్రశ్నాపత్రాల తయారీలో ప్రధాన పాత్ర పోషించాలి. పాఠ్యపుస్తకాల నిర్మాణం, విద్యార్థుల అవగాహన స్థాయి, తరగతి గదిలో ఎదురయ్యేసవాళ్లు, విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యాలు వంటి అంశాలపై వారికి స్పష్టమైన అవగాహన ఉంటుంది. కాబట్టి వారురూపొందించేప్రశ్నాపత్రాలు విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉండే అవకాశం ఎక్కువ. సంబంధం లేని విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు లేదా కేవలం ఉన్నతస్థాయి నిపుణులు మాత్రమే ప్రశ్నాపత్రాల రూపకల్పనలో పాల్గొంటే నేలస్థాయివాస్తవాలు వారికి పూర్తిగా తెలియకపోవచ్చు. విశ్వవిద్యాలయ స్థాయి పరిజ్ఞానం, పాఠశాల స్థాయి బోధన మధ్య ఉన్న తేడాను గుర్తించకుండా ప్రశ్నలు రూపొందిస్తే విద్యార్థులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటారు. అందువల్ల బోధనలో నేరుగా పాల్గొం టున్న ఉపాధ్యాయ బృందం, అంశ నిపుణులు, పరీక్షా నిపుణుల సమన్వయంతో ప్రశ్నాపత్రాలు రూపొందించాలి. పరీక్షలపై విశ్వాసం నిలవాలంటే పారదర్శకత అత్యంత అవసరం. బ్లూప్రింట్ ప్రకటిస్తే దానిని తప్పనిసరిగా పాటించాలి. సిలబస్ ప్రకటిస్తే దాని పరిధిని దాటకూడదు. పరీక్షల అనంతరం సమాధాన కీలు, వివరణలు, విశ్లేషణలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అప్పుడే విద్యార్థులు, తల్లిదండ్రులలో విశ్వాసం పెరుగుతుంది. ●

04-07pg5exHMNWJQET.qxd:04-07pg5exHMNWJQET.qxd 1/1/02 6:20 AM Page 1




# రూ.52వేల కోట్లతో రక్షణరంగ కొనుగోళ్లు

## రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన డిఏసి ఆమోదం



**న్యూఢిల్లీ,జులై 3:** భారత రక్షణ రంగ బలాన్ని,త్రివిధ దళాల పోరాట సన్నద్ధతను మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఫోకస్ పెంచింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నేడు జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశంలో రూ.52 వేల కోట్ల అంచనా వ్యయంతో వివిధ కొనుగోళ్ల ప్రతిపాదనలకు పరిపాలనా ఆమోదం లభించింది. ఆర్మీ, నౌకాదళం, వాయుసేన అవసరాల కోసం అత్యంత అధునాతన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా యాంటీ డ్రోన్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, క్షిపణి వ్యవస్థల వంటి అత్యాధునిక సదుపాయాలను సమకూర్చుకోవడంపై ఈ రక్షణ కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇది సరిహద్దు భద్రతను మరింత సురక్షితం చేయనుంది. భారత సైన్యానికి లభించనున్న అత్యాధునిక రక్షణ శ్రేణి ఆర్మీకి మరిన్ని అత్యాధునిక ఆయుధాలను సమకూర్చనున్నారు. శత్రువుల అధునిక డ్రోన్ల నిఘాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆకాశ్ తరంగ్ యాంటీయ ఏవీ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్‌ను సైన్యంలో ప్రవేశపెట్టనున్నారు. సాయుధ వాహనాల ముప్పును తిప్పికొట్టడానికి పదాతి దళ సామర్థ్యాన్ని పెంపొందించే మ్యాన్ పోర్టబుల్ యాంటీట్యాంక్ గైడెడ్ మిస్సైల్ వ్యవస్థలు సహాయపడతాయి. వైమానిక ముప్పుల నుంచి రక్షణ కల్పించేందుకు సహాయపడే మీడియం రేంజ్ సర్ఫేస్‌టుఎయిర్ మిస్సైల్ ఆయుధ వ్యవస్థకు కూడా ఆమోదం లభించింది. సైన్యం ఉపయోగించే అత్యాధునిక యుద్ధ ట్యాంకుల ప్రాణాన్ని నిలబెట్టేందుకు, వాటి మనుగడను పెంచడానికి యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్ సిస్టమ్ కొనుగోళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అత్యంత సున్నిత, సంక్లిష్ట వాతావరణంలో పనిచేసే మల్టీ స్పెక్ట్రల్ సెన్సింగ్ కలిగిన వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ రక్షణ కవచంగా పని చేస్తుంది. తక్కువ ఖర్చుతో, అధిక వినాశకర శక్తి ఉన్న జెట్ ఆధారిత కమికాజే డ్రోన్ వ్యవస్థను కూడా సైన్యం సొంతం చేసుకోనుంది. నౌకాదళం, వైమానిక దళాల సామర్థ్యాలకు ప్రాధాన్యం భారత నౌకాదళం బలోపేతం కోసం రక్షణ కొనుగోళ్ల మండలి కీలక కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శత్రు నౌకల కదలికలను నిరోధించేందుకు మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్ రక్షణ శిబిరంలో చేర నుంది. దీనితో పాటు సముద్ర విస్తీర్ణంలో నిరంతర నిఘా కోసం నావల్ షిప్‌బోర్న్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ ఉపయోగపడుతుంది. అలాగే ఎలక్ట్రానిక్ ప్రొపల్షన్ సిస్టమ్ మెరైన్ టార్పెడోను సురక్షితంగా పరీక్షించడానికి ల్యాండ్ బేస్డ్ టెస్టింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) పటిష్ట నిఘా వ్యవస్థను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రధానంగా ఫిక్స్‌డ్‌వింగ్ బేస్డ్ హై ఆల్టిట్యూడ్ స్యూడో శాటిలైట్ కొనుగోలుకు డీఏసీ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రత్యేకమైన వ్యవస్థ ద్వారా ఎయిర్‌ఫోర్స్ సుదూర ప్రాంతాలలో నిరంతర పర్యవేక్షణ, శత్రు గూఢచర్యాన్ని పసిగట్టే సమాచార సేకరించడం, కమ్యూనికేషన్ నెట్ వర్క్ కనెక్టివిటీని మరియు రిమోట్ సెన్సింగ్‌ను సమర్థవంతంగా చేపట్టవచ్చు. మొత్తంగా త్రివిధ దళాల సమగ్ర రక్షణ అవసరాలను తీరుస్తూ స్వదేశీ రక్షణ రంగాన్ని ప్రోత్సహించే విధంగా ఈ కొనుగోళ్ల ప్రతిపాదనలు రూపుదిద్దుకున్నాయి. సరిహద్దుల్లో మారుతున్న భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ సరికొత్త ఆయుధ సంపత్తి రక్షణ బలగాల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో దేశీయ రక్షణ రంగాన్ని స్వావలంబన దిశగా నడిపించడంలో కూడా దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇరాన్ అగ్రనేతల హత్యకు ఇజ్రాయెల్ కుట్ర లీక్ చేసిన అమెరికా



**టెహ్రాన్,జులై 3:** అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న అత్యంత సున్నితమైన శాంతి చర్చలను దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్ ఒక భారీ హత్యాకాండకు పూర్వాంగ రచించిందనే సంచలన నివేదికను ప్రముఖ అంతర్జాతీయ పత్రిక బయటపెట్టింది. ఇరాన్ తరఫున చర్చల్లో పాల్గొంటున్న ఇద్దరు అత్యున్నత స్థాయి ప్రతినిధులను హతమార్చడానికి ఇజ్రాయెల్ ప్లాన్ చేసిందని, ఈ విషయాన్ని ముందే పసిగట్టిన అమెరికా పశ్చిమాసియా దేశాల ద్వారా ఇరాన్‌ను వెంటనే అప్రమత్తం చేసిందని అమెరికా ఉన్నతాధికారులను ఉటంకిస్తూ ఈ కథనం వెల్లడించింది. ఇజ్రాయెల్ హిట్ లిస్ట్‌లో ఉన్న ఆ ఇద్దరు ముఖ్య నేతలు అబ్బాస్ అరాఘ్చీ, మొహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్. యుద్ధ విమానాల దాడి నుంచి తప్పించుకున్న స్పీకర్ ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఇస్లామాబాద్ (పాకిస్తాన్)లో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్ వస్తుండగా ఒక భయంకర ఘటన జరిగింది. ఇరాన్ స్పీకర్ ప్రయాణిస్తున్న విమానాన్ని అడ్డుకుని కూల్చివేయడానికి రెండు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇరాక్ సరిహద్దుల గుండా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా సాయంతో పసిగట్టిన ఇరాన్ రక్షణ వర్గాలు గాలిబాఫ్ విమానాన్ని వెంటనే ఈశాన్య ఇరాన్‌లోని మషద్ నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత ఆయన అక్కడి నుండి 8 గంటల పాటు రోడ్డు మార్గంలో ప్రయాణించి సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు. గాలిబాఫ్ గతంలో జరిగిన దాడుల శిథిలాల నుంచి కూడా రెండుసార్లు ప్రాణాలతో బయటపడటం గమనార్హం. ఇప్పుడు మిగిలి ఉన్న ఏకైక రాయబారులైన అరాఘ్చీ, గాలిబాఫ్‌లను చంపేస్తే చర్చలు పూర్తిగా ఆగిపోయి, మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందని ఇజ్రాయెల్ భావించింది.

## బలూచిస్తాన్‌లో ఘోర బస్సు ప్రమాదం

### లోయలో పడి 40మంది మృతి, 8 మందికి గాయాలు



**క్వెట్టా,జులై 3:** పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. అధిక ప్రయాణికులతో వెళ్తున్న ఒక బస్సు లోయలో పడటంతో దాదాపు 40 మంది మరణించారు. మరో 8మంది గాయపడ్డారు. ఈ ఘటన బలూ చిస్తాన్ ప్రావిన్స్‌లోని, షెరాణిఝోబ్ హైవేపై, దానాసర్ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. బస్సు క్వెట్టా నుంచి ఇస్లామాబాద్ వెళ్తుండగా పర్వతాలు కలిగిన రోడ్డులో ప్రమాదం జరిగింది. ఒక బస్సు కెపాసిటీకి మించి ప్రయాణికుల్ని ఎక్కించుకుని హైవేపై వెళ్తోంది. ఇది సరిహద్దు ప్రాంతాలైన బలూచిస్తాన్, ఖైబర్ పక్తుంఖ్వాలను కలిపేరోడ్డు. అయితే, ఈ రోడ్డు చాలా ప్రమాదకరం. పర్వత ప్రాంతం కావడం, రోడ్డు మార్గం సరిగ్గా లేకపోవడం వల్ల అక్కడ అత్యంత ప్రమాదకరమైన రోడ్లలో ఒకటిగా నిలిచింది. అలాంటి ప్రదేశంలో పర్వత మార్గంలో వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో 40 మంది ప్రయాణికులు మరణించగా, మరో 8 మంది గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసుల, రెస్క్యూ, వైద్య బృందాలు అక్కడికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ప్రారంభించాయి. బస్సు శిథిలాల నుంచి 40 మంది మృతదేహాల్ని వెలికి తీశారు. గాయపడ్డవారిని స్థానిక ఝోబ్ పట్టణంలోని ఆస్పత్రులకు చికిత్స కోసం తరలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రమాద స్థలంలో అంబులెన్స్‌లు, ఎమర్జెన్సీ వైద్యబృం దం, లైట్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్స్‌ను అధికారులు సిద్ధం చేశారు. పర్వత ప్రాంతం, పెద్ద లోయ కావడం వల్ల సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఈ అంశంపై షెరాణి డిప్యూటీ కమిషనర్ హజ్రత్ మాట్లాడారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బస్సు మొదట 36 మందితోనే బయల్దేరిందని, అయితే, మార్గమధ్యంలో మరికొందరు ప్రయాణికుల్ని ఎక్కించుకుందన్నారు. అందువల్లే బాధితుల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు సరిగ్గా లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## హనీమూన్ మర్డర్ కేసు

### సోనమ్ బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరణ

### మేఘాలయ ప్రభుత్వ పిటిషన్‌పై విచారణకు అంగీకారం



**న్యూఢిల్లీ, జూలై 3:** హనీమూన్ మర్డర్ కేసులో ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీకి మంజూరైన బెయిల్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అరెస్ట్ మెమోలో ఒక సెక్షన్‌ను పేర్కొనడంలో జరిగిన అక్షర దోషం (టైపోగ్రాఫికల్ ఎర్రర్) ఆధారంగా హైకోర్టు ఆమెకు బెయిల్ మంజూరు చేయడాన్ని ప్రాథమికంగా తప్పుబట్టినప్పటికీ, న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. ఆమె ఇప్పటికే జైలు నుండి విడుదలైన విషయాన్ని పరిగణనలోకి తీసు కున్న కోర్టు, బెయిల్ ఉత్త ర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరిం చింది. అయితే, ఈ బెయిల్ ఉత్త ర్వును సవాలు చేస్తూ మేఘాల య ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించడానికి మాత్రం అంగీకరిం చింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం ప్రతివాది సోనమ్ రఘువంశీకి నోటీసులు జారీ చేసి వారి స్పందనను కోరింది. "హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మాకు ప్రాథమికంగా కొన్ని సందేహాలున్నాయి. విచారణ ఎలా సాగుతుందో చూస్తాం. అరెస్టుకు గల కారణాలను ఆమెకు తెలియజేశారు. గతంలో బెయిల్ పిటిషన్లలో ఆమె ఈ అంశాన్ని లేవనెత్తలేదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోనమ్ రఘువంశీ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

## భారీ భద్రత మధ్య అమర్‌నాథ్‌యాత్ర ప్రారంభం

### భక్తులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



**జమ్ము,జులై 3:** హిందూ భక్తులు ఎదురుచూసిన అమర్‌నాథ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. భం భం భోలే,హర హర మహాదేవ్ అంటూ భక్తి నినాదాల మధ్య, భారీ భద్రత మధ్య ఘనంగా యాత్ర ప్రారంభమైంది. అమర్‌నాథ్ గుహాలోని మంచు లింగానికి తొలి హారతి నిర్వహించారు. ఈ గుహకు జమ్మూ నుంచి మొదటి భక్తుల బృందాన్ని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి ప్రారంభించారు.నేటినుంచి ప్రారంభమైన ఈ యాత్ర 57 రోజులపాటు సాగుతుంది. రక్షా బంధన్ రోజైన ఆగష్టు 28న యాత్ర పూర్తవుతుంది. భక్తుల భద్రత దృష్ట్యా, ఉగ్రదాడుల ముప్పు నేపథ్యంలో అధికారులు అమర్‌నాథ్ యాత్ర కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. యాత్ర సాగే మార్గంలో భారీగా భద్రతా దళాలు మోహరించాయి. సీఆర్పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీస్, ఇండియన్ ఆర్మీతోపాటు వివిధ బలగాలు ఇక్కడ భద్రత కల్పిస్తున్నాయి. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం భద్రతను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు అమితమైన ఉత్సాహం, భక్తి పారవశ్యాల మధ్య మంచు లింగాన్ని దర్శించుకునేందుకు ముందుకు సాగుతున్నారు. హిందూ విశ్వాసాల ప్రకారం ఆషాఢం, శ్రావణం అంటే జూలై, ఆగష్టు నెలల్లో అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఈ యాత్ర నిర్వహిస్తారు. ఈ రెండు నెలల కాలంలో వేలాది మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకుంటారు. యాత్ర ప్రారంభమైన సందర్భంగా ప్రధాని మోడీభక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ రాశారు. ఇది దేశంలోని అత్యంత పవిత్రమైన యాత్రలలో ఒక్కటి అన్నారు. ఈ యాత్ర భక్తి, ఏకత్వం, శ్రద్ధకు ప్రతీకగా మోడీ పేర్కొన్నారు. ఈ యాత్ర చేసే భక్తులు ఐదు సంకల్పాల్ని పాటించాల న్నారు. అవి. యాత్ర పరిసర మార్గాల్లో పరిశుభ్ర తను కాపాడటం, ట్రాఫిక్ రూల్స్, సెక్యూరిటీ రూల్స్ పాటించడం, దేశీయ ఉత్పత్తులనే వాడ టం, యాత్ర తర్వాత తల్లి పేరుతో ఒక మొక్క నాటడం, దేశానికే మొదటి ప్రాధాన్యం అనే అం శాన్ని పాటించడం అంటూ మోడీ పేర్కొన్నారు.

# అయోధ్య ట్రస్టు లావాదేవీల రీ ఆడిట్

## అవకతవకలపై దర్యాప్తులో సిట్ నిర్ణయం



**అయోధ్య,జులై 3:** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం చోరీ చేసిన సొమ్ము ఎంత అనేది తేల్చేందుకు గత ఐదేళ్లుగా ట్రస్ట్ నిర్వహించిన ఆర్థిక లావాదేవీలన్నింటిపై సమగ్రమైన రీఆడిట్ చేపట్టాలని నిర్ణయించింది. ప్రాథమిక విచారణలో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు తేలడంతో లోతైన దర్యాప్తునకు అధికారులు సిద్ధమయ్యారు. ట్రస్ట్ ఖాతాల్లో నమోదైన ఆదాయం, ఖర్చులతో పాటు ఆలయ నిర్మాణానికి వెచ్చించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో పరిశీలించనున్నారు. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల లెక్కలను కూడా మరోసారి లెక్కించనున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అవినాశ్ శుక్లాను అయోధ్య పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అతడు కీలక బాధ్యతలు నిర్వహించగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక కోర్టు అవినాశ్ ను 24 గంటల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. ఇప్పటివరకు అత్యధిక మొత్తంలో నగదు అవినాశ్ శుక్లా వద్ద నుంచే స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో భాగంగా నిందితుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అవినాశ్ శుక్లా వద్ద నుంచి రూ.20.39 లక్షలు, కరుణేష్ పాండే వద్ద నుంచి రూ.18.07 లక్షలు, అనుకల్ప్ మిశ్రా వద్ద నుంచి రూ.16.82 లక్షలు, లవకుశ్ మిశ్రా వద్ద నుంచి రూ.14.25 లక్షలు, రామశంకర్ మిశ్రా వద్ద నుంచి రూ.7.32 లక్షలు, రామశంకర్ యాదవ్ అలియాస్ తిన్ను వద్ద నుంచి రూ.1 లక్షను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 11 గ్రాముల బంగారం, 375 గ్రాముల వెండి, 1,121 అమెరికన్ డాలర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అవినాశ్ శుక్లా దశాబ్దకాలంగా నివసిస్తున్న అయోధ్యలోని ఓ యోగా కేంద్రంలో సోదాలు నిర్వహించిన అధికారులు రామరాజ్య కోష్ అని రాసి, పేటీఎం క్యూ ఆర్ కోడ్ అమర్చిన విరాళాల పెట్టెను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ విరాళాల పెట్టె వినియోగం ఎలా జరిగిందనే అంశంపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

**చోరీకేసులో సూత్రధారి డ్రైవర్ టిన్ను యాదవ్**

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగు చూస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం తన ప్రధాన సహాయకుడు, డ్రైవర్ టిన్నూ యాదవ్ ఈ కేసులో ప్రధాన సూత్రధారి అని ఆలయ ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. తనపై రాయ్‌కు ఉన్న నమ్మకాన్ని అవకాశంగా తీసుకొని టిన్నూ యాదవ్ ఈ మోసానికి పాల్పడ్డాడు. పోలీసులకు పట్టుబడే ముందు ఈ సమాచారాన్ని అతడు సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ఒకరికి లీక్ చేసినట్టు రాయ్ తెలిపారు.

**అయోధ్య నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే**

**ఆర్ఎస్ఎస్ కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే**

అయోధ్యలోని రామాలయంలో విరాళాలను చోరీ చేసిన ఘటనపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హోస్‌బలే స్పందించారు. ఆ ఘటన దురదృష్టకరమైందన్నారు. హిందూ వర్గ ప్రజలు సంయనంతో ఉండాలని, క్లిష్ట పరిస్థితుల్లో ఓపికతో ఉండాలని కోరారు. రామ్‌లల్లా గుడిలోని హుండీ బాక్సుల నుంచి చోరీ జరగడం దురదృష్టకరమని, ఆ ఘటన రాముడి భక్తులను, యావత్ సమాజ మనోభావాలను, భక్తిని గాయపరిచాయన్నారు. ఆ ఘటన తీవ్రంగా బాధపెట్టినట్లు ఆయన చెప్పారు. దర్యాప్తులో దోషులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని హోస్‌బలే కోరారు. ఈ ఘటన ఆధారంగా హిందూ వ్యతిరేక శక్తులు.. హిందూ ధర్మాన్ని కించపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఆ కుట్రలను చేధించేందుకు హిందూ సమాజం ఓపికతో ఉండాలని అన్నారు. రామ్ మందిర్ విరాళాల వివాదంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



## ప్రజాసేవ విభాగం ప్రారంభించిన కర్ణాటక సిఎం

**బెంగళూరు,జులై 3:** పాలనకు, పౌర సేవలకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా సమస్యల్ని త్వరగా పరిష్కరించేందుకు ప్రజా సేవ విభాగాన్ని ప్రారంభించింది. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఈ విభాగం కృషి చేస్తుంది. ఈ విభాగానికి ఒక మంత్రి నాయకత్వం వహిస్తారని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిబ్బంది సహకారం అందిస్తారని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించి, సమస్యల్ని పరిష్కరిస్తారన్నారు. ప్రజా సేవా విభాగంతోపాటు ప్రజా సేవ అభియాన (పీఎస్ఏ) అనే మరో కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు సీఎం చెప్పారు.

## ముగింపుదశలో ఇరాన్ చర్చలు

### అంతా అమెరికాకు సానుకూలమే: ట్రంప్

**వాషింగ్టన్,జులై 3:** ఇరాన్ అణు కార్యక్రమంపై జరు గుతున్న చర్చలు ముగింపు దశకు చేరుకున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికాకు అవసరమైన ప్రతి నిబంధనకు ఇరాన్ దాదాపు అంగీకరించిందని ఆయన వెల్లడించారు. టెహ్రాన్ (ఇరాన్ ప్రభుత్వం) ఎట్టిపరిస్థితుల్లోనూ అణ్వాయుధాన్ని సాధించకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ అంతర్జాతీయ ఛానల్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయాలను పంచుకున్నారు. ఇరాన్‌ను అణ్వాయుధ రహిత దేశంగా మార్చడమే తమ అంతిమ వ్యూహమని, ప్రస్తుత చర్చలు అమెరికాకు అనుకూలంగా సాగుతున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మేము ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాము. మాకు కావలసిన ప్రతిదానికి వారు దాదాపు అంగీకరించారని నేను భావిస్తున్నాను. మా లక్ష్యం స్పష్టం ఇరాన్‌ను అణ్వాయుధ రహిత దేశంగా మార్చడం. వారిని అణ్వాయుధాలు కలిగి ఉండటానికి మేము ఎప్పటికీ అనుమతించబోమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌లో తాము అధికార మార్పిడిని ఆశించడం లేదని, కేవలం అణ్వాయుధాలు నివారించడమే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. తాను మళ్లీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమెరికా జరిపిన సైనిక చర్యల వల్ల ఇరాన్ రక్షణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# పేరు లేదా జాతీయత ఆధారంగా హిందూ హోదాను నిరాకరించలేం

## మద్రాస్ హైకోర్టు విస్పష్ట తీర్పు



**చెన్నై, జులై 3:** హిందూ మతాన్ని ఆచరించే అమెరికన్ పౌరురాలికి, కేవలం విదేశీ పేరు లేదా విదేశీ పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందువుగా గుర్తింపును నిరాకరించలేమని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతంలోకి చేరడానికి ఎటువంటి అధికారిక వేడుక లేదా మత మార్పిడి ధ్రువీకరణ పత్రం అవసరం లేదని కోర్టు పేర్కొంది. తంజావూరు జిల్లాలోని శ్రీ అరుల్మిగు అభిష్ట వరదరాజ పెరుమాళ్ ఆలయంలోకి ప్రవేశించకుండా తనను నిరోధిస్తూ, తనను "అమెరికన్ క్రైస్తవ మహిళ"గా పేర్కొంటూ తమిళనాడు హిందూ మత, ధర్మాదాయ శాఖ(హెచ్ఆర్ సిఇ) జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ డి. భరత చక్రవర్తి ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తాను అమెరికన్ పౌరురాలినైనప్పటికీ, చాలా యేళ్ల క్రితమే హిందూ మతాన్ని స్వీకరించానని, అప్పటి నుండి హిందూ విశ్వాసాన్ని పాటిస్తున్నానని లారా కోర్టుకు తెలిపారు. భారతదేశంలోని వివిధ హిం దూ ఆలయాలను సందర్శించానని, హిందువు అయిన వరద బాలాజీ వెంకటకృష్ణన్‌ను వివాహం చేసుకోకముందే తన వీసా దరఖాస్తులలో కూడా తనను తాను హిందువుగా పేర్కొన్నానని ఆమె చెప్పారు. సెప్టెంబర్ 2023 లో అదే ఆలయంలో వారి వివాహం జరిగింది, ఆ తర్వాత ఆమె వైష్ణవ సంప్రదాయ ఆచారాలలో పాల్గొంటూ వచ్చారు. ఆమె హిందువు కాదనే భావనతో కొందరు స్థానికులు ఆమె ఆలయ ప్రవేశాన్ని వ్యతిరేకించడంతో ఈ వివాదం తలెత్తింది. ఆమె స్వేచ్ఛగా పూజలు చేసుకునేందుకు అనుమతి కోరుతూ ఆమె భర్త చేసిన అభ్యర్థన మేరకు, ఆమెను "అమెరికన్ క్రైస్తవ మహిళ"గా పరిగణిస్తూ ఆ శాఖ ఉత్తర్వు జారీ చేసింది. ఇతర భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేందుకు ఆమెకు ఆలయ బయటి ప్రాంగణంలోకి మాత్రమే అనుమతి లభించిందని అందులో పేర్కొంది.

# సంక్షిప్త వార్తలు

## చాక్లెట్ చోరీ.. సీనియర్ ఉద్యోగిని తొలగించిన ఫోర్డ్




**వాషింగ్టన్, జులై 3 :** చాక్లెట్ కుకీ దొంగలించాడనే కారణంతో ప్రముఖ వాహన తయారీ సంస్థ ఫోర్డ్ రూ. 1.9కోట్ల జీతం తీసుకునే ఓ ఉద్యోగిని తొలగించింది. ఈ ఘటన అమెరికాలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కెంటకీలోని లూయిస్‌విల్లేలో ఉన్న ఫోర్డ్‌ట్రక్ ఫ్యాక్టరీలో 60 యేళ్ల కర్ట్‌క్రోమ్ 11 యేళ్లుగా పని చేస్తున్నాడు. ఎంతో విధేయతగా సగటున వారానికి 60 గంటలు పనిచేసేవాడినని, అయినప్పటికీ తప్పుడు ఆరోపణలతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కంపెనీలో రూ. 1.9 కోట్లు సంపాదిస్తున్నానని, గతేడాది ఆఫీస్ క్యాంటీన్‌లో సుమారు రూ. 1.14 లక్షలు ఖర్చు చేశానని తెలిపాడు. ఇటీవల కంపెనీలో ఉన్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు అనిపించడంతో ఓ చాక్లెట్ కుకీ (రూ.186)ని కొనుగోలు చేశానని పేర్కొన్నాడు.

## ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేసిన బైడెన్ కుమారుడు..



**వాషింగ్టన్, జులై 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆయన విరోధి హంటర్ బైడెన్ నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేశారు. ట్రంప్‌ను విమర్శిస్తూ వ్యంగ్యంగా నామినేట్ చేస్తూ హంటర్ బైడెన్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'నేను అధికారికంగా డొనాల్డ్ జె ట్రంప్‌ను నోబెల్ పీస్ ప్రైజ్‌కు నామినేట్ చేస్తున్నాను. చరిత్రలో ఏ అధ్యక్షుడు ఒకే యుద్ధాన్ని పలుమార్లు ఆపలేదు. మన ప్రియతమ నేత ఇరాన్‌తో యుద్ధాన్ని సిఎన్ఎన్ గణాంకాల ప్రకారం 38 సార్లు ఆపారు. ఇలా గతంలో ఏ అధ్యక్షుడూ చేయలేదు. ఇప్పుడు ఆయన ఆ యుద్ధాన్ని ముగించడానికి చాలా దూరంలోనే ఉన్నారు. ఈ రికార్డు నోబెల్ కమిటీ గుర్తింపునకు అర్హమైందే. ఈ విషయమై దృష్టి పెట్టినందుకు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

## లొంగిపోవడానికి సిద్ధం:అన్మోల్ బిష్ణోయ్



**ముంబయి,జులై 3:** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసంపై జరిగిన కాల్పుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వాంటెడ్ నిందితుడిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తమ్ముడు అన్మోల్ బిష్ణోయ్, తాను లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నానని, ఇందుకు అనుమతించాలని కోరుతూ ముంబైలోని ప్రత్యేక మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ (మోకా) కోర్టును ఆశ్రయించాడు. ప్రస్తుతం అన్మోల్ బిష్ణోయ్, గ్యాంగ్‌స్టర్ ఉగ్రవాద నెట్‌వర్క్‌కు సంబంధించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేయడంతో ఢిల్లీలోని తిహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. 2025 నవంబర్‌లో అమెరికా నుంచి అతడిని భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే.

## ఖమేనీ అంత్యక్రియలకు మొజ్తబా హాజరుకాలేరు..

**న్యూఢిల్లీ,జులై 3:** ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ, తన తండ్రి దివంగత అయతొల్లా అలీఖమేనీ అంత్యక్రియలకు హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. తీవ్రమైన భద్రతా ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, ఆయన బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనకపోవచ్చని ఇరాన్ సీనియర్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ఈ పరిణామం ఇరాన్‌తో పాటు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను జులై మొదటి వారం నుంచి భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిపోయే ఈ అంత్యక్రియలకు లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

## ఐరాస కార్యాలయంముందు టిబెట్ వ్యక్తి ఆత్మాహుతి..

**న్యూయార్క్,జులై 3:** అమెరికాలోని టిబెట్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఒంటికి నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.న్యూయార్క్‌లో ఉన్న ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం ముందు ఈ ఘటన జరిగింది. టిబెట్ దేశ జెండాను పట్టుకుని అతను తనను తాను కాల్చుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 52యేళ్ల వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో అతను మరణించినట్లు న్యూయార్క్ పోలీసుశాఖ వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

4-7Pg6exHMNWJQE.qxd:4-7Pg6exHMNWJQE.qxd 1/1/02 6:21 AM Page 1



# టిడిపిని మరింత బలోపేతం చేస్తా

● తిరుపతి ఇన్‌ఛార్జిగా శ్రీనివాస్



**తిరుపతి, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి, పార్టీ కోసం కష్టపడిన నాయకులకు గుర్తింపునిస్తానని తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా జెబిని నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా మన్నెం శ్రీనివాసులు నియా మకంను తిరుమల నేత రాజు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జెబి శ్రీనివాసులుని తిరుమల టిడిపి అధ్యక్షుడు రాజు యాదవ్, కార్యదర్శి శివషణ్ముగంతో కలిసి సత్కరించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

## అమరావతి అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తోంది



**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం భారీ అప్పులు చేస్తోందని, ఈ భారం చివరికి రాష్ట్ర ప్రజల నెత్తినే పడబోతోందని వైసిపి సమన్వయ కర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో చేపట్టే ప్రతి ప్రాజెక్టుపై పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల ను ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రధాన ప్రతిపక్షంగా తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా ప్రభుత్వం మాత్రం రైతులను చివరి ప్రాధాన్యతగా చూస్తోందని ఆరోపించారు. అమరావతిలో ఒక్క చదరపు అడుగు నిర్మాణానికి ఏకంగా రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారని, దీనిపై తాము సందేహాలు వ్యక్తం చేస్తే అధికార పక్షం సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మండిపడ్డారు.

# తిరుమల సమాచారం



## రికార్డు స్థాయిలో 1.27 కోట్ల లడ్డూల విక్రయం

తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి దర్శనానంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది జూన్ నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో టిటిడి లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 1,11,96,170 లడ్డూలు, మే నెలలో 1,21,35,528 లడ్డూలు, జూన్ నెలలో 1,26,81,805 లడ్డూలు విక్రయమయ్యాయి. గత మూడు నెలలతో పోలిస్తే ఈ జూన్ నెలలో లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2024 జూన్ నెలలో 1,02,64,364 లడ్డూలు, 2025 జూన్ నెలలో 1,19,21,353 లడ్డూలు విక్రయాలు జరగగా, 2026 జూన్ నెలలో 1,26,81,805 లడ్డూలు విక్రయించడం విశేషం. గత ఏడాది జూన్‌తో పోలిస్తే 7,59,452 లడ్డూలు అధికంగా విక్రయమవ్వడంతో 6.37 శాతం వృద్ధి నమోదైంది. 2024తో పోలిస్తే 24,17,441 లడ్డూలు అధికంగా విక్రయమవ్వగా 23.55 శాతం వృద్ధి నమోదైంది. శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు విచ్చేస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో లడ్డూ ప్రసాదాల తయారీ, పంపిణీలోటిటిడి సమర్థవంతమైన ప్రణాళికతో వ్యవహరిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం సేవలందిస్తోంది. ఇప్పుడు తాజాగా రుచిగా లడ్డూల నాణ్యత కూడా పెరిగింది.



## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.20లక్షలు విరాళం

**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు, ప్రధానంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాతలు విరివిగా విరాళాలు అందిస్తున్నారు. శుక్రవారం చిత్తూరుకు చెందిన సురేష్ కుమార్ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, చిలకలూరిపేటకు చెందిన చుండి రంగనాయకులు రూ.10 లక్షలు విరాళమిచ్చారు. ఈ విరాళాల డిడిపి టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు అందజేశారు.



## కేంద్ర మంత్రులకు చైర్మన్ అల్పాహార విందు

**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనానంతరం శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి దంపతులు తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చైర్మన్‌తో కలిసి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టువస్త్రంతో సత్కరించి శ్రీవారి ప్రతిమను చైర్మన్ అందజేశారు. అలాగే టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని మరో కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ దంపతులు కలిశారు. కేంద్ర మంత్రి జాదవ్ దంపతులను పట్టువస్త్రంతో సత్కరించి, శ్రీవారి ప్రతిమను చైర్మన్ బిఆర్ నాయుడు అందజేశారు. తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలు, దర్శనం విషయాలపై ముచ్చటించారు.



# బిఎల్‌ఒలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు(కలెక్టరేట్), జులై 3 ప్రభాతవార్త:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్ లెవెల్ ఆఫీసర్లు అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు వెంగళరావు నగర్ ప్రాంతంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యూ మరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్య క్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకా రం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిం చాలని బిఎల్‌ఓలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సమాచారం కోసం ఫోన్ చేసిన ఓటర్లందరకు సమాచారం అందించాలని బిఎల్‌వోలకు సూ చించారు. ఓటర్ల నుండి అందుతున్న దరఖా స్తులను సకాలంలో పరిశీలించి, నిర్దేశిత విధా నాల ప్రకారం నమోదు ప్రక్రియ పూర్తి చేయా లని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో అవకతవకలు

## విచారణ చేయాలని కలెక్టర్‌కి వైసిపి నేతలు వినతి



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 3 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రక్రియలో కోవూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలో అనేక అవరోధాలు, ఇబ్బందులు ఉన్నాయి, వీటి పై విచారణ చేయాలని వైసీపీ మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కి వినతి అందచేసారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో సర్ ప్రక్రియ మొదలు పెట్టినప్పటి నుండి అనేక అవరోధాలు ఇబ్బందులు గుర్తించామని కొన్ని చోట్ల ఇన్యూమరేషన్ ఫాంలు బిఎల్ఎలకు సమాచారం లేకుండా బిఎల్ఓ ఇచ్చేశారని కొన్ని చోట్ల డేటా చోరీ జరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని మండి పడ్డారు. ఇటీవల మంత్రి నారాయణ నెల్లూరు నగర కమిషనర్ సర్ ప్రక్రియ గురించి మాట్లాడుకున్న విషయం గురించి జగన్ స్వయంగా మాట్లాడారని బిఎల్‌ఓలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు ఇస్తున్నారని ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరగాల్సి న సర్ ప్రక్రియలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని ఆరోపించారు. సర్ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా జరగడం లేదని కోవూరు నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫాంలు ఇచ్చారు కానీ వాటిని డిజిటల్ చేయలేదని డిజిటల్ పూర్తయితేనే అర్హులకు ఓట్లు వస్తాయని ఈ విషయంపై ఎన్నికల చీఫ్ అధికారికి కూడా పార్టీ తరపున లేఖ సమర్పించినట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

**పొదలకూరు (నెల్లూరు), జులై 3 ప్రభాతవార్త:** పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

దేగపూడి గ్రామానికి చెందిన తాళ్లూరు రవీంద్ర (41) సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై పొదలకూరుకు వస్తుండగా, పొదలకూరు నుంచి రాపూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రవీంద్ర సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పొదలకూరు సీఐ వెంకట్రావు, ఎస్ఐ హనీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హనీఫ్ తెలిపారు. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

# బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ



ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**నెల్లూరు(వైద్యం), జులై 3 ప్రభాతవార్త:** ఆర్థికంగా వెనుకబడిన, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) భరోసాగా నిలుస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీ నెల్లూరులోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 5 మంది లబ్ధిదారులకు రూ.7.57 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం వారి వైద్య, అత్యవసర అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 144 మంది లబ్ధిదారులకు రూ.1.91 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేదలు, అవసరమైన సమయంలో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడకుండా వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులు అందరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# చిన్నారుల విద్యారంభం మంగళప్రదంగా సాగాలి

● వకుళమాత సన్నిధిలో శాస్త్రోక్తంగా 'అక్షర గోవిందం - అన్నప్రాశనం' ప్రారంభం



**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** చిన్నారుల విద్యారంభం, జీవితారంభం వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో మంగళప్రదంగా సాగాలనే సంకల్పంతో టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'అక్షర గోవిందం - అన్నప్రాశనం' కార్యక్రమం ప్రారంభించారు. టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి రూరల్ పేరూరులోని వకుళమాత ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన 'అక్షర గోవిందం - అన్నప్రాశనం' కార్యక్రమాన్ని శుక్రవారం మధ్యాహ్నం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర పాల్గొని చిన్నారులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం చైర్మన్ నాయుడు మాట్లాడుతూ అక్షరాభ్యాసం, అన్నప్రాశనం ప్రతి చిన్నారి జీవితంలోని అత్యంత పవిత్ర సంస్కారాలు అని పేర్కొన్నారు. తొలి అక్షరం 'గోవింద' నామంతో ప్రారంభమైతే విద్యాభ్యాసం దైవానుగ్రహంతో విజయవంతంగా సాగుతుందనే విశ్వాసంతో ఈ కార్యక్రమాన్ని టిటిడి ప్రారంభించిందన్నారు. ప్రతి హిందూ కుటుంబం ఈ దివ్య అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రత్యేక పూజల అనంతరం చిన్నారులకు రాతపలక, బలపాలు, అక్షి ంతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి కంకణం, ఫటిక బెల్లం, వేంకటేశ్వరస్వామి, వకుళమాత, పద్మావతి అమ్మవారు, సరస్వతీదేవి చిత్రపటాలు, గోవింద నామాలు, వేంకటేశ్వర సుప్రభాతం, పెద్దబాలశిక్షతో పాటు పూజా, విద్యా సామగ్రి ఉన్న 'అక్షర గోవిందం కిట్' ఉచితంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్ రెడ్డి, దర్శన్, ఎన్.సదాశివరావు, సి.దివాకర్ రెడ్డి, హెచ్‌డిపిపి కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, అదనపు కార్యదర్శి కల్యాణి, ఎస్ఇలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, డిప్యూటీ ఇఒలు శివప్రసాద్, ఆనంద రాజు, విఎస్ఒ గిరిధర్, ఎఇఒ గోపీనాథ్, ఇతర అధికారులు, చిన్నారులు, తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.

**రూ.2 కోట్ల పిఎసి ప్రారంభం:** వకుళమాత ఆలయం ప్రాంగణంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన యాత్రికుల వసతి సముదాయాన్ని టిటిడి చైర్మన్, ఇఒ సంయుక్తంగా ప్రారంభించారు. ఇక్కడ యాత్రికులకు ఇదీ మరింత వసతి కల్పించేందుకు దోహదపడుతుంది.

## శివయ్య సన్నిధిలో కేంద్ర మంత్రుల పూజలు



**శ్రీకాళహస్తి, జులై 3 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం భక్తులతో కిటకిట లాడింది. కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి ఎల్ మురుగన్ రాగా, దక్షిణ గోపురం వద్ద బిజెపి నాయకులతో పాటు ఆలయ ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌రెడ్డి, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకోవాలని కోరగా, చందురాయల్ వెంటనే సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం అనంతరం కేంద్ర మంత్రికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇఒ బికె వెంకటేశు మంత్రికి స్వామిఅమ్మవార్ల చిత్రపటాలను అందించారు. స్వాగతం పలికిన వారిలో బిజెపి నేతలు అమర్‌నాథ్, పుణ్యం ఢిల్లీబాబు, వాసు యాదవ్, కూనాటి నాగరాజు హరీష్ రెడ్డి, కృష్ణా రెడ్డి, బి.వెంకటేష్, శ్రీధర్, రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

## తప్పిపోయిన బాలిక.. 2 గంటల్లోనే గుర్తింపు



**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన కుటుంబం నుండి ఓ బాలిక తప్పిపోవడంతో వెంటనే తల్లిదండ్రులు తిరుమల పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తెలంగాణ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన నరసింహులు, లడ్డమ్మ దంపతులు కుమార్తె అను షామిని (9)తో కలిసి శ్రీవారి దర్శనార్థం గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చారు వెంకటాద్రి నిలయంలో బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 2గంటల ప్రాంతంలో బాలిక కనిపించకుండా పోయింది. గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. తిరుమల డిఎస్పీ విజయశేఖర్ పర్యవేక్షణలో కమాండ్ కంట్రోల్ సెంటర్, ట్రాఫిక్, శాంతిభద్రతలు బీట్ పోలీసులు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది అప్రమత్తత, సమన్వయం, వేగవంతమైన స్పందన ఫలితంగా బాలికను సమాచారం అందిన రెండు గంటల్లోపే సురక్షి తంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా తిరిగి అప్పగించినందుకు బాలిక తల్లిదండ్రులు తిరుమల పోలీసుల సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# రూ.10వేలు కాదు... 17 వేలు చేయండి

● స్టైపెండ్ కోసం జూనియర్ న్యాయవాదుల నిరసన



**తిరుపతి, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూనియర్ న్యాయవాదుల స్టైఫండ్ రూ.5 వేల నుండి 10 వేలకు పెంచుతున్నట్లు మంత్రి ఫరూక్ ప్రకటన తరువాత తిరుపతిలో జూనియర్ న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. తమకు రూ.10వేలు స్టైఫండ్ కాదని 17వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాల సముదాయం ఎదుట జూనియర్ న్యాయవాదులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరుగుతున్న ఖర్చులకు కుటుంబ పోషణభారం కావడంతో 17వేలుకు పెంచి తక్షణమే అందజేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు పలువురు న్యాయవాదులు మద్దతు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడమే గాక జూనియర్ న్యాయవాదులకు న్యాయం చేయాలని అన్నారు.

## ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

● రావణ్ అప్పగించాలంటూ జనసేన కార్యకర్తల ఆందోళన

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నం ఇనగుదురుపేట పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదాస్పద యూట్యూబర్ ప్రశ్న రావణ్ ఇనగుదురుపేట పిఎస్‌లో విచారిస్తున్న విషయం తెలుసుకున్న జనసేన నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపేందుకు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా బారికేడ్లను తోసుకుని మరీ స్టేషన్ వద్దకు వచ్చారు. గోడలు దూకి స్టేషన్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. రావణ్ తరఫు న్యాయవాదులు స్టేషన్ వద్దకు రావడంతో జన సైనికులు ఆందోళన చేశారు. పోలీసులు జనసేన నాయకులు, కార్యకర్తలను అక్కడి నుంచి పంపించేసి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పిఎస్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో ప్రముఖ యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విచారణ అనంతరం ఆస్పత్రిలో వైద్య పరీక్షలు జరిపించి కోర్టు హాజరు పర్చనున్నారు.

## 'అమరావతి' పేరుతో అవినీతికి పథక రచన

● మాజీ ఎంపి విజయసాయిరెడ్డి ఆరోపణ

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి నిర్మాణం పేరుతో సుమారు రూ.15,000 కోట్ల అవినీతికి పథకం రచించారని, ఈ అవినీతి యజ్ఞంపై పూర్తి ఆధారాలతో త్వరలోనే కోర్టును ఆశ్రయిస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణ చేసారు. టిడిపి అమరావతి, అంటుంటే, వైసిపి మావిగన్ అనడం వంటి అర్థరహిత వాదనలను పక్కనపెట్టి, రాజధాని పేరుతో జరుగుతున్న భారీ అవినీతిపై దృష్టి సారించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసారు. ఒక బాధ్యతగల పౌరుడిగా తన అభిప్రాయాలను పంచుకుంటున్నానంటూ విజయసాయి రెడ్డి పలు కీలక ప్రశ్నలను సంధించారు. "రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా ఇంకా రాజధాని ఎక్కడో తేల్చకుండా చర్చించడం అందరూ సిగ్గుపడాల్సిన విషయం కాదా? 2029 ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలే నిర్ణయించాలా? ఈ రాజకీయ చదరంగానికి అన్ని పార్టీలు బాధ్యత వహించవద్దా?" అని ఆయన నిలదీశారు. వైసిపి 'మావిగన్' అనడం వల్ల ప్రయోజనమేంటని, ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల గతేంటని ఆయన ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం అంటే పార్టీలు కమీషన్లు దండుకోవడం కాదని హితవు పలికారు. అమరావతి పేరుతో జరుగుతున్న ఈ అవినీతిపై ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో, ప్రజాపక్షాన త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## కంభం రోడ్డు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కంభం పట్టణంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి సహా నలుగురు మృతి చెందడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పెళ్లి వేడుకకు హాజరై ఆలయానికి వెళ్లిన వారు ఈ విధంగా ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. వివాహ వేడుకల ఆనందం నిండిన కుటుంబంలో ఇలాంటి పెనువిషాదం నెలకొనడం హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తీవ్రంగా గాయపడిన వారి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని, బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు.



## టిటిడి అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.50.20 లక్షలు

**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడుకు చెందిన కెకెఎస్ కన్స్‌ట్రక్షన్స్ సంస్థ శుక్రవారం వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.50.20 లక్షలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

## నకిలీ ఆధార్ కార్డులతో గదులు అక్రమ బుకింగ్

# అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



**తిరుమల, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో సామాన్య భక్తులకు కేటాయించే టిటిడి వసతి గదులను నకిలీ ఆధార్ కార్డులతో అక్రమంగా పొందుతూ, గదులు దొరకని భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్న నలుగురి ని తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుమల సి.ఆర్.ఒ కార్యాల యం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను టిటిడి సిబ్బంది గుర్తించి పోలీసులకు అప్పగించారు. దర్యాప్తులో మొబైల్ యాప్‌ల ద్వారా నకిలీ ఆధార్ కార్డులను తయారు చేసి గదులను పొందడం, అనంతరం వాటిని రూ 2వేల నుండి 3వేల వరకు అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. ఎం.వేణుగోపాల్ (తెలంగాణ), దొంత రవీంద్రబాబు (ఆంధ్రప్రదేశ్), సంతోష్‌కుమార్ (ఉత్తరప్రదేశ్), టి.ఈశ్వర్ (తెలంగాణ). నుండి రెండు సెల్‌ఫోన్లు, 12 నకిలీ ఆధార్ కార్డులు, డిజిటల్ ఆధారాలు స్వాధనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.



డా. ఎం.వి.వి. ఎస్ మూర్తి గారి 88వ జయంతి సందర్భంగా విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి స్మరించుకోవడం జరిగింది



భీమిలి నియోజకవర్గం ఆనందపురం, భీమిలి మండలాల పరిధిలోని కొత్తవలస గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం.190, అలాగే గండిగుండం గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం.64, 64ఏలను తహశీల్దార్లు, ప్రత్యేక అధికారులతో కలిసి సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి



### డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తికి

# గీతం ఘన నివాళి



**విశాఖపట్నం, జూలై 3, ప్రభాతవార్త:**

గీతం విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ విద్యావేత్త, పార్లమెంట్ మాజీ సభ్యుడు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి 88వ జయంతిని శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆవరణలోని డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి విగ్రహం మరియు స్మృతివనం వద్ద విశాఖ పార్లమెంట్ సభ్యుడు మరియు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధర రావు, ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, వివిధ కళాశాలల డైరక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా (తరువాయి 8వ పేజీలో)

### మానవత్వాన్ని చాటుకున్న

# కలెక్టర్ విజయ కృష్ణన్

**అనకాపల్లి, జూలై 3 (ప్రభాత వార్త):**



విధి నిర్వహణలోనే కాకుండా మానవత్వంలోనూ ఆదర్శంగా నిలుస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరోసారి తన సున్నిత మనసును చాటుకున్నారు. శుక్రవారం మాడుగులలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న సందర్భంగా, బంగారుమెట్ట వద్ద రహదారి పక్కన కురుస్తున్న వర్షంలో బస్సు కోసం వేచి చూస్తున్న పలువురు విద్యార్థులను కలెక్టర్ గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపించి వారి వివరాలు తెలుసుకుని, వారిని తన కారులో ఎక్కించుకుని బంగారుమెట్ట జంక్షన్ నుంచి చిన్నప్పనపాలెం వరకు సురక్షితంగా దింపించారు. విద్యార్థులు వర్షంలో ఇబ్బంది పడకుండా వెంటనే స్పందించి వారికి లిఫ్ట్ ఇవ్వడం అక్కడి స్థానికులను ఆకట్టుకుంది. కలెక్టర్ చూపిన మానవత్వం, బాధ్యతాయుతమైన స్పందనకు స్థానికులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

### పర్యాటకాభివృద్ధికి

# పెద్ద పీట వేస్తున్నాం





**కైలాసగిరి-జూ పార్క్-కంభాలకొండ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు: ఎంపీ ఎం. శ్రీభరత్**

**విశాఖపట్నం, జూలై 3, ప్రభాతవార్త:**

విశాఖలో పర్యాటకాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని, ఇందులో భాగంగానే కైలాసగిరి, జూ పార్క్, కంబాలకొండలను కలుపుతూ పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా అభివృద్ధి చేయనున్నామని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ అన్నారు. గురువారం విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో విఎంఆర్‌డిఎ మెట్రో పాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర దామా, జూ క్యురేటర్ శ్రీమతి మంగమ్మ, సింగపూర్‌కి చెందిన మాందాయ్, బెంగుళూరుకి చెందిన ఇంటిగ్రేటెడ్ డిజైన్ సంస్థ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పర్యాటక హబ్‌గా పేరొందిన విశాఖలో ఏకో టూరిజంను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. విశాఖలో వైవిధ్యభరితమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నాయని, అందుకు అనుగుణంగా ఎటువంటి న్యాయ పరమైన ఇబ్బందులు లేకుండా, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రాధాన్యత ఇస్తూ, అటవీశాఖ, విఎంఆర్‌డిఎ, పర్యాటక శాఖ, జీవీఎంసీ అధికారులతో సమన్వయం చేస్తూ, నివేదిక రూపకల్పన చేయాలని సూచించారు. ప్రకృతి రమణీయతకు మారుపేరుగా ఉన్న కైలాసగిరి, కంబాలకొండ వంటి





ప్రాంతాల్లో మరిన్ని ఆకర్షణీయమైన సాహస క్రీడల నెలకొల్పే విధంగా ప్రత్యేక నివేదిక రూపొందించాలని సూచించారు. అలాగే ఆయా పరిసరాల్లో పర్యాటక పరంగా అభివృద్ధి చేయాల్సిన అవశ్యకతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. ప్రసిద్ధి పర్యాటక ప్రాంతాల్లో నైట్ సఫారీ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. మొదట విడతగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు, పర్యాటకుల అవసరాలను గుర్తించి వాటిని అనుగుణంగా అభివృద్ధి కి అవసరమైన ప్రతిపాదన చేయాలని సూచించారు. త్వరలోనే పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీమతి దాట్ల కీర్తి , ముఖ్య ప్రణాళిక అధికారిని శ్రీమతి దివ్య లత, ఓఎస్‌డి కృష్ణ నాయక్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఎస్ఈ రాంబాబు, కార్యనిర్వహక ఇంజనీర్ సుధీర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మాజీ జడ్పీటీసీ బలరామమూర్తిని పరామర్శించిన

# స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం, జూలై 3, ప్రభాతవార్త:**

నర్సీపట్నం మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ అధికారి బలరామమూర్తి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వయంగా శెట్టిపల్లిలోని బలరామమూర్తి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. 1983 నుంచి పార్టీకి, శెట్టిపల్లి గ్రామానికి బలరామమూర్తి చేసిన సేవలు ఎనలేనివని ఈ (తరువాయి 8వ పేజీలో)

**ఘనంగా మెకానిక్స్ డే సంబరాలు**

### నూతన టెక్నాలజీపై శిక్షణ శిబిరం

# ఏర్పాటుకు స్పీకర్ హామీ



**నర్సీపట్నం, జూలై 3, ప్రభాతవార్త:**

నర్సీపట్నంలోని శ్రీ వరసిద్ధి వినాయక బైక్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెకానిక్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులంతా కలిసి నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన స్పీకర్ ఆటోమొబైల్ రంగంలో పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మెకానిక్‌లకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు (ట్రైనింగ్ క్యాంప్) ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ యాక రామకృష్ణ, సెక్రటరీ ఎస్. సూరిబాబు, కోశాధికారి ఉగ్గిన శివ, గౌరవ అధ్యక్షులు బి.శ్రీను, కొప్పిశెట్టి గోవిందుతో పాటు పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# 'సర్' పై జిల్లా కలెక్టర్, జెసీ క్షేత్ర పరిశీలన



- చినగదిలి, ఆనందపురం, భీమిలి, పెందుర్తి మండలాల్లో సుడిగాలి పర్యటన
- జీవీఎంసీ కమీషనర్, తహసీల్దార్లు ఈఆర్వోలతో కలిసి ప్రజలతో మమైకం
- ఎస్ఐఆర్ వేగం పెంచాలంటూ క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు

**విశాఖపట్నం, జులై 3, ప్రభాతవార్త :**

ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ వేగాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ క్షేత్ర స్థాయి అధికారులును ఆదేశించారు. జూన్ 15 నుంచి ప్రారంభించిన నెల సర్ ప్రక్రియను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చెయ్యాల్సివుంది. ఇంత వరకు సర్ పై అన్నీ స్థాయిల్లోని అధికారులకు సంపూర్ణంగా అవగాహన కలిగించిన కలెక్టర్ శుక్రవారం నుంచి క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం జీవీఎంసీ పరిధిలోని విశాఖ తూర్పు, భీమిలి, పెందుర్తి నియోజక వర్గాలలో పలు ప్రాంతాలలో ఆకస్మికంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సర్ ప్రక్రియ తీరును స్థానిక అధికారులుతో కలిసి పర్యవేక్షించి ఆయా గ్రామాల ప్రజలు తో మమేకమై అవగాహన కల్పించారు. శుక్రవారం ఉదయం పర్యటనలో భాగంగా తోలుత తూర్పు నియోజకవర్గం చిన గదిలి గ్రామీణ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జీవీఎంసీ కమీషనర్ కేతన్ గార్గ్, స్థానిక ఈఆర్వోలతో కలిసి సందర్శించిన కలెక్టర్ మండలపరిధిలో సాగుతున్న సర్ ప్రక్రియతీరును పరిశీలించారు. అనంతరం అక్కడ నుంచి పెందుర్తి నియోజకవర్గం లోని చినముషిడివాడ, రాతిచెరువు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామాల ప్రజలతో సమావేశం అయి క్షేత్ర స్థాయి నమోదు లో పాటించాల్సిన విధి వధానాలపై అవగాహన కల్పించారు. ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా సేకరిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను అత్యంత కచ్చితత్వంతో, వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ తన వెంటవున్నా తహసీల్దార్ లు, ఈఆర్వో సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల, నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి ఫారాన్ని పరిశీలించి డిజిటలైజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫారాల (తరువాయి 8వ పేజీలో)

### చంద్రంపాలెం హైస్కూల్‌కు

# పూర్వ వైభవం

**క్రమశిక్షణ రాహిత్యాన్ని సహించేది లేదు: గంటా**

**ఆగస్టు 15 నాటికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి, క్రీడా మైదానం సిద్ధం చేయాలి**



**మధురవాడ, జులై 3, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో అతిపెద్దదైన చంద్రంపాలెం హైస్కూల్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చే క్రమంలో ఎలాంటి క్రమశిక్షణ చర్యలకైనా వెనుకాడబోమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శుక్రవారం చంద్రంపాలెం హైస్కూల్ లో విద్యా శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. హెచ్.ఎం. వెంకట్రావు వైఖరిని నిరసిస్తూ టీచర్లు పరస్పరం ఫిర్యాదు చేసుకున్న అంశంపై చర్చించారు. అడ్మిషన్లు లేవని గతంలో బోర్డులు పెట్టేవారని.. అంతటి పేరున్న స్కూల్ లో ఇప్పుడు విద్యార్థుల సంఖ్య సహా విద్యా ప్రమాణాలు పడిపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్.ఎం.తో పాటు టీచర్లు క్రమశిక్షణతో ఉంటేనే ఉత్తమ ఫలితాలు తీసుకురాగలమని తెలిపారు. తాను విద్యా శాఖ మంత్రిగా శ్రీలంకలో 7,500 మంది విద్యార్థులున్న స్కూల్ సందర్శించినప్పుడు కొన్ని తరగతుల బాధ్యతలను హెచ్.ఎం.తో పాటు సీనియర్ టీచర్లు తీసుకుని మెరుగైన ఫలితాలు సాధించడం గమనించామన్నారు. శ్రీలంక మోడల్ అమలు చేయడం వల్ల ఎంత వరకు ఉపయోగం ఉంటుందనేది పరిశీలించాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో సమర్థమైన హెచ్.ఎం. పేరు సూచించాలన్నారు. డైనింగ్ హాల్ లేనందున వరండాలు, ఆరు బయట మధ్యాహ్న భోజనం చేస్తున్న విషయాన్ని గంటా ప్రస్తావించారు. నిధులు లేవని డీఈఓ చెప్పగా, వాటి గురించి తాను చూస్తానని.. డైనింగ్ హాల్ ఎక్కడ ఏర్పాటు చేయాలనేది చెప్పాలన్నారు.

**రూ. కోటితో అధునాతన క్రీడా మైదానం**

రూ.కోటి దివీస్ సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన హైస్కూల్ క్రీడా మైదానాన్ని గంటా పరిశీలించారు. అభివృద్ధి చేస్తున్న మైదానంలో టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్ బాల్ వంటి క్రీడలకు సంబంధించి విడివిడిగా ఆట స్థలాలను, వాకింగ్ ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. గతం లో వర్షం పడితే చెరువును తలపించే హైస్కూల్ మైదానం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గంటా రవితేజల ప్రత్యేక శ్రద్ధ కారణంగా అన్ని హంగులతో విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. మరో వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. ఆగస్టు 15 నాటికి ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు అభివృద్ధి చేసిన క్రీడా మైదానాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్, ఆర్.జె.డి. బి. విజయ్ భాస్కర్, డిప్యూటీ డీఈఓ ఎ.సోమేశ్వరరావు, ఎంఈఓ సీహెచ్. రవీంద్ర బాబు, జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఏఎంహెచ్ఓ రవి కుమార్, స్థానిక నాయకులు చిక్కాల విజయ్ బాబు, పిల్లా వెంకట్రావు, గరే గుర్నాథ్, కానూరు అచ్యుతరావు, నాగోతి సత్యనారాయణ, సూర్యప్రకాష్, పోలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చైతన్య స్రవంతి ట్రస్టు నుంచి కేజీహెచ్‌కు

# వైద్య పరికరాల విరాళం

**విశాఖపట్నం, జులై 3 ప్రభాత వార్త :**

నగరానికి చెందిన చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ పెద్దాసుపత్రి కెజీహెచ్ కార్డియాలజీ, యూరాలజీ వైద్య విభాగాల రోగుల చికిత్సలకు ఉపయోగపడే రెండు కీలక వైద్య యంత్ర పరికరాలను విరాళంగా అందజేసింది. ట్రస్టు కార్పొరేట్ సామాజిక భాద్యతా (సీయస్ ఆర్) నిధులు తో కొనుగోలు చేసిన 1.70 లక్షల విలువ చేసే పల్స్ జనరేటర్, లితోక్లాస్ట్ సర్జరీ యంత్ర పరికరాలను ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రెహమాన్ గురువారం కెజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి అందజేశారు.సుమారు (తరువాయి 8వ పేజీలో)



# మాజీ జడ్పీటీసీ బలరామమూర్తిని పరామర్శించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

(7వ పేజీ తరువాయి)

సందర్భంగా స్పీకర్ కొనియాడారు. ప్రస్తుతం కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తాను నర్సీపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాలసిస్ చేయించుకుంటున్నట్లు బలరామమూర్తి స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. మీరు చొరవ తీసుకుని నర్సీపట్నంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్లే తనకు స్థానికంగా సులభంగా వైద్యం అందుతోందని, ఆ సదుపాయం లేని పక్షంలో ప్రతిసారీ విశాఖపట్నం వెళ్లి చేయించుకోవాల్సిన కష్టమైన పరిస్థితి ఉండేదని ఆయన స్పీకర్‌కు కృతజ్ఞతలు వ్యక్తంచేశారు. తన అభిమాన నాయకుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా తన ఇంటికి వచ్చి పరామర్శించడంతో బలరామమూర్తి ఎంతో సంతోషం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, పలువురు గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తికి గీతం ఘన నివాళి

(7వ పేజీ తరువాయి)

ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.విఎస్ మూర్తి గీతం వంటి విద్యాసంస్థను ఉన్నత సరస్వతీ పీఠంగా తీర్చిదిద్దారని విశాఖ, హైదరాబాద్, బెంగళూరు గీతం ప్రాంగణాలలో ఉన్నత విద్య అభ్యసించిన వేలాది మంది విద్యార్థులు దేశ, విదేశాలలో ఉన్నత స్థానాలలో ఉన్నారని పేర్కొన్నారు, స్వర్గీయ డాక్టర్ మూర్తి ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

# వైద్య పరికరాల విరాళం

(7వ పేజీ తరువాయి)

లక్షా ఇరవై వేల ఖరీదు చేసే పల్స్ జనరేటర్ యంత్ర పరికరాన్ని గుండె జబ్బుతో బాధపడే రోగులకు గుండెపోటు వచ్చే సమయంలోను, వారిలో పల్స్ రేటు బాగా తగ్గిన సమయంలోను, హృద్రోగులకు సీపీఆర్ చేసే సమయంలోనూ ఉపయోగిస్తారని కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జిజె. మధురీ తెలిపారు.అదేవిధంగా యాభై వేల రూపాయలు విలువ చేసే లితో?క్లాస్ట్ మిషన్ ను మూత్ర సంబంధ (యూరాలజీ )వ్యాధులు తో బాధపడే రోగులకు కిడ్నీ, గాల్ బ్లేడర్ లలో రాళ్లు ను బ్లాస్ట్ చేసే ఆపరేషన్ సమయంలో దీనిని ఉపయోగి స్తారని ఆసుపత్రి యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఐ. చంద్రశేఖర్ చెప్పారు. ఆసుపత్రి రోగుల సహాయార్థం కీలక యంత్ర వైద్య పరికరాలను సీఎస్ఆర్ కింద విరాళం గా అందజేసిన చైతన్య స్రవంతి ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ శిరీన్ రెహమాన్, డాక్టర్ యస్ ఎ. రెహమాన్ దంపతులనకు ఈ సందర్బంగా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఐ. వాణి కృతజ్ఞతా పూర్వక అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో కార్డియాలజీ,యూరాలజీ విభాగధిపతులు డాక్టర్ మురళీ కృష్ణ డాక్టర్ ఐ. చంద్రశేఖర్ లతో పాటు కార్డియాలజీ ప్రొఫెసర్ మాధురి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివదయాళ్ ఆసుపత్రి డూప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ కుమార్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి. కిరణ్ కుమార్ రెండు వైద్య విభాగాలకు చెందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు ఆసుపత్రి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ ప్రాణ రక్షణ

## ట్రాఫిక్ పోలీసుల అవగాహన కార్యక్రమం



విశాఖపట్నం, జులై 3 ప్రభాతవార్త

ద్విచక్ర వాహనదారులు వాహనం నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్ పెట్టుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

అదేవిధంగా కాలుష్య నియంత్రణ ధృవీకరణ పొల్యూషన్ అండర్ సర్టిఫికెట్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించరాదని, ఇతర ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## గురుకులం ఈఏంఆర్‌ఎస్‌లో తొలగించిన ఉపాధ్యాయులను

# వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

పాడేరు, జూలై 3, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్‌లో గురుకుల విద్యాసంస్థల్లో పనిచేసిన 488 మంది ఉపాధ్యాయులు, అలాగే లిఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో పనిచేసిన సుమారు 100 మంది ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామనీ ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పీ.అప్పలనరస పేర్కొన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొనసాగుతోందనీ ఈ పరిస్థితిలో గతంలో సేవలందించిన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం విద్యార్థుల విద్యా ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుందన్నారు.

అదేవిధంగా, జి.ఓ.నెం.3లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఆదివాసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతున్నామన్నారు.. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ అర్హులైన ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే, ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌ను పునఃసమీక్షించి, ప్రస్తుతం సేవలు కోల్పోయిన 100 మంది ఉపాధ్యాయుల సమస్యను ముందుగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అయన కోరారు. గురుకుల ఏకలవ్య లో తొలగించిన ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. రెన్యూవల్ చేస్తామని మరోపక్క ఏకలవ్య టీచర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌ను జారీ చేయడం అన్యాయం. పునఃసమీక్షించి, తొలగించిన ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జి.ఓ నెం. 3 ప్రకారం ఆదివాసీ రిజర్వేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలనీ. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ,సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి న్యాయమైన పరిష్కారం చూపాలని అప్పలనరస కోరారు.

# సర్ ప్రోగ్రాంలో అల్లూరి జిల్లా పేసా చట్టం అధ్యక్షులు కార్యద్దర్శిలు భాగస్వామ్యం కావాలి

## బీజేపీ నాయకులు పేసా అధ్యక్షులు సల్ల రామకృష్ణ

పాడేరు, జూలై 3, ప్రభాతవార్త;

సెంట్రల్, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ యొక్క సూచన ప్రకారం జిల్లాలో ప్రతి బూత్‌లో ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమం గత నేల 15 వ తేదీ నుండి ప్రతి ఓటర్ సమగ్ర సమాచారం సేకరణ కార్యక్రమం లో పేసా చట్టం ప్రతినిధులు పాల్గొని ప్రతి ఓటర్‌కు ఎనుమనరేషన్ ఫారం కుటుంబం యొక్క సమాచారం,2002 ,ఓటర్ లిస్ట్ సమాచారం పొందుపర్చాలనీ బీజేపీ నాయకులు పేసా అధ్యక్షులు సల్ల రామకృష్ణ కోరారు.బూత్ లెవెల్ ఆఫీసర్ (ప్రభుత్వం నియామకం,) అలాగే వివద్ద పార్టీ ల నుండి బిఎల్ఏ 2 సమగ్ర సర్వే లో భాగస్వామ్యం అవి ఉన్నారు కానీ కొని బూత్ లో ఓటర్స్ కు ఎనుమునురేషన్ ఫార్మ్ అందడము లో ఇబ్బందిగా ఉందన్నారు., కావున డివిజన్ ప్రతి పంచాయతీ యొక్క పేసా చట్టం సభ్యులు విధిగా స్వచ్ఛందముగా బూత్ లెవెల్ ఆఫీసర్ కు సహాకారించలని పేసా చట్టం ఉపాధ్యక్షులు, కార్యద్దర్శిలకు పేసా చట్టం సభ్యులు తరపున విజ్ఞప్తి చేసారు.

# 'సర్ పై జిల్లా కలెక్టర్, జెసీ క్షేత్ర పరిశీలన

(7వ పేజీ తరువాయి)

పంపిణీ, సేకరణ ప్రక్రియపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలని, సేకరించిన ఫారాలను ఆలస్యం లేకుండా డిజిటలైజ్ చేసి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ విధుల్లో నిమగ్నమైన బీఎల్వోలకు ఇతర పనులు అప్పగించకుండా ఈ విధులకే పరిమితం చేయాలని పేర్కొన్నారు. ప్రక్రియ వేగవంతంగా పూర్తయ్యేందుకు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం పెంచాలని, క్షేత్రస్థాయిలో ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది, స్థానిక బూత్ స్థాయి ఏజెంట్ల సహకారాన్ని వినియోగించు కోవాలని సూచించారు. మరణించిన వారు, వలస వెళ్లిన వారు, తప్పుగా నమోదైన ఓటర్లు, తొలగిపోయిన ఓట్లు, ఇతర పోలింగ్ కేంద్రాలకు



మారిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

**భీమిలి నియోజకవర్గంలో జెసీ సుడిగాలి పర్యటన**

ఇదిలా వుండగా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, సర్ కార్యక్రమంలో భాగంగా గా శు క్రవారం భీమిలి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఆమె ఆనందపురం,భీముని పట్నం మండలాల పరిధిలోని కొత్తవలస గ్రామంలో పోలింగ్ స్టేషన్ నెంబర్ 190, గండిగుండం గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 64, అలాగే పోలింగ్ స్టేషన్ 64ఏ, లను సంబధిత మండలాల తహసీల్దార్లు ప్రత్యేక అధికారులు తో కలిసి సర్ ప్రక్రియ సాగుతున్న తీరు తెన్నులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె క్షేత్ర స్థాయి లోని సిబ్బంది కి పలు సూచనలు ఇచ్చారు.

# శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

## సీపీ శంఖబత్రబాగ్చి

విశాఖపట్నం, జులై 3 ప్రభాతవార్త

మహిళలు,చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విశాఖ కంచరపాలెం పోలీసులు, విద్యార్థినుల్లో స్వీయ రక్షణ పై చైతన్యం పెంపొందించే దిశగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కంచరపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో మహిళలు, విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడి మహిళ భద్రతా,రక్షణ,సైబర్ క్రైం మోసాలు పై పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తెలియని వ్యక్తులతో పరిచయాలు, వ్యక్తిగత ఫోటోలు లేదా సమాచారం పంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి విద్యార్థినులకు స్పష్టం గా వివరించారు. ఫోటో మార్ఫింగ్ ద్వారా బ్లాక్‌మెయిలింగ్, ఫేక్ ఫోన్ కాల్స్, ఓటీపీ మోసాలు, ఏటీఎం ఫ్రాడ్స్ వంటి సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.అలాగే మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన "శక్తి యాప్"




వినియోగంపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. యాప్ డౌన్‌లోడ్ విధానం, అత్యవసర సమయంలో ఎస్ఓఎస్ అలర్ట్ పంపే సదుపాయం, నైట్ షెల్టర్ వంటి భద్రతా ఫీచర్ల వినియోగాన్ని ప్రతి విద్యార్థి కి అర్థమయ్యేల వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, చిన్నారుల సహాయం కోసం 1098, మహిళల సహాయం కోసం 181, సైబర్ మోసాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వెంటనే ఉపయోగించాలని తెలిపారు. డ్రగ్స్ వల్ల యువత జీవితాలు ఎలా దెబ్బతింటున్నాయో వివరించిన పోలీసులు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలుయజేశారు. చిన్నారులపై లైంగిక నేరాల నివారణకు సంబంధించిన పోక్సో చట్టంపై కూడా అవగాహన కల్పించి, అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేవలం చట్టాల గురించి చెప్పడమే కాకుండా, ప్రమాద సమయంలో ఎలా స్పందించాలి, ఎలా ధైర్యంగా ఎదుర్కోవాలి అనే అంశాలపై సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులను కూడా వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో భద్రతపై నమ్మకం పెరగడంతో పాటు, స్వీయ రక్షణ మరియు సైబర్ అప్రమత్తతపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందని అధికారులు తెలిపారు.

# ఎదురువానిపాలెంలో 'సర్కారు' భూమి స్వాహా!

- బహిరంగంగానే ప్రహరీ గోడ నిర్మాణం
- క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే గణబాబు
- విచారణకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆదేశం

గాజువాక,జూలై 3,ప్రభాతవార్త :

జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని ఎదురువానిపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమి బహిరంగంగానే కబ్జాకు గురవుతోంది. గ్రామంలోని సర్వే నెంబర్ 21/5లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, దర్జాగా ప్రహరీ గోడ నిర్మిస్తున్నా స్థానిక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



**పరిశీలించిన ఎమ్మెల్యే....**

నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఇటీవల ఎదురువానిపాలెంలో పర్యటించిన విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు సదరు స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ ములగాడ రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో జీవీఎంసీ వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమవతిని అక్కడికక్కడే నిలదీశారు. ఈ భూమిపై తక్షణమే సమగ్ర సర్వే చేయించాలని, వీఎల్‌టీ టౌన్ ప్లానింగ్ పత్రాలను నిశితంగా పరిశీలించి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

**విచారణ జరుపుతాం... జోనల్ కమిషనర్**

ఎమ్మెల్యే ఆదేశాలపై జోనల్ కమిషనర్ హేమవతి తక్షణమే స్పందించారు. టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులకు ఈ వ్యవహారాన్ని బదిలీ చేశామని, పత్రాలను పరిశీలించి త్వరలోనే పూర్తిస్థాయి చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగడంతో అధికారులు ఇప్పుడు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటారా? లేక కబ్జాదారుల ఒత్తిళ్లకు తలొగ్గుతారా? అనేది వేచి చూడాలి.

# ప్రత్యేక అధికారులకు పగ్గాలు... పల్లెల అస్తవ్యస్తం!

బుచ్చయ్యపేట జూలై 3 ప్రభాతవార్త

గ్రామపంచాయతీలే గ్రామాభివృద్ధికి వెన్నెముకగా ఉండాల్సిన తరుణంలో బుచ్చయ్యపేట మండలం లోని పలు గ్రామాల్లో పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోందని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామాలలో అనేక సమస్యలు పేరుకుపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్యం పూర్తిగా గాడితప్ప డం, చెత్త కుప్పలు పెరగడం, వెలగని వీధి దీపాలు, మూసుకు పోయిన కాలువలు, తాగునీటి సమస్యలు ప్రజ లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తు న్నాయని మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు.

గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు కూడా తమ అసలు విధుల కంటే ప్రభుత్వ శాఖల నుంచి వచ్చే వివిధ సర్వేలు, గణాంకాల సేకరణ, ఇతర పరిపాలనా పనులతో నిత్యం బిజీగా ఉండడంతో గ్రామాభి వృద్ధి కుంటు పడుతుందంటున్నారు. పంచాయతీ కార్యదర్శికి ఒకటి కంటే ఎక్కువ గ్రామాల బాధ్యతలు అప్పగించడం వల్ల గ్రామపంచాయతీ పనులపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే పరిస్థితి లేదని కార్యదర్శులు కూడా వారి అభిప్రాయం వెల్లబుచ్చే పరిస్థితి నెలకొంది. ఫలితంగా



గ్రామస్థులకు అవసరమైన సేవలు ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు. మరోవైపు వర్షాకాలం ప్రారంభమయ్యే వేళ పారిశుద్ధ్య పనులు వేగవంతం కావాల్సి ఉండగా, అనేక గ్రామాల్లో చెత్త పేరుకుపోవడం, కాలువలు శుభ్రం కాకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వ్యాప్తి పెరిగి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్థులు భయపడుతున్నారు. పరిస్థితి విషమించిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలపై పర్యవేక్షణ తగ్గిందా? గ్రామపంచాయతీలకు అవసరమైన సిబ్బంది ఎందుకు అందుబాటులో లేరు? పారిశుద్ధ్య నిర్వహణకు నిధులు, యంత్రాంగం ఉన్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదు? పంచాయతీ కార్యదర్శులపై అదనపు బాధ్యతలు మోపితే గ్రామ పాలనను ఎవరు చూసుకుంటారు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

వర్షాకాలానికి ముందే ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం, పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రజలకు మౌలిక సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేకపోతే గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**పంచాయతీలపై ప్రత్యేక అధికారుల**



**నిర్లక్ష్యం..!**

గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు పంచాయతీల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సర్వేలు, నివేదికల తయారీకే ఎక్కువ సమయం కేటాయిస్తుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలు పేరుకుపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## కల్వర్టు లేని ఊరు..

# ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బడికి

గూడెం కొత్తవీధి జులై 3 ప్రభాతవార్త :

వానొస్తే చాలు.. ఆ పిల్లల గుండెల్లో వణుకు మొదలవుతుంది. బడికి వెళ్లాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిందే. అల్లూరి సీతారామారాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జర్రెల పంచాయితీ పరిధిలోని 'జర్రెల కొత్తూరు' గిరిజన గ్రామంలో దశాబ్దాలుగా నడుస్తున్న నరకప్రాయ ప్రయాణమిది.గ్రామ మార్గమధ్యలో వాగుపై కల్వర్టు లేకపోవడంతో, స్వల్ప వర్షానికే రాకపోకలు నిలిచిపోతున్నాయి. వానాకాలంలో పిల్లలు బురదబాటలో వెళ్తూ.. కాలుజారి వాగులో పడుతున్నారని, దీంతో భయపడి బడికే వెళ్లడం లేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. భారీ వర్షాలొస్తే నెల, రెండు నెలల పాటు చదువులకు పూర్తిగా దూరమవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. వాగు ఇరువైపులా గట్లు కొట్టుకుపోయి నడవడానికి వీల్లేకుండా పోయింది.తమ పిల్లల భవిష్యత్తు కోసం తక్షణమే కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి స్పందిస్తూ, తక్షణమే అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని కోరారు.



## పార్టీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించిన కంబాల



నక్కపల్లి ,ప్రభాతవార్త

మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నక్కపల్లి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఐడి కార్డుల పరిశీలన నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలు మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, జిల్లా నాయకులు కొప్పిశెట్టి హరిబాబు, బంగారమ్మపేట రమణ, అల్లాడ కొండబాబులు ఉన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సహకార సంఘాల వారోత్సవాలు

నక్కపల్లి, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ సహకార శాఖ ఆధ్వర్యంలో సహకారవారోత్స వాలు కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి సోసైటీ ప్రాంగణంలో అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి చేతుల మీదుగా మొక్కలు నాటి ఘనం గా వారోత్సవాలు ప్రారంభించారు. సందర్భంగా బుజ్జి మాట్లా డుతూ ఎనిమిది రోజులు పాటు ఈ వారోత్సవాలు వివిధ గ్రామాల్లో నిర్వహించనున్న రైతులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల వివరాలను బుజ్జి తెలియజేశారు. ఈ మేరకు సహకారరచ్చబండ, మెడికల్ క్యాంపు,ప్లాస్టిక్ వలన పర్యావరణ నష్టం, విద్యార్థులకు వ్యాచరచన పోటీలు, మత్స్య రచ్చబండ, పాటి రచ్చబండ,సెల్ఫ్ మెమోరియల్ ,సేంద్రియ ఎరువులు వాడకం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కోసూరి శ్రీను, మనబాల కొండబాబు, సంఘ సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది గోవింద్, ఖాన్, నాగేష్, వరలక్మి, తోలేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కూలిపోయిన బ్రిడ్జి.. గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



నక్కపల్లి, ప్రభాతవార్త

హఠాత్తుగా భారీ వాహనాలు ఆ రహదారిలో వెళ్లడం వలన ఒక్కసారిగా మండలంలోని గొడిచర్ల మీదుగా కొత్తూరు వద్ద ఉన్న బ్రిడ్జి కోడిపోవడంతో 10 గ్రామాలకు వెళ్లే రహదారి మార్గం లేకుండా పోయింది. జాతీయ రహదారి నుంచి గొడిచర్ల మీదుగా కొత్తూరు డొంకాడ జగన్నాధపురం చీడిక గ్రామాలకు ఈ బ్రిడ్జి మీద మంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. అటువంటిది శుక్రవారం మధ్యాహ్నం ఒకసారిగా బ్రిడ్జ్ రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జ్ కూలిపోయే సమయంలో ఆ రహదారి మీదుగా ప్రజలు గాని వాహనదారులు గాని రాకపోకలు కొనసాగించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పటిష్టమైన బ్రిడ్జి ఒక్కసారిగా పూలు పోవడానికి గల కారణం ఈ రహదారి మీదుగా భారీ వాహనాలు వెళ్లడం వలనేనని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కూలిపోయిన ఈ బ్రిడ్జి కారణంగా నిలిచిపోయిన గ్రామాల రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## జనసేన నిర్మాణ సాధన సమాచార సేకరణ పత్రాలు అందజేత

నక్కపల్లి, ప్రభాతవార్త



జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇంచార్జ్ పెండెం దొరబాబుకి రాష్ట్ర పార్టీ కార్యదర్శి బోడపాటి శివదత్తు నాయ కత్వంలో జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ పత్రాన్ని మండలంలోని ఉప మాక పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు పాము గణేష్ శుక్రవారం అందజేశారు.



## విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తి మృతి

నక్కపల్లి, ప్రభాతవార్త

ఒక వివాహం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఒక వ్యక్తి కాళ్లకు విద్యుత్ వైర్లు తగిలిన ప్రమాదంలో మృతి చెందిన సంఘటన.! మండలం లోని వేదుళ్లపాలెం గ్రామానికి చెందిన కల్లూరి అప్పలరాజు(52) స్థానిక హెటెరో ల్యాబ్స్‌లో కూలి పని కోసం ప్రతిరోజు వెళుతుంటారు. కల్లూరి అప్పలరాజు తన ఇంటి వద్ద జరిగిన తన సోదరుని కుమారుని వివాహ కార్యక్రమంలో లైటింగ్ ఏర్పాట్ల కోసం విద్యుత్ వైర్ లాగుతున్న సమయంలో కొద్దిగా వర్షం పడడంతో అది గమనించని ఆయన ఆ సమయంలో కుడి కాలు విద్యుత్ వైర్‌పై వేయడం వల్ల విద్యుత్ ఆ షాక్‌కు గురై అక్కడి కక్కడే పడిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన నక్కపల్లి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ జూరెడ్డి మురళి అద్వర్యంలో ఎస్సై సన్నీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షంలో తడుస్తున్న విద్యార్థులకు కలెక్టర్ 'అండ'..

### తన కారులోనే ఎక్కించుకుని సురక్షితంగా చేర్చిన అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్

బుచ్చయ్యపేట, జూలై 3 (ప్రభాతవార్త



విధి నిర్వహణలోనే కాకుండా మానవత్వంలోనూ ఆదర్శంగా నిలిచారు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్. శుక్రవారం మాడుగులలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (గ్రా+=ా) కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో బంగారుమెట్ట జంక్షన్ సమీపంలో వర్షంలో బస్సు కోసం వేచి ఉన్న పలువురు విద్యార్థులను గమనించిన కలెక్టర్ వెంటనే తన వాహనాన్ని ఆపించారు. విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం, వారు వర్షం లో ఇబ్బంది పడకుండా తన అధికారిక వాహనంలో ఎక్కించుకుని బంగారు మెట్ట జంక్షన్ నుంచి చిన్నప్పనపాలెం వరకు సురక్షితంగా దింపించారు. కలెక్టర్ చూపిన ఈ మానవత్వం, బాధ్యతాయుతమైన స్పందన స్థానికులను ఆకట్టుకుంది.ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా అవసరమైన సమయంలో మానవత్వంతో స్పందించిన కలెక్టర్ విజయ కృష్ణన్‌ను స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు అభినందించారు. ఈ ఘటన అధికారుల్లోనూ ప్రజాసేవ పట్ల అంకిత భావానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఈనెల 6, 7 తేదీలలో దస్తావేజు లేఖరుల పెన్ డౌన్



(నక్కపల్లి ,ప్రభాతవార్త)

ప్రభుత్వ రిజిస్టర్ కార్యాలయాలను ప్రైవేటుపరం చేసే కార్యక్రమాన్ని నిరసిస్తూ రాష్ట్ర సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 6,7 తేదీలలో సబ్- రిజిస్టర్ కార్యాల యాల పరిధిలో ఉంటున్న దస్తావేజు లేఖరులు పెన్డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు దాతారం మురళీకృష్ణ స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రైవేట్ పరం చేసే దిశగా ప్రభుత్వం వారు జారీ చేసిన జీవో నెంబర్ 396, వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రైవేటుపరం చేయడం వల్ల దస్తావేజు లేఖర్ల వృత్తి భద్రతతో పాటు, ప్రజల నమ్మకాన్ని కూడా కోల్పోవాల్సి వస్తుందని, తక్షణం జీవో నెంబర్ 396 ను నిలుపుదల చేసి యధావిధిగా రిజిస్ట్రేషన్ జరిగేటట్లు చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సోమ, మంగళవారాల్లో పెన్డౌన్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.క్రయ, విక్రయదారులు వివిధ పనుల మీద వచ్చే వినియోగదారులు సహకరించాలని వారు కోరారు. గౌరవ అధ్యక్షులు కొంగర జన కృష్ణమూర్తి చేతుల మీదుగా గోడ పత్రికలను విడుదల చేశారు. డాక్యుమెంట్ రైటర్లు నవర రమణాచార్యులు, డిఎంపీ ఎస్ కుమార్ ఉన్నారు.

## అమరావతి ద్రోహి జగన్ రెడ్డి 2029లో కూడా భంగపాటు తప్పదు



### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి జూలై 3,ప్రభాతవార్త

2024 లో అమరావతికి మద్దతుగా ప్రజలిచ్చిన తీర్పుని జగన్ రెడ్డి అపహాస్యం చేస్తూ, అమరావతి విషయంలో వారానికి ఒకరోజు గంటలు తరబడి ప్రెస్ మీట్ లు పెట్టి అమరావతికి వ్యతిరేకం కాదు అక్కడ అవినీతికి వ్యతిరేకమని ఒకరోజు, మరో వారంలో మూడు రాజధానిలకి కట్టుబడి ఉన్నామని మా పార్టీ విధానమని మరో నాయకుడు బొత్సతో మాట్లాడేస్తా రని, ఇప్పుడు అమరావతి, మావిగన్ అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అమరావతి ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. 2019కి ముందు అమరావతే రాజధాని, 50,000 ఎకరాలకు తక్కువ లేకుండా ఉండాలని శాసనసభలో మద్దతు తెలిపి, ప్రజలను నమ్మించి ఎన్నికల్లో లబ్ది పొందిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి ఐదు సంవత్సరాలు కాలయాపన చేసినందుకు 2024 ఎన్నికలలో జగన్ రెడ్డి పార్టీకి 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా చేసినప్పటికీ ఇంకా జగన్ రెడ్డికి బుద్ధి రాలేదని, నిత్యం వంకర బుద్ధితో మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతూ క్రిమినల్స్ ని ప్రోత్సహిస్తూ, వారిని పరామర్శిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ, మావిగన్ అంటూ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అమరావతి నిర్మాణంలో అవినీతి జరుగుతుందంటూ, ప్రపంచ బ్యాంకులకు పెట్టుబడిదారులకు మెయిల్స్ పంపిస్తూ బెదిరిస్తూ అమరావతిలో పరిశ్రమలు రాకుండా, పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టకుండా వెనక్కి పోయే విధంగా రాష్ట్రాన్ని అల్లకల్లాలం చేయడానికి, శాంతిభద్రతలు లేవని, రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేదని కూటమి ప్రభుత్వం అరాచకం చేస్తుందని జగన్ రెడ్డి మాటలు చూస్తుంటే దెయ్యాలు వేదాల వల్లించిన చందంగా ఉందని, ఐదు సంవత్సరాలు ప్రజలకు నరకం చూపించి విధ్వాంసక పాలనతో తుగ్లక్ నిర్ణయాలు తీసుకొని, ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడకుండా వారిపై అక్రమ కేసులు బనాయించి వారు దాచుకున్న డబ్బును దారి మళ్లించి దోచుకున్న విషయం ప్రజలు మర్చిపోలేదని నాగ జగదీష్ అన్నారు.

## పోలవరం పనులు వేగవంతం చేయండి : కొప్పిశెట్టి



నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలో చేస్తున్న పోలవరం పనులను వేగవంతంగా ఈ ప్రాంతంలో చేపట్టాలని రమణయ్యపేట వద్ద గురువారం సాయం త్రం పరిశీలించడానికి వచ్చిన అధికారులను కలసిన పాయక రావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. ఇక్కడ పనుల పరిశీలనకు వచ్చిన ఈఈ ఆర్ లక్ష్మణ్ రావుతో మాట్లాడుతూ హోం మంత్రి అనిత నియోజకవర్గంలో పనులు త్వరగా జరిగేలా చూడాలని వారిని కోరారు. ప్రస్తుతం పనులు చివరికి వచ్చాయని ఈఈ వెంకటేష్‌కు తెలిపారు. ఆయనతోపాటు పార్టీ తెలుగు యువత మండల శాఖ అధ్యక్షుడు కమ్మెల శివరామకృష్ణంరాజు, రెడ్డి వరహాలు బాబు, వెదుళ్ళ శ్రీను ఉన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

### రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు

ఎలమంచిలి, జూలై 3, ప్రభాతవార్త:



పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ సీని యర్ నాయకులు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు నియోజక వర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆదేశాలతో, ప్రజా దర్బార్ నిర్వహించిన ధూళి రంగనాయకులు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజాదర్బార్ ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాంఅన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతోంది. అందిన ప్రతి వినతిని నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపిస్తూ, సమస్యల పరిష్కారం అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాంఅని, ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తోంది. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి టౌన్ టిడిపి అధ్యక్షులు గొర్లే నానాజీ, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్ , టిడిపి టౌన్ సెక్రటరీ ఆడారి ఆదిమూర్తి నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ కట్టమూరు చిట్టి శ్వరరావు టౌన్ ఉపాధ్యక్షులు దంట్ల వెంకటస్వామి, యూనిట్ ఇంచార్జ్ కాండ్రకోట గణేష్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి :ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ



అనకాపల్లి, జులై 3 (ప్రభాతవార్త)

మెకానిక్ డే సందర్భంగా రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో అనకా పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి పట్టణ పరిధిలో హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం. వెంకట, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, మెకానిక్ సంఘ సభ్యులు, ద్విచక్ర వాహనదారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారు హెల్మెట్ ధరించండి - ప్రాణాలను కాపాడుకోండి, రోడ్డు భద్రత అందరి బాధ్యత, ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం - ప్రమాదాలను నివారిద్దాం వంటి సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ ఎం.వెంకటనారాయణ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం ప్రతి ద్విచక్ర వాహనదారుడి బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే అత్యంత ముఖ్యమైన రక్షణ సాధనమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వారు, వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడమే అనకాపల్లి ట్రాఫిక్ పోలీసుల లక్ష్యమని, అందులో భాగంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ సంఘ సభ్యులు, అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## బొజ్జ ఐశ్వర్యపై చర్య తీసుకోండి.. పాయకరావుపేట పిఎస్‌లో ఫిర్యాదు

నక్కపల్లి, ప్రభాతవార్త



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సభ్యత్వాల పేరు చెప్పి రాష్ట్ర ప్రజల నుంచి 80 కోట్ల రూపాయలు కాజేశారని చెప్పి సోషల్ మీడియా సాక్షిగా ఆయనను దొంగగా చిత్రీకరించి తప్పుడు ఆరోప ణలు చేసిన బొజ్జా ఐశ్వర్యపై తక్షణమే చర్య తీసు కోవాల ని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ నాయ కత్వంలో పాయకరావుపేట పోలీస్ స్టేషన్లో గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. తక్షణమే కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, మాజీ గ్రంథా లయ ఛైర్మన్ పాయకరావుపేట జనసేన సీనియర్ నాయకులు తోట నగేష్‌లు మాట్లాడుతూ ఈ విధంగా తప్పుడు ప్రచారాలు పాల్పడితే క్షమిస్తూ ఊరుకోమని జనసైనికులు తిరగబడితే తట్టుకోలేరని హెచ్చ రించారు. ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, ఇంజరపు సూరిబాబు, మంగాదేవి, బత్తిన గోవింద రావు, బెల్లాల అచ్చారావు, వాసంశెట్టిరమణ, బత్తినశ్రీనివాస్, ఎర్రిపిల్లి కొండబాబు, వంకా శివ, దమ్ము అప్పలరాజు, కోటా వెంకటరమణ, పాము గణేష్, పిక్కి స్వామి, యలమంచిలి చంద్రరావు, బొందు మహేష్, పంపన బోయిన తులసిరావు, బంగారి రాజు, అర్జీల శ్రీను, పిక్కి గోవింద్, కోలా సంజీవ్, యజర్ల ధనరాజు, కందాల శ్రీను, దయపిల్లి బాలరామ్, వంకా రాజు, సురాడ నల్లబాబు, దమ్ము లోవరాజు, ఏనుగుపల్లి జ్యోతి బాబు, ఏనుగుపల్లి రాజేష్, అడపా రాజు, చిల్లి సునీల్, గంపల గోవింద్, గంపల గంగారాజు, గంపల గంగా భవానీ, రాయి ప్రకాష్, సారేపల్లి సంతోష్, ఏడిద విజయ్, నీలిమోహన్, పోలవరపు శ్రీను, గుత్తుల తేజ ఉన్నారు.

## గీతంలో కరణం మల్లీశ్వరి క్రీడా ప్రాంగణం



విశాఖపట్నం-ప్రభాతవార్త

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక గ్రహీత కరణం మల్లీశ్వరి పేరుతో ఏర్పాటైన క్రీడా ప్రాంగణాన్ని విశాఖ పార్లమెంట్ సభ్యుడు, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన టేబుల్ టెన్నిస్ క్రీడా సధుపాయంతో పాటు యోగా కేంద్రం ఇతర అనుబంధ క్రీడా సౌకర్యాలను ఈ క్రీడా ప్రాంగణంలో విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ యువత శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉన్నప్పుడే వత్తి డులను తట్టుకుని విజయం పైపు ఎదుగుతారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి తెలుగు ప్రజలు గర్వించే స్థాయికి ఎదిగిన కరణం మల్లీశ్వరి నేటి యువతకు స్పూర్తి కావాలన్నారు. కాగా కార్యక్రమంలో ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం కేంపస్ లైఫ్ సమాయడీన్ అరుణ్‌కార్తిక్, వివిధ కళాశాలల డీన్‌లు, డైరక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 15 నుంచి వారాహి అమ్మవారి నవరాత్రులు

గాజువాక,జులై 3,ప్రభాతవార్త



వడ్లపూడి మీసేవ కేంద్రం సమీపంలో గల సామాజిక భవనంలో ఈ నెల 15వ తేదీ నుంచి 24 వరకు వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీ వెంకటేశ్వర వైదిక సంస్థాపనమ్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు వెంకట హరీష్ శర్మ పర్యవేక్షణలో రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొండా జగన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం తలపెట్టిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రక్తదాన శిబిరం - సామాజిక సేవలో మరో ముందడుగు వేసిన రోటరీ క్లబ్ ఆఫ్ విజాగ్ డైమండ్స్

విశాఖపట్నం - ప్రభాతవార్త





రోటరీ క్లబ్ ఆఫ్ విజాగ్ డైమండ్స్ అధ్యక్షుడు రొటేరియన్ కె.మారుతి నాయకత్వంలో క్లబ్ ఆధ్వర్యంలో లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్లో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రొటేరియన్ కె.మారుతి, నూతన సభ్యుడు రొటేరియన్ మురళీకృష్ణ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా సమన్వయం చేసిన సీపీ రొటేరియన్ రాంబాబుకి క్లబ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అదే రోజు మరో సేవా కార్యక్రమంగా, రొటేరియన్ ఆచంటి శ్రీధర్ సహకారంతో కేజీహెచ్‌లోని ఇస్కాన్ ఛారిటీకి 15 సీలింగ్ ఫ్యాన్లను రోటరీ క్లబ్ ఆఫ్ విజాగ్ డైమండ్స్ అందజేసింది. ఈ ఫ్యాన్లు అక్కడ బస చేసే రోగుల సహాయకులు, బంధువులకు ఎంతో ఉపయుక్తంగా ఉండనున్నాయి. ఈ సేవా కార్యక్రమాలను క్రింది నాయకత్వ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. రొటేరియన్ కె.మారుతి- అధ్యక్షుడు, రొటేరియన్ ఎం.శివకుమార్- కార్యదర్శి, రొటేరియన్ ఎస్.కామేశ్వరరావు - తక్షణ మాజీ అధ్యక్షుడు రొటేరియన్ నీరజ- అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ కె. శ్రీదేవి - ఫస్ట్ లేడీ, రోటరీ క్లబ్ ఆఫ్ విజాగ్ డైమండ్స్ ఈ సందర్భంగా అధ్యక్షుడు రొటేరియన్ కె. మారుతి మాట్లాడుతూ, "సేవే పరమో ధర్మః" అనే రోటరీ సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిస్తూ, ఈ రోటరీ సంవత్సరమంతా ప్రజలకు ఉపయోగపడే మరెన్నో సేవా కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు.

## 4, 5 తేదీల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ

గాజువాక,జులై 3,ప్రభాతవార్త

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు ఈ నెల 4, 5 తేదీల్లో గాజువాక పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసిన ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను ప్రజలు పూర్తిగా నింపి, సంతకం చేసి సంబంధిత బీఎల్‌ఓలకు లేదా సమీప సచివాలయంలో శని, ఆదివారాల్లో తప్పనిసరిగా అందజేయాలని కోరారు. ఫారాలు సమర్పించకపోతే ఓటర్ల జాబితాలో పేరు నమోదు ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా ఓటరు జాబితాలోని వివరాలకు సంబంధించిన సందేహాలు, అభ్యంతరాలు ఏవైనా ఉంటే సచివాలయాల్లో అందుబాటులో ఉండే అధికారులు వాటిని నివృత్తి చేస్తారని తెలిపారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్ సి శేషాద్రి కోరారు.

## ఫ్రైడే -డ్రైడే గా ప్రతి ఒక్కరూ పాటించండి : డిఎంహెచ్‌ఓ డా.పి.జగదీశ్వరరావు

విశాఖపట్నం,జులై 3 ప్రభాతవార్త



ప్రజలందరూ విధిగా ప్రతి శుక్రవారం ను డ్రై డే గా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డాక్టర్ పీ. జగదీశ్వర్రావు పిలుపునిచ్చారు.నగరంలోని కొబ్బరితోట పట్టణ ఆరోగ్యకేంద్రము భూపేష్ నగర్ సచివాలయం పరిదిలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా పలు ప్రాంతాలను సందర్శించి డెంగ్యూ హాట్ స్పాట్ లను పరిశీలించి అక్కడ ప్రజలకు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలని, ఇళ్ళల్లో ఉండేటటువంటి ఫ్రిడ్జ్ లలో, ఇంటి పరిసర ప్రాంతాలలో ఉండే నీటి నిల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అయన గృహిణి లకు అవగాహన కల్పించారు.దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలందరూ ఫ్రైడే-డ్రైడే గా పాటించాలని తెలియచేసారు. తదుపరి ఇ.హెచ్.ఆర్., అభ ఐడి రిజిస్ట్రేషన్, ఐ.వి.ఆర్.ఎస్. ద్వారా హాస్పిటల్ సేవలు అందుతున్నవి లేనివి తెలుసుకొనుట పబ్లిక్ పెర్సప్షన్, కె.పి.ఐ. ఇండికేటర్స్, ఆర్.బి.ఎస్.కె సేవలు, ఓపి, ఐపి సేవలు, ల్యాబ్ టెస్ట్ లు, మందులు లభ్యత, ఎఫ్.ఆర్.ఎస్. హాజరు మొదలగు విషయాల గురించి సమీక్ష నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర పరిసర ప్రాంతములు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భనలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ .హాలీమా పర్వీన్, జిల్లా మలేరియా అధికారి వరప్రసాద రెడ్డి, జివిఎంసి బయాలజిస్ట్ పి.సాంబమూర్తి, అసిస్టెంట్ మలేరియా అధికారి బి.నాగభూషణం , మలేరియా సిబ్బంది, జివిఎంసి సిబ్బంది ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## 900, 999 నెంబర్ బస్సులు పునరుద్ధరించాలి: పీజీఆర్ఎస్ లో అధికారులను ఆదేశించిన గంటా

### 4 వార్డులో రూ.10 కోట్ల పనులకు ప్రతిపాదనలు

విశాఖపట్నం, ప్రభాతవార్త



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాల యంలో శు క్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలోని వివిధ వార్డులతో పాటు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి పలువురు సమస్యలపై అర్జీలు సమర్పిం చారు. భీమిలి పాలిటెక్నిక్ కాలేజీకి తిరిగే 900 నెంబర్ బస్సులను నిలిపివేయడం వల్ల రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు చెప్పారు. ఈ కాలేజీ విద్యార్థినుల్లో ఎక్కువ మంది దిగువ మధ్యతరగతి వారేనని ప్రత్యామ్నాయ రవాణా మార్గాల ద్వారా రావడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని లెక్చరర్ రూప చెప్పారు. దీనిపై ఆర్టీసీ ఆర్.ఎం. అప్పలనాయుడుతో మాట్లాడి 900, 999 నెంబర్ బస్సులు పునరుద్ధరించాలని ఆదేశించారు. అలాగే 4 వార్డు ఐ.ఎన్.ఎస్. కళింగ, నిడిగట్టు తదితర ప్రాంతాల మీదుగా బస్సు నడపాలని స్థానికుల విజ్ఞప్తి పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వార్డులో మొదటిదశలో రూ.10 కోట్ల పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం సీఎల్డీపీ కింద భూములు అప్పగించిన 520 మందికి గతంలో హామీ ఇచ్చిన విధంగా 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలివ్వాలని కోరారు. 1 వ వార్డులో రేషన్ డిపో మంజూరు చేయాలని, రోడ్డు నిర్మించాలని ఆ వార్డు నివాసితులు విన్నవించారు. సాయిబాబా ఆలయం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ 6 వార్డుకు చెందిన మాజీ ఏయూ ఉద్యోగి ప్రసాదరావు వినతి పత్రం సమర్పించారు. భీమిలి మండలంలో దాకమర్రి, మజ్జివలస, మజ్జిపేట, సింగనబందల్లో రీ సర్వే సరిగా చేయలేదని, మళ్లీ జరిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు కోరారు. ముకుందపురంలో సాగులో ఉన్న భూములను ఆక్రమించుకుని పెద్దఎత్తున నియమించుకున్న ప్రైవేట్ సెక్యూరిటీతో దౌర్జన్యం చేయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని రెవిన్యూ సిబ్బంది నిగ్గు తేల్చాలని ఆదేశించారు. నేరళ్లవలసలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, నిర్మాణం మొదలు పెడితే రెవెన్యూ అధికారులు నిలిపివేస్తున్నారని మహిళలు కొందరు ఎమ్మెల్యేకు చెప్పారు. 5, 6, 8 వార్డుల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు గంటా దృష్టి తీసుకురాగా తాత్కాలికంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, రూ.750 కోట్ల తాగునీటి ప్రాజెక్టు పూర్తయితే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వెల్లడించారు. ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎన్ని పరిష్కారమయ్యాయి, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయనేది సీవీఏపీ సిబ్బందితో సమీక్షించారు.

## కీ.శే.డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి ఆశయసాధనకు కృషి



విశాఖపట్నం, ప్రభాతవార్త

రాజకీయ, సాంస్కృతిక, సామాజిక సేవారంగాల్లో చెరగని ముద్రవేసుకున్న కీ.శే.డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి ఆశయసాధనకు మనమడుగా తనవంతు బాధ్యతను నెరవేరుస్తానని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో కీ.శే.డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి 88వ జయంతి వేడుకలను శుక్రవారం విశాఖలోని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో పలువురు కళాకారులు ఆపాత మధుర గీతాలను ఆలపించారు. అనంతరం జరిగిన సభాకార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖపట్నంతో తాత ఎం.వి.వి.ఎస్ మూర్తిగారికున్న అనుబంధం విడదీయలేనిదన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఆప్తుడుగా ఆయన పొందిన కీర్తిని చూస్తోంటే తనకెంతో గర్వకారణంగా వుందన్నారు. ఆయనతో సన్నిహితంగా మెలిగిన వారు, శ్రేయోభిలాషులు తాత గురించి వారికుండే అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ వుంటే అయన మన మధ్యలోనే వున్నారనే భావన తనకు కలుగుతోందన్నారు. ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తగా, రాజకీయవేత్తగా, మానవతామూర్తిగా కీ.శే.డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తిగారు విశాఖప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతారన్నారు. సాంస్కృతిక సేవారంగాల్లో కూడా ఆయన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, ఆత్రేయ స్మారక కళాపీఠం నిర్వహకులు గంటి మురళి, సంఘసేవకులు చెరువురామకోటయ్య డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి సమకాలీనులు, అభిమానులు , కళాభిమానులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, DUNDU MURALI MOHAN S/O DUNDU SUBRAMANI previously called DUNDU MURALI MOHAN SUBRAMANI R/O 2-25/1, VIJINI-GIRI PALEM, SIMHACHALAM, VISAKHAPATNAM, now changed my name from DUNDU MURALI MOHAN SUBRAMANI to DUNDU MURALI MOHAN. Henceforth I will be called as DUNDU MURALI MOHAN for all purposes.
(Ro.No.13248)

★ I, MEDISETTI SRINU S/O MEDISETTI RAMU previously called MEDISETTI RAMUDU R/O 3-345/20, MUTYAMAMBA COLONY, VEPAGUNTA, VISAKHA-PATNAM, now changed my name from MEDISETTI RAMUDU to MEDISETTI SRINU. Henceforth I will be called as MEDISETTI SRINU for all purposes.
(Ro.No.13261)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## ట్రైకర్ రుణాలను పారదర్శకంగా ఎంపిక చేయాలి..

డుంబ్రిగూడ,, జూలై 03 ప్రభాతవార్త



గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పేదలకు మంజూరు చేస్తున్న ట్రైకర్ సబ్సిడీ రుణాలు లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన పేదలకు ఎంపిక చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయి లో వివో ఏ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు సంయుక్తం గా కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయవలసి ఉండగా వివో ఏలు, సంఘ సభ్యులు గ్రామ పెద్దల ప్రమేయం లేకుండా రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని లబ్ధిదారుని ఎంపిక చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు పునరాలోచించి క్షేత్రస్థాయిలో అట్టడుగునటువంటి అసలైన నిరుపేదలను గుర్తించి ట్రైకర్ సబ్సిడీ రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 8 మంది ఫార్మసిస్ట్ గ్రేడ్-2లకు నియామక ఉత్తర్వులు జారీ

పాడేరు,జూలై3, ప్రభాతవార్త



డీఎంఈ ఆధ్వర్యంలోని పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాల లో కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వర్లు ఫార్మసిస్ట్ గ్రేడ్–2 కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయాల్సిన 9 పోస్టుల్లో 8 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు శుక్రవారం అందజేశారు. పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఫార్మసిస్ట్‌ల కొరత కారణంగా ఔషధాల పంపిణీ, రోగులకు సేవలం దించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ నియామకాలు అత్యంత అవసరంగా మారాయి. ఈ నియామక ప్రక్రియ గత 18 నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో అభ్యర్థులు అనేక ప్రభుత్వ కార్యాలయాలను సంప్రదించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. చివరగా వారు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజీ), విశాఖపట్నం నాయకులను ఆశ్రయించారు. ఈ సమస్యపై ఏపీ జిఈఏ జిల్లా అధ్యక్షులు డి.రాజశేఖర్ రెడ్డి, సిటీ అధ్యక్షులు జైతు రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి, ఎం.శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని, అప్పటి విశాఖపట్నం జిల్లా కలెక్టర్, రీజినల్ డైరెక్టర్ (అర్డి), డిప్యూటీ డైరెక్టర్ (డిడి) సిహెచ్. శ్రీనివాస్ కుమార్, అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ అధికారులతో సమన్వయం చేసి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. వారి సమిష్టి కృషి ఫలితంగా భర్తీ చేయాల్సిన 9 పోస్టుల్లో 8 మంది అభ్యర్థులకు నేడు నియామక ఉత్తర్వులు అందజేయడం జరిగింది. నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు తమకు నియామక ఉత్తర్వులు అందజేసిన పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కి, సమస్య పరిష్కారానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, అలాగే ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.రాజశేఖర్ రెడ్డి, సిటీ అధ్యక్షులు జైతు రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఓలు) 'సర్ పనులు మినహా ఇతర విధులు కేటాయించరాదు- సీఎస్ కఠిన ఆదేశాలు

**జిల్లా కలెక్టర్, జిల్లాఎన్నికల అధికారి టి.నిశాంతి -స్పష్టమైన ఆదేశాలు జారీ**

పాడేరు,జులై3,ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సెస్) కఠిన ఆదేశాల మేరకు, జిల్లాలోని బూత్ లెవల్ అధికారులకు (బి ఎల్ ఓ) ఎట్టి పరిస్థితుల్లోనూ స్పెషల్ సమ్మరీ రివిజన్ (సర్ ఓటరు జాబితా సవరణ) పనులు మినహా మరే ఇతర విధులు కేటాయిం చరాదని జిల్లా అధికారులందరికీ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి టి.నిశాంతి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడమైనది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనలకు అనుగుణంగా కేవలం సర్ పనులు మాత్రమే బిఎల్ఓలు పూర్తిస్థాయిలో ఓటరు జాబితా సవరణ, నమోదు తదితర సర్ సంబంధిత పనులకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సర్ విధులు నిర్వహించే వారికి ఎలాంటి మినహాయింపు లేదని, ఈ ఆదేశాల అమలులో ఎటువంటి ఉల్లంఘనలు లేదా విచలనాలు ఖచ్చితంగా అనుమతించబడవు. జిల్లా అధికారుల బాధ్యతలు జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు తమ పరిధిలోని బిఎల్ఓలకు వేరే ఏ ఇతర అదనపు పనులు లేదా డ్యూటీలు అప్పగించకుండా చూసుకోవాల్సిన పూర్తి బాధ్యత వారిదేనని ఈ ఆదేశాలను ఎవరైనా అతిక్రమించి బిఎల్ఓలకు ఇతర పనులు కేటాయించినట్లయితే, సంబంధిత అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడమైనది. ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం అయినందున, ఈ మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ అండ్ జిల్లా ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## గిరిజన విద్యార్థినికి జిల్లా కలెక్టర్ ఆర్థిక భరోసా నెల్లూరు

**ఈఎంపీఎస్‌లో సీటు సాధించిన స్వప్నకు అండ : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి**

పాడేరు,జులై 3, ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ టి.నిశాంతి మానవత్వాన్ని చాటుకున్నారు. ఉన్నత చదువులకై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పీవీటిజి కోదు కులానికి చెందిన అల్లూరి జిల్లా, దుంబ్రిగుడ మండలం, తూటంగి పంచాయతీ, బుల్లగెడ్డ గ్రామానికి చెందిన కొర్ర కేశవరావు కుమార్తె కొర్ర సోప్నా గిరిజన విద్యార్థినికి నేనున్నానంటూ జిల్లా కలెక్టర్ నిశాంతి ఆర్థిక భరోసా ఇచ్చి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. దుంబ్రిగుడ మండలం, తూటంగి పంచాయతీ, బల్లగెడ్డ గ్రామానికి చెందిన కుర్ర స్వప్న అనే విద్యార్థినికి నెల్లూరులోని ప్రతిష్ఠాత్మక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)లో సీటు సాధించింది. అయితే, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రవేశపు ఫీజు, అధ్యయన ఖర్చులు నిమిత్తం ఇబ్బంది పడుతున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్వప్న లాంటి ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. జిల్లా కలెక్టర్ నిశాంతి చూపిన ఉదారతపై విద్యార్థిని స్వప్న, ఆమె తల్లిదండ్రులు మరియు బల్లగడ్డ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు

పాడేరు, జూలై3,ప్రభాతవార్త



గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగు బంగారం పాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి సన్నిధి లో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమా రాధన కార్యక్రమం శుక్రవారం నిర్విఘ్నంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సమిష్టి కృషితో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నించే సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్,గ్రామ పెద్దలు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

దుంబ్రిగూడ, జూలై3 ప్రభాతవార్త



సైబర్ నేరాలపై, గంజాయి వంటి మత్తు పదార్థాలపై విద్యార్థులు, యువత, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాల సెల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో శుక్రవారం నిర్వహించడం జరిగిందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఓటీపీ ఫార్వర్డ్ లాంటి కాన్ఫిడెన్షియల్ వివరాలను ఎవరికి తెలియపరచకూడదన్నారు. గిరి యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. బాగా చదువు కొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన కోరారు. ఎన్డీపీఎస్ఎల్ సెల్ ఏఐ అంజనేయులు, ఎస్సై సురేష్ కుమార్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి ..

**పిజిఆర్ఎస్‌కు 117 అర్జీలు : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి**

పాడేరు,జూలై 3, ప్రభాతవార్త:



సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు 62, రెవెన్యూ క్లినిక్‌కు 55 మొత్తం 117 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ నిశాంతి.టి, పాడేరు ఐటిడిఏ పిఓ ఆదిత్య వర్మ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు, పాడేరు ఆర్డీఓ ఎం.భుజంగరావు, జిల్లా అధికారులతో కలిసి సంయుక్తంగా వివిధ మండలాలలోని, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన అత్యవసర ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులలో అత్యధికంగా రెవెన్యూకి 55, పిఆర్ ఇంజనీరింగ్ 12 , గృహ నిర్మాణ శాఖకు 10, సర్వ శిక్ష అభియాన్‌కు 08, విద్యాశాఖ, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ సంబంధించిన త్రాగునీరు, విద్యుత్ , పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, ఎస్ఎంఎ, ఆర్ఓ.ఎఫ్.ఆర్, పెన్షన్, రోడ్ల భవనాలు, వైద్య శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయి. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పికిక పరిమళ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బివిఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి.మురళి, ద్వామా పిడి విద్యాసాగర్ రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ డబ్ల్యుఎస్ ఈఈ నాగేశ్వరరావు, ఇంచార్జ్ జిల్లా అటవీ శాఖ అధికారి ఉమా మహేశ్వరి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్ వి రమణారావు, జిల్లా ఖజానా లెక్కల శాఖ అధికారి అనిల్ కుమార్, ఏపిఐపిఐఎల్ ఎస్ఈ విజయానంద్, జిల్లా మలేరియా నివారణ అధికారిణి తులసి, పాడేరు ఐటిడిఏ ఏవో హేమలత, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రాజముద్రతో రైతుల భూములకు భద్రత



పాడేరు,జూలై3,ప్రభాతవార్త:

రాజముద్రతో కూడిన వాస పుస్తకాల వల్ల రైతులకు భద్రత ఏర్పడిందని జి.సి సి డైరెక్టర్,టిడిపి సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు పాడేరు పిఎసిఎస్ చైర్మన్ దప్పోడి వెంకట రమణ, పేర్కొన్నారు. పాడేరు మండలం గొండెలి పంచాయితీ పిల్లిపుట్టు లో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకం రైతులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేసి వారు మాట్లాడారు. రైతులకు మేలు జరిగే విధంగా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఎలక్షన్లో రైతుల భూములకు రైతులకు ఉండేలా వారి పాస్ పుస్తకాల్లో వారి ఫోటోలు ముద్రించి రాజముద్రతో ఇస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఈరోజు ఇస్తున్నారన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసర్వే డిప్యూటీ తహసీదార్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో ఓటర్ల సర్వే పరిశీలన: దారకొండ, అంతర్ల గ్రామాల్లో జేసీ పర్యటన

గూడెం కొత్తవీధి, జూలై 3 ప్రభాతవార్త



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహి స్తున్న ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమం అత్యంత వేగంగా, పారదర్శకంగా జరుగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ తెలిపారు. శుక్రవారం ఆమె జీకే వీధి మండలం దారకొండ గ్రామం, అలాగే చింతపల్లి మండలం అంతర్ల గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి, జరుగుతున్న సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా సిబ్బంది పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఈ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు మరియు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకలో చోరీ.. రూ.5.లక్షల నగదు, బంగారం రికవరీ

నర్సీపట్నం-ప్రభాతవార్త



పెళ్లి వేడుకలో జరిగిన రూ.5 లక్షల విలువైన స్నాచింగ్ కేసును నాతవరం పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి, అపహరించిన నగదు, బంగారం, ఇతర వస్తువులను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. బాధితులు వెంటనే 112కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వేగంగా స్పందించి కేసును పరిష్కరించారు. నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు శుక్రవారం నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు కు సంబంధించిన వివరాలు తెలియజేశారు. నాతవరం మండలం శృంగపరం గ్రామానికి చెందిన పైలా నాయుడు కుమారుడి వివాహం గురువారం రాత్రి జరిగింది. వధువు తరపు బంధువైన సుర్ల రమణమ్మ వివాహ ఖర్చుల కోసం సిద్ధం చేసిన రూ.5లక్షల నగదు, పావు తులం బంగారు కాసు, సెల్ఫోన్, చీరను ఒక బ్యాగులో ఉంచారు. ఆ బ్యాగును ఆమె సోదరి సూర్ల రజిని వద్ద ఉంచగా, తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన పైలా చిట్టిబాబు(32) ఆమెను తోసివేసి బ్యాగును లాక్కొని పరారయ్యాడు. దొంగ చిట్టిబాబు డెక్కన్ కెమికల్స్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నాడు. నెలకు 30 వేల రూపాయలు జీతం తీసుకుంటున్నాడు. విద్యావంతుడైనప్పటికీ తాగుడుకు బానిసగా మారి ఈ చోరీకి పాల్పడ్డాడు. బాధితురాలు వెంటనే 112కు ఫోన్ చేయడంతో కంట్రోల్ రూమ్ అప్రమత్తమైంది. బీట్ సిబ్బంది మహేష్, సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ వై. తారకేశ్వరరావు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. గ్రామ శివారులో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.5 లక్షల నగదు, పావు తులం బంగారు కాసు, సెల్ఫోన్, చీరను స్వాధీనం చేసుకున్నారు. బాధితులు సకాలంలో 112కు సమాచారం ఇవ్వడం వలన కేసును మూడు గంటల్లోనే ఛేదించగలిగామని తెలిపారు. ఎలాంటి నేరం జరిగినా ప్రజలు భయపడకుండా వెంటనే 112కు సమాచారం అందిస్తే పోలీసులు త్వరితగతిన స్పందించి నిందితులను పట్టుకుంటారని చెప్పారు. కేసును వేగంగా ఛేదించిన రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ వై. తారకేశ్వరరావు, బీట్ సిబ్బందిని ఆయన అభినందించారు.

## రాజముద్రతో రైతుల పాస్ పుస్తకాలు.. పంపిణీ చేసిన చింతకాయల రాజేష్

నర్సీపట్నం-ప్రభాతవార్త




కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తోందని, ఇది మాట నిలబెట్టుకునే ప్రభుత్వమని టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ స్పష్టం చేశారు. శుక్రవారం నర్సీపట్నం మండలం వేములపూడి రెవెన్యూ పరిధిలో సుమారు 2200 పాస్ పుస్తకాలను ఆయన చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి ఫోటో ముద్రించి ఇచ్చేవారని విమర్శించారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేవలం రాజముద్రతో ముద్రించడమే కాకుండా, భూమి వివరాలు పూర్తిగా పారదర్శకంగా ఉండేలా క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా రైతులు తమ భూమి వివరాలను సులభంగా, పారదర్శకంగా తెలుసుకునేలా అత్యుత్తమ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గత రెండేళ్ల కాలంలోనే నర్సీపట్నం అభివృద్ధికి మునుపెన్నడూ లేని విధంగా భారీగా నిధులు తీసుకువచ్చారని రాజేష్ కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జడ్పీటీసీ రమణమ్మ, బిలేం రాంప్రసాద్ రాంప్రసాద్, లాలం శ్రీరంగం స్వామి, ధనమిరెడ్డి మధు, తహసీల్దార్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం..

**అధికారుల్లో సమన్వయ లోపం మండలంలో కుంటుపడుతున్న అభివృద్ధి.. -అభివృద్ధి పనులు జాప్యం జరిగితే సహించేది లేదు.. మండల సర్వసభ్య సమావేశంలో ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి. సుభద్ర.. ఇంజనీరింగ్, విద్యాశాఖ, హౌసింగ్ గిరిజన సంక్షేమ శాఖ పనితీరుపై సుభద్ర ఆగ్రహం..**


ముంచంగిపుట్టు,జూలై 3, ప్రభాతవార్త




అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల ఎంపీడీవో సమావేశ మందిరం లో శుక్రవారం జరిగిన మండల స్థాయి సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. మండల స్థాయి అధికారులు సమన్వయ లోపం కారణంగా అభివృద్ధి కుంటుపడుతోందని, అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. ముంచంగిపుట్టు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన, ఎంపీడీవో ఎం ధర్మారావు ఆధ్వర్యంలో వాడి వేడిగా సాగింది. ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పాల్గొన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పనులతో పాటు నిధులు మంజూరు చేసిన పనులు సక్రమంగా పూర్తి చేయడంలో ఇంజనీరింగ్ అధికారులు, ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగలపై, విద్యాశాఖ పనితీరుపై సంబంధిత అధికారులు అవలంభిస్తున్న నిర్లక్ష్యంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటిగా మండల విద్యాశాఖ అధికారి-1, కృష్ణమూర్తి, 2 త్రినాధ్, ఏటిడబ్ల్యూఓ స్వర్ణలతలు విద్యాశాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై సభ సభ్యులకు వివరించారు. మండలంలో మారుమూల గ్రామాల్లో నేటికీ చాలావరకు పాఠశాలల్లో వసతి సదుపాయాలు లేక సరైన భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యను అభ్యసిస్తున్నారని, గిరిజన ప్రాంతంలో విద్యావ్యవస్థ ఏ మేరకు అభివృద్ధి చెందుతుందని సభ్యులు విద్యాశాఖ తీరుపై ధ్వజమెత్తారు. ఆర్‌డబ్ల్యూఎస్ఏ ఈఈ రాజేష్ త్రాగునీటి పనులపై వివరిస్తుండగా మండల కేంద్రంలోని తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామాల్లో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయని పరిష్కారం చేయడంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని తీరు మార్చుకోవాలని సభ్యులు సూచించారు. ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు శాఖల వారీగా జరుగుతున్న పనులపై స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ పనిచేయాలని ఆశ్రమాల్లో విద్యార్థుల జాయినింగ్‌లో సీట్ల కొరతపై జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని విద్యాశాఖ అధికారులు సైతం స్థానికంగా సీట్ల కొరత వలన కలిగే ఇబ్బందులను ఉన్నతాధికారులకు తెలియజేయాలని, జిల్లా పరిషత్ నిధులు రెండు కోట్ల 60 లక్షలతో గిరిజన ఆశ్రమ పాఠశాలలో కిచెన్ షెడ్లు డైనింగ్ హాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పాఠశాలల్లో బోధన స్థాయిని పెంచి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచాలని సమాజంలో జరుగుతున్న మంచి చెడులపై విద్యార్థులకు అవగాహన ఉపాధ్యాయులు కలిగించాలని ఆమె సూచించారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మహిళా ఎంపీటీసీలు, తహసిల్దార్ త్రినాధ్ నాయుడు, మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, సిహెచ్ సీ సూపరిండెంట్ ధరణి, హౌసింగ్ ఏఈ కృష్ణారావు, ఫారెస్ట్, ఆర్టీసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిర్వాసితు ఆందోళన తక్షణమే పనులు ఆపాలి

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలంలోని చందనాడ గ్రామంలో బిసి,ఎస్సి కాలనీలో జరుగుతున్న ఏపీఐఐసీ పనులను తక్షణమే నిలుపు దల చేయాలని కోరుతూ నిర్వాసితులు ఆదుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తూ జరుగుతున్న పనులను అడ్డుకున్నారు. ఈ గ్రామంలో ఉన్న గృహాలకు ప్యాకేజీ చెల్లించి ఈ కాలనీ నక్కపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు.




## గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనే ప్రభుత్వ లక్ష్యం : చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర

అరకు రూరల్, జూలై 3, ప్రభాతవార్త



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా అభివృద్ధిని సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలుగు దేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి, ఏపిఎస్ఆర్టిసి విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. అరకులోయ మండలం మాడగడ పంచాయతీ చంపగూడ గ్రామంలో 10 లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో రోడ్ల పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. దొన్ను దొర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెల్లో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో రోడ్ల లేని ప్రతి గ్రామానికి రహదారిలో నిర్మించి గ్రామాలు అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అరకులోయ మండల అధ్యక్షుడు మహదేవ్, ఏఎంసీ చైర్మన్ బోరిబోరి లక్ష్మి,మాజీ ఎంపిటిసి కుమార్, మాజీ ఎంపీటీసీ వంతల వెంకటరావు, టిడిపి నాయకులు భీమన్న, శేఖర్, మాణిక్యం గ్రామస్తులు, పాల్గొన్నారు.

## విద్యాశాఖాధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

**ఉపాధ్యాయుల గైర్హాజరుతో బూదరాళ్ల పాఠశాలకు తాళాలు**

కొయ్యూరు, జూలై 3, ప్రభాతవార్త



2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమై పాఠశాలలు రీఓపెనింగ్ అయిన నాటి నుండి నేటి వరకు తమ గ్రామ పాఠశాలలోని విద్యార్థులకు విద్యాబోధన అందటం లేదని, దీనికి గల కారణాలపై విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధి కారికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని మండలంలోని బూదరాళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాలకు తాళాలు వేసి తమ నిరసనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా పాఠశాలకు ఉపాధ్యాయులు రావడంలేదని, ఈ విషయమై అడిగితే, ఒక ఉపాధ్యాయునికి ఆరోగ్యం బాగోనందున, మెడికల్ లీవ్ పెట్టించి, మరొక ఉపాధ్యాయుని నియమిస్తామని చెప్పారని, వాస్తవానికి అలా జరగలేదని, దీనితో విద్యార్థులు ప్రతిరోజు మధ్యాహ్న భోజనానికే పాఠశాలకు వస్తున్నట్టుందని గ్రామానికి చెందిన టిడిపి నేత కూనిశెట్టి చంద్రరావు, వైసీపీ నేత సుమర్లసూరిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేశారు. పాఠశాలకు నూతన ఉపాధ్యాయుడ్ని నియమించే వరకు తాము ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

## రైతులు అందరూ చిరు ధాన్యాలు పండించాలి : వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దేవర

(నక్కపల్లి, ప్రభాతవార్త



జాతీయ ఆహార భద్రత పోషకాహార మిషన్ ద్వారా శ్రీ అన్నం (మిల్లెట్స్ / పోషక ధాన్యాలు)లో భాగంగా చిరు ధాన్యాలు సాగును రైతులకు ప్రోత్సహించడం కార్యక్రమంలో భాగంగా సామర్థ్య పెంపు కోసం ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ దేవర సత్యనారాయణ హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని దేవవరం గ్రామంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో బిసిటికే వి కే శాస్త్ర వేత్త బి. నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ అన్నం పంటలు రైతులకు తక్కువ నీటితో, తక్కువ ఖర్చుతో మంచి దిగుబడిని అందిస్తాయి అని చెప్పారు. ఇవి అధిక పోషక విలువలు కలిగి ఉండి ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఏ పి ఏఐఎంఎస్ ద్వారా పంటల సిఫార్సు మేర ఎరువులు వినియోగం గురించి వివరించారు. ఏఈ ఓ సత్యన్నారాయణ, శ్రీనివాస్ గ్రామ సహాయకులు మౌనిక,రాజేష్ మోహన్ ,గ్రామ పెద్దలు గొర్ల నరసింహమూర్తి, రైతులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, జూలై 3, ప్రభాతవార్త



నియోజకవర్గం అచ్యుతాపురం మండలం అచ్చుతాపురంలో పంచాయితీ నిధులతో సుమారు 20 లక్షల వ్యయంతో నిర్మించిన ఇండోర్ బ్యాట్మెంటన్ స్టేడియాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం ఓటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్మమని అన్నారు. గ్రామీణ యువతకు ఆధ్యాత్మిక క్రీడా వేదికలు కల్పించడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు మరింతగా తయారవుతారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి రోజు ఒక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ద్వారా నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు దశలవారీగా కల్పిస్తామని స్పష్టం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, యువత సంక్షేమం, క్రీడారంగ ప్రోత్సాహానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## గీత కులాల ఐక్యతతోనే రాజకీయ ప్రాధాన్యత

**జనాభా దామాషా పద్ధతిలో జీవీఎంసీ ఎన్నికల్లో సీట్లు ఇవ్వాలి -శెట్టిబలిజ, గౌడ, యాత, శ్రీ శయన, ఈడిగ కులాల ప్రతినిధుల డిమాండ్ -గీతకులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం**


విశాఖపట్నం,జులై 3, ప్రభాతవార్త



గీత కులాల ఐక్యతతోనే రాజకీయ ప్రాధాన్యత దక్కుతుందని గీతకులాల ఐక్య వేదిక ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. విశాఖ గీత కులాల ఐక్య వేదిక అధ్యక్షులు సంపంగి శ్రీను,ప్రధాన కార్యదర్శి అప్పారి గిరిబాబు ఆధ్వర్యంలో మేఘాలయ హోటల్లో శుక్రవారం కీలక నేతలతో సమావేశం నిర్వహించారు. శెట్టి బలిజ, గౌడ, యాత, శ్రీ శయన, ఈడిగ కులాల ప్రతినిధులు మాట్లాడుతూ గీత కులాలకు జనాభా దామాషా పద్దతిలో జీవీఎంసీ ఎన్నికల్లో సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. జీవీఎంసీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి ఇరవై సీట్లు గీతకులాలకు అన్ని రాజకీయ పార్టీయేలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.విశాఖలో సుమారు మూడు లక్షలమందికి పైగా గీత కులాల జనాభా ఉందని చెప్పారు.ఐనా రాజకీయంగా వివక్షకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.గీత కులాల ఐక్య వేదికకు నూతనంగా అధ్యక్ష కార్యదర్శలను ఎన్నుకోవడం జరిగిందని, త్వరలోనే పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేసుకొని గీత కులస్తుల ఐక్యత కోసం, హక్కులు సాధించుకోవడానికి కృషి చేస్తామని ప్రక టించారు. రాష్ట్రంలో నాలుగో వంతు ఉన్న గీత కులాలు అభివృద్ధి విషయంలో వెనకంజలో ఉన్నామని, అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండే విధంగా చూసుకోవాల్సిన అవసరం ఉందని సమావేశంలో వక్తలు, నాయ కులు అభిప్రాయపడ్డారు. యాత సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అంగటి రాము, రేఖల కృష్ణ గౌడ్,గొడ్డి కన్నారావు, పినగాడి సర్పంచ్ కేసుబోయిన త్రినాథ్,కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహా చలం, యల్లమిల్లి సురేష్, మాజీ కార్పొరేటర్ పిల్లి రమణ వరలక్ష్మి,కట్టా మల్లేశ్వరావు, ఉత్తరాంధ్ర యాత, శెట్టిబలిజ సంఘం కార్యదర్శి కండిపల్లి శ్రీధర్, దుర్గాలమ్మ దేవస్థానం చైర్మన్ కడవల రఘు,పట్నాల నూకరాజు, బత్తిన నవీన్, సంపంగి వాసు, చెల్లుబోయిన గోవింద్, అంగటి మూర్తి, గీత కులాల పెద్దలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన నేత సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు

అచ్యుతాపురం జులై 3 ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం ఎస్‌టిబిఎల్‌లో ఉన్న ఎమ్మెల్యే నివాసంలో జనసేన పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల కన్వీనర్ సుందరపు వెంకట సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో సతీష్ కుమార్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు సతీష్ కుమార్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ, ఉత్తరాంధ్రలో జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు

4-7Pg7exHMNWJQE.qxd:4-7Pg7exHMNWJQE.qxd 1/1/02 6:58 AM Page 1



## దుర్గమ్మ గుడిలో వేదోక్తంగా సంకష్టహార చతుర్థి




**ఇంద్రకీలాద్రి, జులై 3 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై సంకష్టహర చతుర్థి సందర్భంగా గణపతి హోమం, పూజాదికాలు తదితర క్రతువులను శుక్రవారం వేదోక్తంగా నిర్వహించారు. గణపతికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథులలో ప్రధానమైనది చవితి సంకటహార చతుర్థి పూజ ఆచరించడం వలన జాతకములోని సమస్యలు తొలగి, అన్ని పనులలో సంకటములన్నీ తొలగి సఫలత చేకూరుతుందనే పురాణోక్తి. సంకటహారచతుర్థి సందర్భంగా దేవస్థాన యాగశాలలో ఉదయం గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం కార్యక్రమములను ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు. లోక క్షేమం కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు ఖమ్మంకు చెందిన అల్లరి దుర్గారావు, శివదీక్షిత దంపతులు రూ.1,11,111లు విరాళమును ఆలయ అధికారులకు అందచేయగా దాతలకు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటం ప్రసాదము అందచేశారు.



# నవ శకానికి నాంది

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత
- పారిశ్రామికాభివృద్ధికి గ్రోత్ ఇంజన్ : మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- శృంగవరపుకోటలో జెఎస్‌డబ్ల్యూ ఎంఎస్ఎంఇ పార్కుకు భూమిపూజ చేసిన మంత్రులు



**విజయనగరం, జులై 3 ప్రభాతవార్త:** జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. శృంగవరపుకోట (ఎస్.కోట) మండల పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జేఎస్డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా భూమిపూజ చేశారు. కడప జిల్లా జమ్ముల మడుగు నుంచి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ పట్నం ఎంపీ భరత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, గాదె శ్రీనివాసుల నాయుడు, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, దాసరి కార్పొరేషన్ చైర్మెన్ రత్నాజీ, ఆర్డీవో సుధాసాగర్, పలువురు అధికారులు, స్థానిక నేతలు, జిందాల్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. రైతులు తమ భూములను త్యాగం చేయడం వల్లనే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని, వారికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. మొదటి దశలో 535 ఎకరాల్లో నిర్మించనున్న ఈ ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా సుమారు 45 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు రాకతో ఎస్.కోట నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా రూపాంతరం చెందనుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదొక నవ శకం అనీ, తమ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభానికి సిద్ధంగా ఉందనీ, ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతం కానున్నాయని చెప్పారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఉండేవని, ఇప్పుడు పరిశ్రమల రాకతో ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి ఉపాధి కోసం వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల కృషితో విజయనగరం జిల్లా దశ, దిశ పూర్తిగా మారబోతున్నాయని ఆమె పేర్కొన్నారు.

**ఉత్తరాంధ్ర దశ మార్చే జిందాల్:** మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ప్రపంచ స్థాయి ప్రమాణాలతో జిందాల్ కంపెనీ నిర్మాణం ఉత్తరాంధ్రకు ప్రత్యేక గుర్తింపునిస్తుందన్నారు. సుమారు 1160 ఎకరాల్లో, రూ. 531 కోట్ల పెట్టుబడితో మొదటి దశ పనులు జరుగుతున్నాయనీ, భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పించేలా, మొత్తం 45 వేల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. చిత్తూరు జిల్లాలో శ్రీ సిటీ ఎలాగైతే అభివృద్ధి చెందిందో, ఇక్కడ కూడా జిందాల్ ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. విజన్ 2047తో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి పేర్కొన్నారు.

**అభివృద్ధికి బాటలు వేస్తున్న కూటమి ప్రభుత్వం:** విశాఖ ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ, "గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్నాననీ, ఇన్నాళ్ళకు కోరిక నెరవేరిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, నక్కపల్లి ఉక్కు పరిశ్రమ, ఇప్పుడు ఎస్.కోట జిందాల్ ఫ్యాక్టరీతో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారుతుందనిచెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే అత్యధికంగా 25 శాతం పెట్టుబడులను తీసుకువస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారనీ కొనియాడారు.

**నిరీక్షణకు తెరపడింది:** స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల నేడు నిజమైందని ఆనందం వ్యక్తం చేశారు. జేఎస్‌డబ్ల్యూ ప్రారంభంతో ఎస్.కోటలో పండగ వాతావరణం నెలకొందనీ చెప్పారు. భవిష్యత్తులో పతంజలి ప్రాజెక్ట్, బలిఘట్టం ఎంఎస్ఎంఈ పార్కులతో ఎస్.కోట మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్ మాట్లాడుతూ, జెఎస్డబ్ల్యూ పార్కు వల్ల ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు.

# సర్ విధుల్లో అలసత్వం

- నలుగురు అధికారులకు షోకాజు నోటీసులు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన, విలువైన ఓటు భద్రతకు అత్యంత ముఖ్యమైన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నలుగురు అధికారులకు శుక్రవారం షోకాజు నోటీసులు జారీచేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఈఆర్‌వో ఎ.రవీంద్ర, ఏఈఆర్‌వోలు ఇస్మాయిల్, డి.చంద్రబోస్‌లతోపాటు విజయవాడ మధ్య నియోజకవర్గం ఏఈఆర్‌వో సంజయ్ రత్నకుమార్‌లకు షోకాజు నోటీసులు జారీచేశారు. సర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి చూపడంలో విఫలమైనందుకు ఈ నోటీసులు ఇచ్చారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సర్ ప్రక్రియ అత్యంత కీలకమైందని, ఈ విధుల్లో ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై కఠినచర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## 14యేళ్ల బాలిక అనుమానాస్పద మృతి

### మామపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు తల్లి ఫిర్యాదు

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో ఇటీవల ఏళ్ల బాలిక అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. ఇంట్లో ఉరివేసుకొని బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తుండగా ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. బాలిక మృతిచెందిన రోజే కుటుంబ సభ్యులు పోలీసులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అంత్యక్రియలు నిర్వహించి మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే బాలిక మృతి విషయంలో మామపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## తూర్పుపేటలో ఎస్‌టిపి ప్లాంట్ వివాదం

### ఆంధ్రా- యానాం సరిహద్దుల్లో ఉద్రిక్తత



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 3 ప్రభాతవార్త:** ఆంధ్ర, యానం సరిహద్దు వివాదం ముదురుతోంది. కేంద్ర పాలిత ప్రాంతం యానం,ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దుల్లో యానం ప్రభుత్వం సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్.టి.పి.) మురుగునీరు శుద్ధి కర్మాగారం నిర్మించాలని యానం అధికారులు చేస్తున్న సన్నాహాలను స్థానికులు అడ్డుకోవడంతో ఆంధ్ర, యానాం సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట ప్రాంతంలో యానం ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటు కోసం అధికారులు శుక్రవారం సర్వే చేయడానికి సన్నాహాలు చేస్తుండగా మండల అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్తులు ఇరు రాష్ట్రాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో యానం ప్లాంట్ ఏర్పాటు చేయడం తగదని జాతీయ రహదారి 216పై బైఠాయించి ఆందోళన చేశారు. ఆంధ్ర అధికారులు యానాం అధికారులకు సపోర్ట్ చేస్తున్నారని, దీనిపై ఆర్డిఓ ప్రజలకు వివరణ ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిల్లా అధికారులు వచ్చి ఈ అంశంపై సమాధానం చెప్పాలని పట్టు పట్టడంతో ఆందోళనకారులను శాంతింప చేసే పోలీసుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ కాకినాడ ఆర్డిఓ కి సమాచారం ఇవ్వడంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆర్డిఓ మల్లిబాబు ఆందోళనకారులతో మాట్లాడకుండా యానం అధికారులతో చర్చించడంతో ఆందోళనకారులు ఆగ్రహించి ఘటనా స్థలం నుంచి వై జంక్షన్ పి. మల్లవరం చెక్ పోస్ట్ వరకూ ర్యాలీగా వచ్చి అక్కడ బైటాయించి రాస్తారోకో చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తో చర్చలు జరుపుదామని ఆందోళనకారులతో సీఐ చైతన్య కృష్ణ చెప్పడం వారి ఆగ్రహానికి కారణమైంది. ఆర్డీవో ప్రజల వద్దకు రావాలని ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అటుగా కాకినాడ వైపు వెళ్ళిపోతున్న ఆర్డీవో కారును ఆందోళనకారులు అడ్డగించారు. దీంతో ఆర్డీవో కారు దిగివచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. చర్చల సందర్భంగా ఆర్డిఓ ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు, అఖిలపక్ష నాయకులు, ప్రజలు మాటల యుద్ధంతో గందరగోళం నెలకొంది. యానం ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకునే స్థలం వివాదాస్పదమైనదని ఇది హైకోర్టు పరిధిలో ఉందని ఆర్డీవో మల్లిబాబు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘటన స్థలానికి వచ్చామని తెలిపారు. ఇక్కడ క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకొని జిల్లా కలెక్టర్ తో మాట్లాడతామన్నారు. హైకోర్టు ఆర్డర్ వచ్చేంతవరకు ఇక్కడ ఎటువంటి కార్యకలాపాలు చేయరాదని తెలిపారు. దీంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు.

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ సోమవారానికి వాయిదా

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** బాలికపై లైంగికదాడి ఘటనకు సంబంధించి పేట్ బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో రిమాండులో ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. తనపై నమోదైన పోక్సో కేసు రాజ కీయ కుట్రలో భాగమని, తాను అమాయ కుడినని, ఎలాంటి తప్పు చేయలేదని భగీరథ్ హైకోర్టుకు గత మంగళవారం విన్నవించడం తెలిసిందే. అక్రమంగా నమోదైన కేసులో తనకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని అతను కోరడం విదితమే.

# లోకేష్ గురించి మాట్లాడే అర్హత ప్రకాష్‌రెడ్డికి లేదు

- ధైర్యముంటే మాతో చర్చించు
- నీ వెనుక ఎవరున్నా భయపడేదిలేదు
- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- గన్‌మెన్ల కోసమే ప్రకాష్‌రెడ్డి డ్రామా: పరిటాల శ్రీరామ్



**అనంతపురం, జులై 3 ప్రభాతవార్త బ్యూరో:** మా యువనాయకుడు మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదని నీకు ధైర్యముంటే మాతో ఎదురుగా కూర్చోని చర్చించవచ్చని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేకంగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదురి ప్రకాష్‌రెడ్డికి సవాల్ విసిరారు. నీ వెనుక ఎవరున్నా ఏ మాత్రం భయపడేదిలేదని చెబుతూ మా యువనాయకుడు నారా లోకేష్‌కు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మకు, నాకు హత్యారాజకీయాలు తెలియవని అనవసరంగా ఆరోపణ చేస్తే నమ్మే వారు ఎవరూ లేరని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడించారు. తనను చంపడానికి మంత్రి నారా లోకేష్ ప్రోద్భలంతో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు హత్యారాజకీయాలు చేస్తున్నారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం అనంతపురం నగరంలోని ఎస్ఆర్ గ్రాండ్‌లో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ధర్మవరం నియోజవర్గం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు పాల్గొని వైసిపి నేత, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై ఆరోపణలు సంధించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్స్ సంస్థను మా పెద్దలు స్థాపించింది కాదని 1983లో మేమే కష్టపడి సంస్థను స్థాపించామని వివిధ నిర్మాణ పనులు వేగంగా చేయడం వల్ల బోనస్‌లు కూడా తీసుకున్నామన్నారు. అనేక హైవేలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి మా సంస్థ గుర్తింపు తెచ్చుకుందన్నారు. అందులో భాగంగా మా క్రషర్ నుండి బయటకు వస్తున్న వాహనం రోడ్డుపై వేగంగా వచ్చిన వాహనాలను చూసి పది మీటర్ల దూరంలో తన కారును ఆపినట్లు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డే స్వయంగా చెప్పాడని ఆయన గుర్తు చేశారు. మళ్లీ ఏదో చేసేందుకు ప్రయత్నించారంటూ ప్రగల్బాలు పలుకుతున్నాడని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో చక్రపాణి అనే వ్యక్తిని చంపడానికి వాహనాల్లో వెళ్లింది నీవు కాదా అంటూ ప్రకాష్‌రెడ్డిని ప్రశ్నించారు. నేను సౌమ్యుడిని అని 1991లో మా దుకాణాలపై దాడులు చేసినా కూడా మేము ఎదుర్కొనగలిగామని ఆనాడే భయపడలేదన్నారు. కళ్యాణదుర్గం రోడ్డు వేస్తుంటే నీ బావమరుదులు అడ్డుకున్నారని అప్పటి ఎస్పి మీ బావమరుదుల మీద కేసు పెడితే కాళ్ల బేరానికి వచ్చింది నీవు కాదా అంటూ ఆయన విమర్శించారు. ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కేవలం గన్‌మెన్ల కోసమే ఈ ఎత్తుగడని చెబుతూ గన్‌మెన్లు కావాలంటే జిల్లా ఎస్పి, జిల్లా కలెక్టర్, డిఐజిలను కలిసి విన్నవించుకోవచ్చని కానీ ఇలాంటి చౌకబారు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. గతంలో హంద్రీనీవా కాలువ కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లను బెదిరించి ఇబ్బందులు పెట్టడం, ఘర్షణలు జరగడంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే గన్‌మెన్లను తొలగించిందని ఆయన గుర్తు చేశారు. ఒక ఆగివున్న లారీని వెనుక నుండి స్కార్పియో వాహనం తగిలించుకుని తిరిగి నాపై కుట్ర జరుగుతోందంటూ గన్‌మెన్లు కావాలని గతంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అడిగారని శ్రీరామ్ వెల్లడించారు. ఆ సంఘటనపై పోలీసులు ఎంక్వైరీ చేస్తే అది కట్టు కథ అని తేల్చి గన్‌మెన్లు ఇవ్వలేదని అందుకే ఇప్పుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొత్త నాటకానికి తెర లేపాడని ఆయన ఆరోపించారు. హంద్రీనీవా కాలువ పనులను పాత ధరలకే చేస్తుంటే ఎమ్మెల్యే సురేంద్రబాబుకు మరింత గొప్ప పేరు వస్తుందనే భయంతోనే ఇలాంటి కుట్రలు చేస్తున్నావు నీ చిల్లర మాటలు చూసి జనం నవ్వుకుంటున్నారని ప్రకాష్‌రెడ్డి ఖబడ్దార్ మాటలు జాగ్రత్తగా మాట్లాడాలంటూ పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ వైసిపిలో నిన్ను ఎవరూ గుర్తించడంలేదని అలాంటిది నీవు మా యువనాయకుడు నారా లోకేష్ గుర్తించి అసభ్యంగా మాట్లాడుతావా అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రకాష్‌రెడ్డి మాట్లాడిన భాష ఏంటి సభ్య సమాజంలో మనం వున్నామన్న విషయం గుర్తుంచుకోవాలని, మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే ముందు ఒక్కసారి నీ గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించి మాట్లాడాలని ప్రకాష్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. ప్రకాష్‌రెడ్డిని చంపేందుకు ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, పరిటాల సునీతకు ప్రత్యేకంగా మా యువనాయకుడు నారా లోకేష్ బాధ్యతలు అప్పగించినట్లు ఎలా మాట్లాడుతావు అంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తీవ్రంగా నిలదీశారు. ఉత్తర ప్రగల్భాలుగా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆరోపణలను తీ వ్రస్థాయిలో కొట్టిపారేశారు. మా యువనాయకుని గురించి మా ఎమ్మెల్యేల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తేలేదని ఎంఎస్ రాజు హెచ్చరించారు.

## క్రషర్ గిరిజన కార్మిక యువకుడు అనుమానాస్పద మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 3 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా లో స్టోన్ క్రషర్లు నిర్వాహకుల ఆగడాలకు అంతుపొంతూ లేకుండా పోతోంది. స్వలాభం తప్ప సామాజిక రక్షణ, కార్మికుల భద్రతకులకు ఏమాత్రం విలువ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగిపోతున్న క్రషర్ల దందా రోజురోజుకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఇటీవల వార్తలో కూడా వీటిపై కథనం రావడం విధితమే. ఈ పరిస్థితుల్లో ఉప్పల పాలెంలో నిర్వహిస్తున్న క్రషర్ వద్ద పనిచేసే కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటనపై గ్రామస్తులు సైతం ఆగ్రహావేశాలం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుతో ప్రాణాలు విలుగట్టి తమ తప్పును కప్పు బిచ్చుకునే యత్నానాలలో నిర్వాహకులు మునిగిపోయారు. రౌతులపూడి మండలం ఉప్పంపాలెం లో నిర్వహిస్తున్న ఏఎస్ఎన్ క్వారీ క్రషర్ ఆగడాలకు హద్దులేకుండా పోతుంది. గురువారం రాత్రి క్రషర్‌లో పనిచేస్తున్న గిడజం గ్రామానికి చెందిన తంటపురెడ్డి కుశరాజు (17) అనుమాన స్పద స్థితిలో మరణించాడు. అయితే కుశరాజు మరణం విషయమై క్రషర్ యాజ మాన్యం చెబుతున్న పొంతనలేని సమాధానాలతో శుక్రవారం ఉదయం నుంచి గ్రామస్థులు రోడ్డుపై భైటాయించి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితిలో ఉండగా కారులో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అక్కడే కుశరాజు మృతిచెందాడని, ఒకరు, ఎలాజరిగిందో తెలియటం లేదని కొందరు పనివారు చెబుతున్నారని దీనిపై తమకు అనుమానాలు న్నాయని తల్లితండ్రులు, తంటాపురెడ్డి రంగ, రాణితో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. గిడజాంలో ప్రమాదం జరిగితే అదే గ్రామంలో నివసిస్తున్న మాకు ఎందుకు తెలియపరచలేదని, తమకుమారుడు శరీరంపై రాళ్ళదెబ్బలున్నాయని, క్రషర్ లోనే చనిపోతే ఈ విధంగా సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**కొడుకా రావా అంటూ తల్లి ఆవేదన:** చేతికందివచ్చిన కొడుకు తిరిగిరాని లోకానికి పోవడంతో తల్లితండ్రులను ఓదార్చడం బంధువులవల్ల కావటం లేదు. 10వతరగతి వరకు చదివిన కుమారుడు ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో ఏఎస్ఎన్ క్రషర్‌లో పనిలోకి వెళ్ళి కుటుంబాన్ని పోషిస్తున్నాడని ఇపుడు తమకు దిక్కెవరు పెద్దల కాళ్ళుపట్టుకుని ఏడుస్తున్న తీరు చూపరులను కంటనీరు పెట్టిస్తుంది.

# మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన

- ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- రోగుల అవసరాలకు తగ్గట్లు తీసుకోవాల్సిన చర్యలపై రెండు వారాల్లోగా నివేదించాలి
- పరికరాలు, మిషన్ల కొనుగోలు, సరఫరాకు నిర్దిష్ట క్యాలెండర్‌ను రూపొందించాలి
- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**విజయవాడ, జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసే మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుత వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేసి, రోగులకు మందులు అందుబాటులో ఉంచడంలో ఎటువంటి ఇబ్బంది లేని విధంగా కొత్త వ్యవస్థను రూపొందించాలని మంత్రి తెలిపారు. ఇందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ నేతృత్వంలో ప్రజారోగ్య శాఖ సంచాలకులతోపాటు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సీనియర్ అధికారి, రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయ ల అభివృద్ధి సంస్థ(ఏపిఎంఎస్ ఐడిసి) అధికారి (డ్రగ్స్ విభాగం), ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులతో కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సాయంత్రం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసే మందులు, సర్జికల్స్, పరికరాల కొనుగోలు విధానం, పంపిణీ ఆసుపత్రుల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులతో సుదీర్ఘంగా సుమారు 4 గంటల పాటు చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ప్రభుత్వాసుపత్రులకు జరిగే మందుల కొనుగోలు, సదరు ఆసుపత్రుల ద్వారా స్థానికంగా జరిగే మందుల కొనుగోలు (లోకల్ పర్చేజ్), పంపిణీ, ఇతర అంశాల గురించి మంత్రికి వివరించారు. ఆసుపత్రుల నుంచి వచ్చే డిమాండ్ల అనుసరించి త్రైమాసిక (క్వార్టర్లీ) విధానంలో మందులను పంపుతున్నామని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ ప్రస్తుత విధానంలో సమూల మార్పులు తీసుకురావాల్సి న అవసరం ఉందని స్పష్టంచేశారు.

**అన్ని కోణాల నుంచి అధ్యయనం జరగాలి:** ఆసుపత్రులకు రోగులు ఎంత మంది వస్తున్నారు? ఓపీ, ఐపీ ఎలా ఉంటుంది? , మందుల అవసరం ఎలా ఉంది,? డిమాండ్లను ఎలా ప్రస్తుతం పంపుతున్నారు? , అన్ని ఆసుపత్రుల నుంచి వచ్చే డిమాండ్లను ఏ విధంగా క్రోడీకరిస్తున్నారు? మందుల కంపెనీల వారికి ఎలా ఆర్డర్లు ఇస్తున్నారు? ఎంత సమయంలో అవి ఆసుపత్రులకు చేరుతున్నాయి ? జాప్యం జరిగితే ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? డిమాండ్లకు తగ్గట్లు మందుల సరఫరా జరుగుతోందా? లేదా? మందుల అవసరాల డేటాలో ఎంతవరకు కచ్చితత్వం ఉంటుంది? ఎక్కడెక్కడ లోపాలున్నాయి? వాటిని ఎలా మెరుగుపరచాలి? తమిళనాడులో ఎలాంటి ప్రమాణాలు అనుసరిస్తున్నారు? అక్కడి ఉత్తమ విధానాలపై కమిటీ అధ్యయనం చేయాలి. ఇతర అంశాలపై లోతుగా, క్షుణ్ణంగా అధ్యయనం చేసి, రెండు వారాల్లోగా ప్రభుత్వానికి కమిటీ రిపోర్టు ఇవ్వాలి " అని మంత్రి స్పష్టం చేశారు.

**పరికరాల కొనుగోలుకు క్యాలండర్ విధానాన్ని రూపొందించాలి:** ఆసుపత్రుల నుంచి పరికరాలు, మిషన్‌ల కోసం ఏపీఎంఎస్ఐడీసీకి వచ్చే ఇండెంట్ల విధానంలోనూ మార్పులు రావాలన్నారు. ఆసుపత్రుల సూపరింటెండెంట్ల నుంచి వచ్చే పరికరాల కొనుగోలు ఇండెంట్లు, సరఫరా నిర్దిష్ట సమయంలో జరిగేలా ప్రత్యేకంగా క్యాలండర్ విధానాన్ని రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. దీనివల్ల టెండర్లను పలు మార్లు టెండర్లు పిలిచే అవకాశం తలెత్తదని, సుహృద్భావత వాతావరణంలో పోటీ ఏర్పడి ధరలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు.

**త్వరలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణాల ప్రారంభం:** కేంద్ర మంత్రి జేపీ నడ్డా త్వరలో ప్రారంభించనున్న ఖిక్రిటికల్ కేర్‌ఖి బ్లాక్‌ల నిర్మాణాల పురోగతి, సన్నాహక ఏర్పాట్లను మంత్రి అధికారులతో చర్చించారు. పూర్తయిన 9 క్రిటికల్ బ్లాక్ ల నిర్మాణాలను, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీలను కూడా కేంద్ర మంత్రి ఏక కాలంలో ప్రారంభిస్తారని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టంచేశారు.



**ఆయుష్ డిస్పెన్సరీల నిర్మాణాలు దాదాపుగా పూర్తి:** ఈ సమీక్షా సమావేశంలో ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ రూ. 44 కోట్లతో చేబట్టిన 150 ఆయుష్ డిస్పెన్స రీల పునర్నిర్మాణాలు, నూతన భవన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని మంత్రికి వివరించారు. అలాగే 6 ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాల(రూ. 90 కోట్ల వ్యయ)కు అవసరమైన స్థలాల సేకరణ, రూ. 210 కోట్లతో మూడు ఖఆయుష్ కళాశాల ఏర్పాటు చర్యల గురించి మంత్రికి వివరించారు. విశాఖలోని ఆయు ష్ శాఖకు చెందిన ల్యాబరేటరీ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ఖిఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఖిఏర్పాటుకు అవసరమైన ఆమోదంపై కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న సంప్రదింపులపైనా మంత్రి అధికారులతో చర్చించారు.

**పిహెచ్‌సీ, సిహెచ్‌సి, ఇతర నిర్మాణాల పురోగతిపై ఆరా:** గడిచిన రెండేళ్లలో జాతీయ ఆరోగ్య మిషన్, పీఎం అభిమ్, 15వ ఆర్థిక సంఘం కింద రూ.1,450 కోట్లతో చేబట్టిన 100 పీహెచ్సీలు, తొమ్మిది సీహెచ్సీలు, సుమారు 4,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల భవన నిర్మాణాల పురోగతి, 20 పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాల పురోగతిని మంత్రి సమీక్షస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులను ఆదేశించారు.

**వైద్య కళాశాలల నిర్మాణాల్లో వేగాన్ని పెంచాలి:** పాడేరు, పిడుగురాళ్ల, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాల పురోగతిని మంత్రి సమీక్షిస్తూ త్వరగా పనులు పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలన్నారు. అదేవిధంగా 11 పూర్వ వైద్య కళాశాలల్లో జరుగుతోన్న రకరకాల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యాలు పరిగణనలోనికి తీసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ కు ఎన్ ఎబిఎల్ అక్రిడిటేషన్ తెప్పించాలి తిరుపతి, విశాఖలో రూ. 45 కోట్లతో అత్యాధునిక పరికరాలు/ మెషిన్లతో సిద్ధమైన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీలు రాబోయే మూడునెలల్లో ఎన్ఎబీఎల్ అక్రిడిటేషన్ తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. ఈ రెండు లేబరేటరీల్లో నియామకాలు కూడా పూర్తయ్యాయన్నారు. తిరుమలలో స్టేట్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్, విశాఖలో ల్యాబ్లో నమూనాల పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు ఆమోదం తెలిపిన 78 ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు. 72 ఇతర పోస్టుల (కొత్తవి) భర్తీకి ఆర్థిక శాఖ నుంచి ఆమోదం పొందాలని తెలిపారు. ఇవి కాకుండా రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన 278 శాంక్షన్డ్ పోస్టుల్లో సుమారు 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని కూడా త్వరితగతిన భర్తీచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. విశాఖ, గుంటూరు తిరుమల, తిరుపతి, కర్నూలు స్టేట్ ఫుడ్ ల్యాబుల్లో ఈ నియామకాలు జరిగేందుకు ప్రత్యేకంగా చొరవ చూపాలని వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబును ఆదేశించారు.

## ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### సిఎస్ సంజయ్‌జాజుకు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యో గుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్- నిజామాబాద్- ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యా సంస్థలకు సంబంధించిన పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది బదలీలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని మల్క కొమరయ్య కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)ను తెలంగాణ మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీలు, సమగ్ర శిక్ష, యుఆర్‌ఎస్‌ల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది అందరికీ వర్తింపజేయాలన్నారు. అన్ని శాఖల్లో జి.ఓ.ఎం.ఎస్. నెం.190ని సమర్థవంతంగా అమలు చేయాలని సీఎస్‌కి రాసిన లేఖలో కోరారు. డీఎస్సీ-2003 ద్వారా ఎంపికైన అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వర్తింపజేయాలన్నారు. తెలంగాణలోని 194 మోడల్ స్కూల్స్ రెగ్యులర్ ఉపాధ్యాయులను స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌లో విలీనం చేసి.. వారి వేతనాలను 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గురుకుల విద్యాసంస్థల్లో ఏకరీతి పని వేళలను, ఒకే విధమైన టైమ్‌టేబుల్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## విహెచ్‌ను పరామర్శించిన మాజీ సిఎల్పీ నేత జానారెడ్డి



**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** సోమాజి గూడలోని ఒక్క ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న సీనియర్ కాంగ్రెస్ నేత, రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ సలహా దారులు వి.హనుమంత రావును సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ సిఎల్పి నేత కె.జనారెడ్డి శుక్ర వారం పరామర్శించారు. ఏసియాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజి ఎండి డాక్టర్ పూర్ణ చందర్‌రెడ్డితో మాట్లాడి విహెచ్ ఆరోగ్యపరిస్థితి తెలుసుకొన్నారు. విహెచ్‌కు దాదాపు ఇన్‌ఫెక్షన్ తగ్గిపోయిందని ఒక వారం రోజులు విశ్రాంతి తీసుకొంటే సరిపోతుందని జానాకు పూర్ణ చందర్‌రెడ్డి వివరించారు. దేశంలో జరుగుతున్న సమకాలిన రాజకీయాలు సర్ తదితర అంశాలపై ఇరువురు సీనియర్ నేతలు మాట్లాడుకొంటూ గతకాలం రాజకీయాలను జ్ఞాపకం చేసుకొన్నారు.

## 6న ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకులా ల్లోని జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఈ నెల 6న స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నట్టు సొసైటీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్లను జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఎస్సీ గురుకులాల్లోని జూనియర్ కాలేజీల్లో ఇంటర్ అడ్మిషన్ల కోసం ఆర్‌జేసీ సెట్-2026ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఆర్‌జేసీ సెట్ ద్వారా ఎస్సీ గురుకులాల్లోని జూనియర్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఇప్పటికే రెండు విడతల్లో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. అయినప్పటికీ ఇంకా కొన్ని సీట్లు మిగిలి ఉన్న నేపథ్యంలో ఆయా సీట్ల భర్తీ కోసం జిల్లా స్థాయిలో ఈ నెల 6న స్పాట్ అడ్మిషన్లను చేపట్టనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సొసైటీ సెక్రటరీ సూచించారు.

## కాలె యాదయ్య హఠావో.. కాంగ్రెస్ పార్టీకో బచావో

### ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కాలె యాదయ్య హఠావో కాంగ్రెస్ పార్టీకో బచావో అంటూ ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీ భవన్ ఎదుట నిరసనకు దిగారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఏ పార్టీలో ఉన్నాడో కూడా చెప్పకుండా కనీసం కాంగ్రెస్ కండువా కూడా కప్పుకోవడం లేదని కార్యకర్తల ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్ల నుంచి పార్టీని నమ్ముకొని పని చేస్తున్న తమకు కాంగ్రెస్ పార్టీలో సరైన గుర్తింపు లేదని వాపోయారు. నిన్నగాక మొన్న వచ్చిన కాలె యాదయ్య అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను కలుపుకొని పోకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదయ్య చెర నుంచి కాంగ్రెస్ పార్టీని కాపాడాలని గాంధీభవన్ ఎదుట ఆందోళన చేపట్టారు.




సమావేశంలో మాట్లాడుతున్న జి.చెన్నయ్య

## ఆగస్టు 11 నుంచి ఉధృతంగా పోరాటాలు

### మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది మాలలకు రాజ్యాంగబద్ధమైన విద్య, ఉద్యోగ రంగాలలో అవకాశాలు దక్కకుండా రోస్టర్ పాయింట్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం తక్షణమే రోస్టర్ పాయింట్లను సవరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆగస్టు 11వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి జి.చెన్నయ్య మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో మాలలకు 5 శాతం కేటాయించిన గ్రూపు-3లోని మాల, మాల అనుబంధ కులాలకు కొన్ని నోటిఫికేషన్‌లలో సున్నా పోస్టులు, మరికొన్ని నోటిఫికేషన్‌లలో 2 శాతం లోపు ఉద్యోగాలు కేటాయిం చడమంటే మాల కులాన్ని అణిచివేసే కుట్ర ఉందని ఆయన ఆరోపిం చారు. ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పందించి రోస్టర్ విధానాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలలకు పూర్తిగా అన్యాయం జరిగిందని, జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వంలోని పెద్దలకు వివరించడం జరిగిందని, దీనికి అందరూ అంగీకరించినప్పటికి సవరించడానికి వచ్చిన ఇబ్బంది ఏమి వచ్చిందని, తక్షణమే సబ్‌కమిటి మంత్రులందరూ స్పందించి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు సరళ తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి మరో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

### త్వరలో సిఎం చేతుల మీదుగా ప్రారంభం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ కర్మాగారం పనులు తుది దశలో ఉన్నాయని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ సచివాలయంలో శుక్ర వారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా మరో ఆధునిక ఆయిల్ పామ్ కర్మాగారాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. గంటకు 15 టన్నుల ఆయిల్ పామ్ గెలలను క్రష్ చేసే సామర్థ్యంతో దీన్ని సుమారు రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారని తెలిపారు. ఆయిల్ ఫెడ్ వారిచే నడుపబడుతున్న మిల్లులలో ఏ మిల్లులలో అయితే ఎక్కువ ఒఇఆర్ వస్తుందో దాన్ని గెలల ధరను నిర్ణయించడానికి ప్రామాణికంగా తీసుకుంటున్నామని చెప్పారు. కాని ప్రైవేట్ కంపెనీలు అన్ని మిల్లుల సరాసరి ఒఇఆర్‌ని ప్రామాణికంగా తీసుకోవాలని కోర్టుకు వెళ్లడం వల్ల రైతులకు గెలల ధర తక్కువయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరిస్తే మా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అయినా వెనుకడుగు వేయదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇప్పటికే కొత్తగూడెం జిల్లాలోని అప్పారావుపేట, అశ్వారావుపేట్, సిద్ధిపేట్ జిల్లా నర్మెట్టలో ఆయిల్ పామ్ కర్మాగారాలు రైతులకు సేవలందిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 81,263 మంది రైతులు సుమారు 2.97 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కనీసం ఒక ఆయిల్ పామ్ కర్మాగారం ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో సాగు విస్తరించే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. కొత్త కర్మాగారాల ఏర్పాటు, ప్రాసెసింగ్ సదుపాయాల కల్పనతో పాటు రైతులకు ఎకరానికి రూ.46,250 సబ్సిడీ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.23,852గా ఉందని, ఇది పామాయిల్ చరిత్రలోనే అత్యధిక ధర అని చెప్పారు.

# 8 నుంచి పిజి ఎంట్రన్స్ పరీక్షలు

### ఇప్పటివరకు హాల్‌టికెట్లు జారీకాలేదు

### ఆందోళనలో అభ్యర్థులు

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 9 యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్(సీపీజీఈటీ)-2026 పరీక్షలు ఈ నెల 8 ననుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15 వరకు పరీక్షలు కొనసాగను న్నాయి. ప్రతి రోజు మూడు సెషన్‌లలో పరీక్షను నిర్వహించనున్నారు. అయితే ఇప్పటి వరకు ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను అధికారులు విడుదల చేయలేదు. మరో 4 రోజుల్లో పరీక్షలు జరగనుండగా ఇప్పటి వరకు హాల్ టికెట్లు జారీ కాకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. హాల్ టికెట్లు జారీ అయితే తమకు ఏ పరీక్షకు ఎక్కడ పరీక్షా కేంద్రం ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుందని తదనుగుణంగా రవాణా సౌకర్యాలను చూసుకోవల్సి ఉంటుందని అభ్యర్థులు అంటున్నారు.

సాధారణంగా ఏదైనా ప్రవేశ పరీక్షకు సంబంధించి పరీక్షలకు కనీసం వారం రోజుల ముందుగానే హాల్ టికెట్లను జారీ చేస్తారు. కానీ సీపీజీఈటీ-2026కి సంబంధించిన హాల్ టికెట్లు పరీక్షలు మరో 4 రోజులే ఉన్నప్పటికీ ఇప్పటి వరకు జారీ చేయలేదు. సీపీగెట్ పరీక్షల నిర్వహణ బాధ్యతను మొదటిసారిగా కాకతీయ యూనివర్సిటీకీ ఉన్నత విద్యా మండలి అప్పగించింది. గత ఏడాది వరకు సీపీగెట్‌ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించేది.

ఈ ఏడాది ఆ బాధ్యతను కాకతీయ యూనివర్సిటీకి అప్పగించారు. సీపీగెట్-2026కి ఈ ఏడాది సుమారు 53 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ. పాలమూరు, జేఎన్‌టియుహెచ్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, డాక్టర్ మన్మోహన్సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశాలకు సీపీగెట్‌ను నిర్వహిస్తున్నారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, పీజీ ఐదేళ్ల కోర్సుతోపాటు 44 కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు.

ఈ నెల 8 నుంచి 15 వరకు ప్రతి రోజూ మూడు విడతల్లో ఆన్ లైన్(సీబీటీ)లో పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, ఖమ్మం, కోదాడ, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. హాల్ టికెట్ల జారీకి సంబంధించి సీపీగెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేందర్‌ను వార్త ప్రతినిధి సంప్రదించగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కానీ వాస్తవానికి శుక్రవారం రాత్రి 7 గంటల వరకు కూడా హాల్ టికెట్లను అందుబాటులోకి తీసుకురాలేదు.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 301

**హైదరాబాద్ (బేగంపేట) జులై 3,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 301 దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 170దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు 27, సాంఘిక సంక్షేమ శాఖకు 17,ప్రవాసీ ప్రజావాణికి 02దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 85దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరిం చారు. వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆయాలు, ఏ ఎన్ ఎం లు, అంగన్‌వాడీ సిబ్బంది పెద్ద సంఖ్యలో సీఎం ప్రజావాణికి తరలివచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పిఎఫ్ అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు దరఖాస్తు అందించారు. ప్రీప్రైమరీ పిల్లలను అంగన్ వాడీలోనే కొనసాగించాలని వారు కోరారు.నూతనంగా పోస్టింగ్ అయిన స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్ ను చిన్నారెడ్డి దగ్గరుండి ప్రతి డెస్క్‌కు తీసుకునివెళ్లి అధికారులను పరిచయం చేసి ప్రజావాణి అమలుజరుగుతున్న తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేందర్,డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై సమన్వయ మండలి వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి, నోడల్ అధికారి కె.విద్యాసాగర్.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై 6న అఖిలపక్ష సమావేశం

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఈనెల 6న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీల బంద్‌కు సహకరించిన విద్యాసంస్థలకు, ఉద్యమకారులకు జాజుల ధన్యవాదాలు తెలిపారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌ను పాత పద్ధతిలోనే అమలు చేయాలని, ఫీజుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్స్‌తో ఈ నెల 2న జరిగిన కాలేజీల బందు సంపూర్ణంగా విజయ వంతమైందన్నారు. ఇదే అంశంపై ఈనెల 6న హైదరాబాదులో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నట్టు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిగా అమలు చేయాలని 6 నెలలుగా శాంతియుతంగా ప్రజా సంఘంగావిద్యార్థులు పెద్ద ఎత్తునపోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు. ఇప్పటికే కలెక్టరేట్ల ముట్టడి, సచివాలయం ముట్టడి, నిరసన దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం రావడం లేదన్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటే

### ఆ పార్టీలవి పొలిటికల్ డ్రామాలే

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న సర్కార్ అప్పుల సర్కారు.. ఇది తప్పుల సర్కారు.. ప్రజలకు, రాష్ట్రానికి తీరని నష్టం చేసిన బిఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటే అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి నడుపు తున్న పొలిటికల్ డ్రామాతో రాష్ట్రం పూర్తిగా సర్వనాశనమవుతుందని విమర్శించారు. గత 10 సంవత్సరాలు బిఆర్ఎస్ రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ముంచితే, ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నర ఏళ్లలోనే రూ.4 లక్షల కోట్ల అప్పులు తెచ్చి అంతకుమించి దోచుకుంటుందని ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాలు ప్రజల రక్తమాంసాల మీద రాజకీయాలు చేస్తూ రాష్ట్రానికి తీరని నష్టం చేశాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ సమావేశాల్లో కేవలం అప్పుల గురించే చర్చిస్తున్నారని దుయ్యబట్టారు. మూసి ప్రాజెక్ట్ మొదటి దశ ప్రారంభం కోసమే ప్రభుత్వం రూ. 6 వేల కోట్ల అప్పు కోసం ప్రయత్నిస్తుందన్నారు. ఈ అప్పులన్నీ రాష్ట్ర అభివృద్ధి కోసం కాదు.. తమ పార్టీకి సహకరించే కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టి, వందలాది ఎకరాల విలువైన భూములను అనుయాయులకు అప్పజెప్పి, వేల కోట్ల కమీషన్ల ద్వారా లబ్ధి పొందడానికేనని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులకు కూడా కేంద్ర ప్రభుత్వమే జామీన్ (గ్యారెంటీ)గా ఉంటూ అప్పులు ఇప్పిస్తోందనే నిజాన్ని ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన ఒకే ఒక్క అభివృద్ధి ఏంటో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. 100శాతం రుణమాఫీ అయ్యిందని గొప్పలు చెప్పుకుంటున్న సిఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా, రుణమాఫీ కాని రైతులతో నేను మాట్లాడిస్తా, మీరు వస్తారా? అంటూ ప్రశ్నించారు.

# టీచర్లకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

### అవమానపరిచే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాంశాలల్లో చదివే విద్యార్థులతోపాటు అక్కడ బోధన చేసే ఉపాధ్యాయులకు బోధనేతర సిబ్బందికి కూడా ఉదయం బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్నం భోజనం అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు మండి పడుతున్నాయి. ఈ నిర్ణయం తమను అవమానించేదిగా ఉందని.. వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. టీచర్లకు బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్న భోజనం అమలు చేయడంపై పలు ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం మూలంగా ఉపాధ్యాయులకు బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్న భోజనం అమలుచేయనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 1.08 లక్షల మంది ఉపాధ్యాయులు, మరో 10వేల మంది బోధనేతర సిబ్బందికి అయ్యే ఖర్చును ప్రభుత్వం ప్రతినెలా భరించాల్సి ఉంటుంది.

ఈ ఖర్చును ఉపాధ్యాయులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం కోసం కాకుండా ఇతర అభివృద్ధి పనులకు ఉప యోగించాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రభుత్వ టీచర్లకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం అభ్యంతరకరమని ఎస్‌టీయూటీఎస్ అభిప్రాయ పడింది. పాఠ శాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులకు కూడా అమలుచేయాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల ఎస్‌టీయూ టీఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మధ్యాహ్న భోజన పథకం ప్రధాన ఉద్దేశ్యం పేద, బడుగుబలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించి వారి ఆరోగ్యం, హాజరు శాతం, విద్యా భివృద్ధిని మెరుగుపరచడం కోసమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సదానందం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ అన్నారు. కాబట్టి ప్రభుత్వం తన దృష్టిని పూర్తిగా విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను మరింత మెరుగుపరచడంపైనే కేంద్రీకరించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీలకు గౌరవ వేతనం పెంచడంతోపాటు బిల్లులను సకాలంలో చెల్లించాలని, విద్యార్థులకు అందించే గుడ్డు ధరను ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల సమాజంలో ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగే అవకాశం ఉందని, ప్రజల్లో చులకన భావం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఇవ్వాల్సిన డిఏలు, పిఆర్‌సి ఇవ్వకుండా దాటవేస్తూ ..అడగని ఈ ఉచిత భోజన పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఉపాధ్యాయ లోకాన్ని అలాగే యావత్ ఉద్యోగులను ప్రలోభపెట్టడమేనన్నారు. తక్షణమే ఉద్యోగ ఉపాధ్యాయ వర్గానికి ఇవ్వాల్సిన డిఎలను ఇస్తూ, పిఆర్‌సి నివేదికను తెప్పించుకుని దానిని వర్తింపజేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుని కలిసిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## డిపిసిలు ఏర్పాటు చేసి త్వరగా ప్రమోషన్లు ఇవ్వాలి

### నూతన ప్రభుత్వ సిఎస్ సంజయ్‌జాజుకు టిజిఒ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** వివిధ ప్రభుత్వ శాఖల్లో డిపార్ట్ మెంటల్ ప్రమోషన్ కమిటీ(డిపిసి)లను ఏర్పాటుచేసి త్వరగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టిజివో) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుని టిజివో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వారి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ, ఉద్యోగులు ప్రజాపరిపాలనకు సంబంధించిన అంశాల్లో వారి సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగుల సమస్యలైన పిఆర్‌సి, హెల్త్‌కార్డులు త్వరితగతిన ఇవ్వాలని, అలాగే డిపిసిలు ఏర్పాటు చేసి ప్రమోషన్స్ ఇప్పించాలని కోరారు. సీఎస్‌తోపాటు సీఎం సెక్రటరీ శేషాద్రి, సీఎం సెక్రటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డి వేముల శ్రీనివాస్‌ను కోరగా వారు సానుకూలంగా స్పందించారని టిజివో నాయకులు తెలిపారు.

## నేడు ఎఐసిసి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ రాక

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** ఎఐసిసి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబా శనివారం హైదరాబాద్‌కు వస్తున్నారు. అల్కా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద యం 10 గంటలకు జరగబోయే నేషనల్ లీగల్ కంక్లేవ్‌లో పాల్గొంటారు.5వ తేదీన ఆదివారం నాడు ఉదయం 11 గంటలకు అల్కా లాంబ గాంధీ భవన్ లో ప్రెస్ మీట్ లో మాట్లాడుతారు. అనంతరం 12 గంటలకు మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన జరిగే మహిళ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

## ఉద్యమకారుల సంక్షేమ దిశగా కేశవరావు కమిటీ 6న తొలి సమావేశం

**హైదరాబాద్, జులై 3 ప్రభాతవార్త:** ఉద్యమకారుల సంక్షేమంపై సంప్రదింపులకు కె. కేశవరావు కమిటీ శ్రీకారంచుట్టింది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి జీఓ నెం. 679 ద్వారా ప్రభు త్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 6వ తేదీ నుంచి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరామ్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ సంప్రదింపుల ప్రక్రియ దాదాపు రెండు వారాల పాటు కొనసాగనుంది.జూలై 6న జరిగే తొలి సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి జెఏసి నాయకులతో కమిటీ సమావేశం కానుంది. జులై 7న కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి జెఏసి నాయకులతో సమావేశం నిర్వహించనుంది. జులై 8న ఇతర విశ్వవిద్యా లయాల విద్యార్థి జెఏసిలు, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కమిటీ చర్చలు జరపనుంది.మిగిలిన సమావేశాల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటి స్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశాలకు ఆహ్వానితులకు ప్రత్యే కంగా సమాచారం అందజేస్తామనిపేర్కొన్నారు. ఉద్యమకారులు,సంబంధిత ప్రతి నిధులు ఈ సంప్రదింపుల కార్యక్రమానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 41,53,185 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

### 101.4 శాతం కవరేజీ సాధించిన వైద్య, ఆరోగ్య శాఖ

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రంలో ఐదేళ్లలోపు 40,97,749 మంది చిన్నారులు ఉంటారని అంచనావేయగా, మొత్తం 41,53,185 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వైద్య, ఆరోగ్య శాఖ 101.4 శాతం కవరేజీ సాధించింది. పోలియో బూత్‌లతోపాటు ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయడం ద్వారా ఆరోగ్య శాఖ తన లక్ష్యాన్ని అధిగమించింది. నిర్మాణ ప్రాంతాలు, వలస కార్మికుల కాలనీలు, హైరిస్క్ ప్రాంతాలు, బస్తీలు, చైల్డ్ కేర్ హోమ్‌లలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యులు, అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు, ఇతర ఫ్రంట్‌లైన్ సిబ్బందిని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమం విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రజలకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పోలియో రహిత హోదాను కొనసాగించేందుకు ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, ప్రతి చిన్నారి ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రజల సహకారం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే కన్నా సినిమా డైరెక్టర్‌గా పనికొస్తాడు

### ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ వ్యాఖ్య

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే కన్నా సినిమా డైరెక్టర్‌గా పనికి వస్తాడు, ఆయన ఉహాలు, కల్పనలు చూస్తే మంచి స్క్రిప్ట్ రైటర్‌గా భవిష్యత్ ఉంటుందనిపిస్తోందని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అపహాస్యం చేశారు. శుక్రవారం సిఎల్పి కార్యాయలంలో విలేఖరులతో మాట్లా డుతూ ఎన్నికలకు నెల రోజుల ముందు మహేశ్వర్ రెడ్డి బిజెపిలో చేరి, మోదీ, అమిత్ కు మూటలు మోస్తే ఆయనకు శాసనసభా పక్ష నేత గా అవకాశం ఇచ్చారని విమర్శించారు. రాజా సింగ్ వరుసగా మూడు పర్యాయాలు గెలిచినప్పటికి ఆయన ఎల్పి కుర్చీని మహేశ్వర్ రెడ్డి తెచ్చుకున్నా బిజెపికి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా మహేశ్వర్ రెడ్డి మాటను వినరు కనీసం ప్రోటోకాల్ కోసమైన వారు పక్కన వచ్చి కూర్చోరని ఎద్దేవా చేశారు. “తెలంగాణ రాష్ట్ర బిజెపిలో సవాలక్ష గొడవలున్నాయనీ ఉన్న పది ఇరువై మందికి మీలో మీకే సఖ్యత లేదు మీ పరిస్థితి అయోమయంగా ఉంది.. ఎప్పుడు ఎవరిని ఖతం చేయాలా అని ఇంకొకరు అవకాశాలకోసం ఎదురు చూస్తున్నారు” అంటూ బిజెపి అనైక్యతను వివరించారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటనకు వస్తే ఎప్పుడు వచ్చాడో ఎప్పుడు పోయాడో తెలియదనీ అన్నారు. బిజెపి ఎమ్మెల్యేల్లో నలుగురు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ లో చేరతారని సునిల్ బన్సల్ నివేదిక ఇచ్చాడనీ ఇంకో ముగ్గురు మూడో స్థానానికి పడిపోతాడని జోస్యం చెప్పాడనీ, మహేశ్వర్‌రెడ్డి కూడా నిర్మల్‌లో మూడో స్థానానికి పడిపోతాడని సునీల్ బన్సల్ నివేదిక ఇచ్చాడనీ ఆయన తెలిపారు. నిర్మల్ లో బిఆర్ఎస్ రెండో స్థానంలో ఉంటుందని మహేశ్వర్ రెడ్డి వాళ్ల ములాఖత్ గురించి చెప్పకనే చెపుతున్నాడనీ అన్నారు.

## ఇలా ఉంటే.. సాగునీరు అందేదెలా...?

### -పిచ్చి మొక్కలతో కప్పేసిన కాలువ
### -వెయ్యి ఎకరాల సాగుకు రైతన్నలు ఎదురుచూపులు

వీరఘట్టం, జూలై 3, ప్రభాతవార్త :



ఇక్కడ కాలువ ఉండాలే... ఎక్కడబ్బా..? ప్రతి ఏడాది ఈ కాలువ ద్వారానే తమ పొలాలకు సాగునీరు అందేదే... అంటూ కాలువను వెతకటం ప్రారంభించారు రైతులు. పెద్దపెద్ద తుప్పలతో కప్పిపోయి, ఆకారాన్నే కోల్పోయిన కాలువను ఎట్టకేలకు కనిపెట్టి హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు మండలంలోని నడిమికెళ్ల, విక్రమపురం ,చిట్టపులివలస గ్రామాల రైతులు. నడిమికెళ్ల నుండి వెళ్లే ఈ సాగునీటి కాలువను అధికారులు పూర్తిగా విస్మరించడంతో ఆ కాలువ అంతా పెద్ద పెద్ద పిచ్చి మొక్కలతో నిండిపోయి సాగునీరు వెళ్లేందుకు అవకాశం లేని విధంగా తయారైంది. ప్రతి చోట ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలను అభివృద్ధి చేస్తుంటే ఇక్కడ మాత్రం అటువైపు చూసిన దాఖలాలు మాత్రం లేవు. నీటిపారుదల శాఖ అధికారులు కూడా తమకేమీ కాదులే అన్నట్టు వ్యవహరించడంతో నేడు ఈ పరిస్థితికి మూల కారణం అయ్యింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సాగునీరు తమ పొలాలకు ఏ విధంగా వస్తుందోనని రైతులు ఇప్పటినుండే లబోదిబోమంటున్నారు. ఈ కాలువ ద్వారా నడిమికెల్ల, విక్రమపురం, చిట్టలివలస గ్రామాలలో సుమారు 1000 ఎకరాల వరకు సాగునీరు అందువలసి ఉంది. అయితే ఈ కాలువ స్వరూపమే పూర్తిగా మారిపోవడంతో వారంతా ఏం చేయాలో అయోమయ పరిస్థితిలో ఉన్నారు. రైతన్నల కోసం అండగా ఉంటామని ఊకదంపుడు ప్రసంగాలు ఇస్తున్నారే తప్ప, ఇటువంటి విషయాల్లో వారు కూడా పట్టించుకోకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కూడా స్పష్టంగా తెలుస్తుందని, ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లు ఉంది ఈ కాలువ తీరు నాగావళి నది ద్వారా రైతులకి అవసరమయ్యే సాగునీటిని విడుదల చేసినప్పటికీ వీరి భూములకు మాత్రం సాగునీరు ఎప్పుడు అందుతుందోనని వాళ్లంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు ప్రజా ప్రతినిధులు కల్పించుకొని ఈ కాలువను బాగు చేయించి సాగునీరు అందేలా చూడాలని రైతన్నలు కోరుతున్నారు.



## వేలం పాటదారులు వీరే...

కోటబొమ్మాళి, జూలై 3 ప్రభాతవార్త:

స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో టెక్కలి దేవాదాయశాఖ కార్యనిర్వాహాధికారి టి.పి. మనశ్విని ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులకు పోటోలు, రక్షలు, త్రాళు విక్రయించుకొనేందుకు, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు, జాకెట్టు ముక్కలను, అలాగే కొబ్బరి చెక్కలు వసూలు చేసుకొనే హక్కు కొరకు కొత్తమ్మతల్లి దేవస్థానం ఈవో వాకచర్ల రాధాక్రిష్ణ బహిరంగ వేలం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 2028 జూలై 14వ తేదీ వరకు త్రాళ్లు, రక్షలు, ఫోటోలు, యంత్రములు విక్రయించేందుకు కోటబొమ్మాళికి చెందిన జలుమూరు రాజేష్ రూ.3,82,800లకు పాటను సొంతం చేసుకున్నారు. అలాగే అగస్టు 31, 2026 నుంచి జూలై 31, 2027 వరకు చీరలు, జాకెట్టు ముక్కలు స్వాధీనం చేసుకొనేందుకు కోటబొమ్మాళికి చెందిన దండాసి హేమలత రూ.1,05,700లకు పాలను సొంతం చేసుకున్నారు. అలాగే ఈ సెప్టెంబర్ ఒకటి నుంచి 2027 ఆగస్టు 31వ తేదీవరకు కొబ్బరి చెక్కలు స్వాదీనం చేసుకునేందుకు టెక్కలికి చెందిన యర్ర రాము రూ.3,08,800లకు పాటను సొంతం చేసుకున్నారని ఈవో తెలిపారు. ఈ మూడు పాటలపై గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.21 వేలు అదనంగా ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, సభ్యులు మంచాల వెంకటరావు, దేవాది లక్ష్మణరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టెక్కలిలో ఘనంగా జనతా వారధి ప్రారంభం

టెక్కలి, జూలై 3 ప్రభాతవార్త:



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమాన్ని శుక్రవారం టెక్కలి బీజేపీ కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమం టెక్కలి బీజేపీ మండల అధ్యక్షులు జర్జాన రాంజీ ఆధ్వర్యంలో నిర్వహించగా, జనతా వారధి ఇన్‌చార్జ్‌గా ఆకుల ప్రకాష్ వ్యవహరించారు. నిర్వహణ బాధ్యతలను కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నడుపూరి లక్ష్మీనారాయణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జనతా వారధి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సంబంధిత ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల సమస్యల పరిష్కారంలో ఈ కార్యక్రమం వారధిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, మండల కార్యదర్శి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు నాగేంద్ర, కూన రమణ, గిన్ని తారక్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్టోక్‌తో కొత్తమ్మతల్లి జూనియర్ సహాయకుడు మృతి



కోటబొమ్మాళి, జూలై 3, ప్రభాతవార్త:

స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో జూనియర్ సహాయకులుగా పని చేస్తున్న మండలం కమలనాభపురం గ్రామానికి చెందిన దుంపల కృష్ణారావు (61) గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. కృష్ణారావు నెల రోజులు క్రితం బ్రెయిన్ స్టోక్ రావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మృతుడుకు భార్య విష్ణుప్రియ, వివాహితులైన కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. కృష్ణారావు మృతి పట్ల ఈవో వాకచర్ల రాధాక్రిష్ణ, ఆలయ పాలకమండలి చైర్మన్ కోరాడ గోవిందరావు ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు.

## శ్రీవెంకటేశ్వర నగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాజాం, జూలై 3, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీ-చీపురపల్లి రోడ్-గాయిత్రి కాలనీ ఆనుకొని ఉన్న లే అవుట్ నందు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సకాలంలో హౌస్, ప్రాపర్టీ టాక్స్ మొదలగు అన్ని రకాల పన్నులు చెల్లిస్తూ నేటికి ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గతంలో విద్యుత్ శాఖ వారు ఏర్పాటు చేసిన విద్యుత్ పంపిణీ బోర్డు డి బి ను వివిధ రాజకీయ కారణాలతో తిరిగి వెనక్కు తీసుకొని వెళ్లారని, ప్రస్తుతం శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీలో విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ బోర్డు డి బి లేకపోవడం ఓల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సరైన డ్రైనేజీ వ్యవస్థ, మెరుగైన రహదారులు లేకపోవడం ముఖ్యంగా వర్షాకాలంలో నీరు నిల్వవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. రహదారులు సరిగా లేకపోవడం వల్ల ప్రయాణం కష్టసాధ్యంగా మారిందని, ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ చొరవ తీసుకుని శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీ అభివృద్ధి కోసం వెంటనే తగు చర్యలు తీసుకుని విద్యుత్ డిబి, డ్రైనేజీ వ్యవస్థ, సిమెంట్ రహదారులు వంటి ప్రాథమిక వసతులు కల్పించవలసిందిగా ప్రజా దర్బార్‌లో శ్రీవెంకటేశ్వర నగర్ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం వినతిపత్రం సమర్పించారు.

## అన్న క్యాంటీన్‌కు రూ.10వేలు వితరణ

కోటబొమ్మాళి, జూలై 3, ప్రభాతవార్త:

పేదవాడికి రూ.5లకే ఆకలి తీరుస్తున్న స్థానిక అన్నక్యాంటీన్‌కు రాష్ట్ర కళింగకోమటి కార్పోరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, బ్రదర్స్ రూ.10వేలు వితరణగా శుక్రవారం అందజేశారు. గోవిందరాజులు మాతృమూర్తి బోయిన ప్రేమకుమారి ప్రథమ వర్ధంతి సందర్భంగా గోవిందరాజులు బ్రదర్స్ ఈ ఆర్థిక సహాయం అందజేశారని అన్నక్యాంటీన్ నిర్వాహకులు లాడి శ్రీనివాస్ తెలిపారు.

## ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీఓకు వినతి

టెక్కలి, జూలై 3, ప్రభాతవార్త:



టెక్కలి పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ 18 వీధుల్లో నెలకొన్న తొమ్మిది ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ లింగరాజు చిట్టిబారికి బిజెపి స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ వినతి పత్రం ఎంపీడీఓకు అందజేశారు. వీధి దీపాలను వెంటనే మరమ్మత్తు చేయించి, కొత్త దీపాలు ఏర్పాటు చేయాలి. డ్రైనేజీలను శుభ్రం చేయించి, ప్రతి వారం బ్లీచింగ్ చల్లే ఏర్పాటు చేయించాలి. అంగన్వాడీ కేంద్రం వద్ద చెత్త వేయకుండా నిషేధ బోర్డు పెట్టి, ఆ ప్రాంతాన్ని వెంటనే శుభ్రం చేయించాలి. కాలనీలో రోజువారీ చెత్త సేకరణకు 'ప్రతివీధులలో చెత్త బండి' ఏర్పాటు చేయించాలి. అన్ని వీధులకు త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి. రోడ్లపై ఉన్న మట్టి కుప్పలను తక్షణమే తొలగించాలి. ఈ పనుల పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి, శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఆరోగ్యాన్ని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని హృదయపూర్వకంగా వినతిపత్రం ద్వారా కోరారు.

## కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం

### ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



ఆమదాలవలస, జూలై 3,(ప్రభాతవార్త):

కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారులకు ఆనందం కలుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన స్పౌజ్ 53 పింఛన్లను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ లబ్ధిదారులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలన్నారు. నియోజవర్గం అభివృద్ధి తన ధ్యేయమని అన్నారు. ప్రతినెల లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించడంతో వారి ఇళ్లలో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. కుటుంబంలో భర్తకు పెన్షన్ వచ్చి ఆ భర్త మరణిస్తే వెంటనే భార్యకు పెన్షన్ బదిలీ చేసే విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. దీనివలన అర్హులైన ప్రతి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు అందేలా కృషి చేస్తుందని అన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల లబ్ధిదారులందరికీ ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంపుదల చేసి గడప వద్దకే అందించడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలను తూచా తప్పకుండా అమలు చేశామని భరోసా ప్రజల్లో కల్పించడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాగుతోందన్నారు. అవినీతిరహిత పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, రాష్ట్రకాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పిఏసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపదరావు మురళీధర్, బోయిన సునీత, తమ్మినేని అమర్నాథ్, నాని, అన్నెపు రాము,కూన ఆంజనేయులు, నాగళ్ళ మురళీధర్, కమిషనర్ తమ్మినేని రవి, ఎంపీడీవో మెట్ట వైకుంతరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

### మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత



ఆమదాలవలస, జూలై 3, (ప్రభాతవార్త) :

ప్రజా సమస్యల కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళీధర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపు మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకొని వెళ్తామని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే రవికుమార్ ఉంటారని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని అన్నారు. ప్రజాపాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కూన ఆంజనేయులు, నాగళ్ళ మురళీధర్, తమ్మినేని శ్రీనివాసరావు, పీవీకే రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## డ్రై డే ఫ్రై డే సందర్భంగా పలు పంచాయతీలు సందర్శన

కవిటి, జూలై 3, ప్రభాతవార్త:



డ్రై డే ఫ్రై డే సందర్భంగా కవిటి మండలంలో గల లండారిపుట్టుగ, గొర్లపాడు, కరాపాడు, పంచాయతీలను కవిటి ఎంపీడీఓ సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలు మహిళలను ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశాన్ని వివరించారు. మన చుట్టూ ఉన్న పరిసరాల్ని ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి, తడి చెత్త,పొడి చెత్తను ఎలా మనం తొలగించాలి వివరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఎఎనఎంలు, పీడీఓలు పాల్గొన్నారు.

## ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు



ఇచ్ఛాపురం, జూలై 3, ప్రభాతవార్త:

మండలం, మండపల్లి ఆంధ్ర బాపిస్ట్ చర్చ్‌లో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న క్రైస్తవ సంఘాలు పాల్గొన్నాయి. యేసు క్రీస్తు శిష్యులలో 12 మందిలో ఒకరు పరిశుద్ధతతో భారతదేశానికి వచ్చి మతవ్యాప్తి చేసారని అన్నారు. యేసుక్రీస్తు చూపిన ప్రేమ త్యాగము పంచాలని అన్నారు. కార్యక్రమంలో గొల్ల వీధి చర్చ్ అధ్యక్షుడు ప్రత్తి విజయ్ కుమార్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టరు ప్రత్తి అన్వేష్, ఫాస్టర్ ప్రకాశరావు, డాక్టర్ అబ్రహామ్ కొత్తపల్లి, యు.వి. జాన్సన్, భీమో బేహర, దడ్డ ఆనందరావు, సుందర్ రాజ్, సి.వీర, డేవిడ్ కుమార్, డాక్టర్ జార్జి ముల్లర్ రెవ. రాడా విజయ కుమార్, కె.వి. సాలమన్, ఉంకరి రమేష్, నవీన్ కుమార్ జెన్నా, బొమ్మిది జోగారావు, ప్రత్తి వీరకుమార్, ఎ.జాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోంపేట మండపల్లిలో సీతయ్య ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలకు కిరాణా సరుకులు కిట్లు పంపిణీ చేశారు.

## మనోజ్ కుమార్ సేవలు ఆదర్శం

### ఇన్‌చార్జి బ్రాంచ్ మేనేజర్ బాలకృష్ణ



ఇచ్ఛాపురం, జూలై 3, ప్రభాతవార్త:

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పంజా వీధి బ్రాంచ్ మేనేజర్ మనోజ్ కుమార్ వర్మ సేవలు ఆదర్శమని ఇన్‌చార్జ్ బ్రాంచ్ మేనేజర్ బాలకృష్ణ అన్నారు. ఆయన స్కేల్ 3 బ్రాంచ్ మేనేజర్‌గా పదోన్నతిపై రాజమండ్రికి బదిలీపై వెళ్లారు. ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లోకల్ సెక్రటరీ సమదర్శి, నర్తు సంతోష్, కాతిల ప్రసాద్ రెడ్డి, మోహన్ ,కోమల్, జగన్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ డిజిటైజేషన్ పరిశీలన

సంతకవిటి, జూలై 3, ప్రభాతవార్త :



సంతకవిటి మండలం మండవ, కురిటి, స్వర్ణ గ్రామాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ డిజిటైజేషన్‌ను రెవెన్యూ పరిశీలకులు కృపారావు శుక్రవారం పరిశీలించారు. బిఎల్వోలు పెండింగ్‌లో ఉన్న ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా డిజిటైజేషన్ పూర్తి చేయాలన్నారు. డిజిటైజేషన్ పురోగతిని గంట గంటకు సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రేపు ఎల్లుండి ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక డిజిటైజేషన్ జరుగుతున్నట్లు వెల్లడించారు.

# శ్రీకాకుళం వార్త



## రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు



### ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన

ఆముదాలవలస, జూలై 3, ప్రభాతవార్త :

అర్హులైన రైతులందరికీ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. కట్టాచారులపేట గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో తప్పులు జరిగాయని, రైతుల పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేయడం రైతులు అభద్రత భావానికి లోనయ్యారని తెలిపారు. అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే తప్పులు సరిదిద్దామని ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతుల పేరుతో తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల భూములకు శాశ్వత గుర్తింపు కల్పించడంతో పాటు భూ యాజమాన్య హక్కులకు మరింత భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తోందన్నారు. ఈ పాస్ పుస్తకాలు రైతులకు చట్టపరంగా మరింత బలాన్ని ఇవ్వడమే కాకుండా భూములకు సంబంధించిన అన్ని ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు ఉపయోగపడతాయని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రెవెన్యూ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువ చేసేలా చర్యలు తీసుకుంటోందన్నారు. భూముల రికార్డుల నిర్వహణలో సాంకేతికతను వినియోగిస్తూ రైతులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారం, రికార్డుల నవీకరణ, వారసత్వ మార్పులు, ఇతర రెవెన్యూ సేవలను సకాలంలో అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే రవికుమార్ అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సేవ గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. అనంతరం ఏజీపీ పైడి వరహ నరసింహులు ఎమ్మెల్యే రవికుమార్ కు సాలువ కప్పి పుష్పాలతో సన్మానించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, కలియుగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, ఏజీపీ పైడి వరహ నరసింహులు, తమ్మినేని అమర్నాథ్, నాని,వండాన ఉదయ్ కుమార్, బెండి దశరథ,బెండి శ్రీనివాసరావు,అన్నేపు భాస్కరరావు, నేతింటి జ్యోతిశ్వరరావు, హనుమంతు బాలకృష్ణ, తాసిల్దార్ సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై వైఎస్సార్‌సీపీ సమీక్ష



కొత్తూరు, జూలై 3 ( ప్రభాత వార్త ) :

మండలంలోని గూనభద్ర ఆర్అండ్ఆర్ కాలనీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతంతో పాటు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు.సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఎల్ఏ ఇన్‌చార్జులు, మండల బూత్ కమిటీ కన్వీనర్లు, బీఎల్ఏలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు, అనర్హతలు లేకుండా బీఎల్ఏలు, బూత్ కమిటీ కన్వీనర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## కొత్తూరులో వైభవంగా ప్రపంచ మెకానిక్ డే వేడుకలు



కొత్తూరు, జూలై 3 ( ప్రభాత వార్త ) :

ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా కొత్తూరులో శ్రీ విజయదుర్గ మెకానిక్ యూనియన్ అసోసియే షన్ ఆధ్వర్యంలో శుక్ర వారం ఘనంగా వేడు కలు నిర్వహించారు. మండలంలోని మెకానిక్‌లు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశం నిర్వహించి, అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకు లు మాట్లాడుతూ వాహనాల నిర్వహణలో మెకా నిక్‌ల సేవలు సమాజానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక మార్పులను అందిపుచ్చుకుని నూతన నైపుణ్యాలను పెంపొందిం చుకోవడం ద్వారా వృత్తిలో మరింత రాణించాలని సూచించారు. మెకానిక్‌ల ఐక్యతే తమ బలమని, వృత్తి గౌరవాన్ని కాపాడుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా కేక్ కట్ చేసి పర స్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో శ్రీ విజయదుర్గ మెకానిక్ యూనియన్ అసో సియేషన్ గౌరవ అధ్యక్షుడు చంద్రరావు, పైల భాస్కరరావు, సన్నిబోయిన వెంకటరమణ, చోడవరపు భాస్క రరావు, పొగిరి లక్ష్మణ్, జి.రాంబాబు, ఎ.దేవ నాయుడు,వి. రమేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## విచారణ ముగిసేంత వరకు ప్రచారాలు చేయొద్దు

### - పైడిభీమవరం పంచాయతీ కార్యదర్శి అజయ్ బాబు


రణస్థలం, జూలై 3, ప్రభాతవార్త :

నాపై వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యమని పైడిభీమవరం పంచాయతీ కార్యదర్శి పుట్ల అజయ్ బాబు తెలిపారు. పైడిభీమవరం పంచాయతీకి చెందిన సాధారణ నిధుల దుర్వినియోగం జరిగిందని వీటికి సంబంధించిన రికార్డులను తారుమారు చేసినట్లు శుక్రవారం పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పంచాయతీకి చెందిన నిధులపై విచారణ పూర్తయ్యే వరకు వేచి చూడాలి కోరారు. కనీసం నా అనుమతి లేకుండా నా వ్యక్తిగత నివాసంలోకి అనధికారికంగా చొరబడి, ఫోటోలు తీయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను భంగం కలిగించడమేనని తీవ్రంగా ఖండించారు. ఒక సగటు ఉద్యోగిగా నా పరిస్థితిని, భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకోవాలని, నిధుల దుర్వినియోగంపై జరుగుతున్న విచారణ పూర్తిగా ముగిసేంత వరకు ఎలాంటి కథనాలు ప్రచురించవద్దని ఆయన కోరారు.

ఫ్యాషన్ ఫ్యాషన్



# పరువాల రెమ్మలు







ఒకప్పుడు పండుగలు, పెళ్లిళ్ల అంటూ చిన్న పిల్లల నుంచి టీనేజీ అమ్మాయిలకు గుర్తుకు వచ్చేది పరికిణీ-జాకెట్టు మాత్రమే. అమ్మమ్మల పెట్టెల్లో దాచిన పట్టులంగాలు, మెరిసే జాకెట్లు ఆనాటి సౌందర్యానికి నిదర్శనాలు. కాలం మారేకద్దీ వాటి స్థానంలో గాగ్రాచోళీలు, లాంగ్ స్కర్ట్‌లు, క్రాప్‌టాప్‌లు-లెహంగాలు.. ఇలా ఎన్నో కొత్త ఫ్యాషన్‌లు వచ్చిచేరాయి. అయితే ఈ తరం అమ్మాయిలు ఆపాత మధురాల్నే ఇష్టపడు తుంటంతో మళ్లీ ట్రెండ్ అవు తున్నాయి. అప్పట్లోలా ఇవి కేవలం టీనేజీ అమ్మాయిలకే పరిమితం కావడం లేదు. యువతులూ వీటిని ఇష్టపడుతున్నారు. డిజైనర్లు సైతం భిన్న ప్యాబ్రిక్స్, ఆధునిక కటింగ్స్‌తో వీటిని సరికొత్తగా డిజైన్ చేస్తున్నారు. కొత్తవే కాదు.. పాతకాలపు చీరల్నీ ఇలా మార్చేసి స్టైయినబుల్ ఫ్యాషన్‌కి ప్రాధాన్యం ఇస్తున్నారు. దాంతో ఈ పరికిణీ-జాకెట్లు పార్టీల నుంచి పెళ్లి వేడుకల వరకూ దేనికైనా స్టేట్‌మెంట్‌లుక్ ఇస్తున్నాయి.

## సర్పయాగం

జనమేజయుడు ఎంతో మంచి రాజు ' ఓ రాజా నీ తండ్రిని తక్షకుడు చంపాడు. నీవు సర్పయాగాన్ని చేసి తక్షకుడిని, అతని సహచర పాములన్నిటినీ సంహరించు అని అతని మంత్రులంతా సలహా ఇచ్చారు. జనమేజయుడు శ్రేష్ఠులను పిలిపించి శాస్త్రంలో చెప్పిన కొలతల ప్రకారం హోమ గుండాలను, యాగశాలను ఏర్పాటు చేసి మంచి ముహూర్తంలో యాగాన్ని ప్రారంభించాడు. సర్పా లన్నీ వచ్చి హోమగుండంలో పడి భస్మమయ్యాయి. అంతలోనే ఆస్తీకుడు వచ్చి, జనమేజయరాజును, మెప్పించి, ఒప్పించి సర్పయాగాన్ని ఆపేశాడు. అగ్ని గుండంలో పడటానికి సిద్ధంగా వున్న తక్షకుడు యాగం ఆగిపోవటం వల్ల బ్రతికి పోయాడు. ఇది శ్రీ మదాంధ్ర మహా భారతము, ఆది పర్వములో వున్న కథ (పుటలు 29-32- రామకృష్ణమఠ ప్రచురణ). దీని నుంచి మనం ఈనాడు గ్రహించవలసిన ముఖ్య అంశా లెన్నో ఉన్నాయి. మంచి వాడైన రాజు మంత్రులి చ్చిన దుష్ట సలహాలను పాటించ దలిచాడు. తన తండ్రిని చంపినది తక్షకుడైతే ఏ పాపమూ చేయని ఇతర పాములను కూడా చంపమని చెప్పిన మంత్రులను దండించాల్సి ఉంటుంది. కానీ వారి సలహాకు తల ఒగ్గాడు. శ్రేష్ఠులు వాస్తు శాస్త్రం ప్రకారం శుభ ముహూ ర్తంలో పూజాది కార్య క్రమాలతో యాగాన్ని ప్రారంభించినా ఏ లక్ష్యంతో సర్పయాగాన్ని చేశాడో ఆ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. తక్షకుడు మరణించ లేదు. మరి మహాభారత కథ ఏ నీతిని బోధిస్తున్నది? వాస్తు, జ్యోతిష్యం ఇలా మనం పరిగణనలోకి తీసుకోవలసినది? అందులో ఆరితేరిన ప్రవీణులు ఆ శాస్త్రాల్లో చెప్పబడినట్టు ఉత్తములైన ఋత్విక్కులతో యాగాన్ని చేయిస్తే లక్ష్యం నెరవేరలేదే? వ్యాస భగవానుని, భారతేతి హాస హృదయాన్ని మనం పసిగట్టక, సత్యం కల్పానికి కాక, దూరాలోచనల కు ప్రాధాన్యమిస్తే మూర్ఖులమే అవుతాం. దుష్ట సంకల్పంతో చేయబడే యజ్ఞ యాగాదులు కూడా ఫలించవు. భారతం నేర్పే నీతి అదే. అదే విష యాన్ని సహృదయుడైన ఒక వాస్తు పండితుడు రాజుకు ముందే సూచించాడు కూడా తక్షకుడిని చంపాలని యాగం చేస్తే, తక్షకుడుతప్ప అమాయకులంతా చచ్చారు. ◻

## ఛాయ్ బిస్కెట్లు ..



**బిస్కెట్లలో బోలెడన్ని రకాలుంటాయి కదూ!** తమ తమ ఇష్టాలను బట్టి నచ్చేవి కొనుక్కుంటారు. అంతే తప్ప బిస్కెట్లు మన తయారు చేసుకోవడం కొంచెం తక్కువ. ఈ గోధుమపిండితో చేసే డైజెస్టివ్ బిస్కెట్లు చాలా సులువుగా ఇంట్లోనే చేసుకోవచ్చు. దీని కోసం స్వచ్ఛమైన గోధుమపిండి అరకిలో, పలు, పంచదార, రవ్వ, ఎండు కొబ్బరి ఒక్కోటీ కప్పు చొప్పున, సోంపు ఒకటిన్నర స్పూన్, నెయ్యి 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి. ఒక పాత్రలో ఈ పదార్థాలు అన్నిటినీ వేసి బాగా కలపాలి. మెత్తటి ఈ పిండితో కొంచెం మందమైన రొట్టెలు చేయాలి. దాని మీద గ్లాసు లేదా మూతతో నొక్కి గుండ్రటి ఆకృతులు వచ్చేలా కట్ చేయాలి. వాటి మీద ఫోర్క్‌తో గుచ్చి, రంధ్రాలు చేయాలి అన్నీ పూర్తయ్యాక. కాగుతున్న నూనెలో వేయించుకుంటే సరి. కరకరలాడే బిస్కెట్లు తయారైపోతాయి. ఇవెంతో రుచీ, ఆరోగ్యం కూడా. నచ్చితే మీరూ చేసి చూడండి. పిల్లలూ పెద్దలూ అందరూ ఇష్టంగా తింటారు. ఇవి చాయ్‌లోకి మరింత బాగుంటాయి.

## పెద్దల సంరక్షణ చూద్దాం.. !

**ఇంట్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మారుతున్న సీజన్ తగ్గట్లుగా జాగ్రత్తలు తీసుకొంటూ పరిరక్షించాలి. వర్షాకాలంలో వారినెలా సంరక్షించాలో చూద్దాం.**

కాచి చల్లార్చిన లేదా గోరువెచ్చని నీటిని తరచూ తీసుకోవడం అలవాటు చేయాలి. సాధారణ వర్షా కాలంలో నీటి ద్వారా కలరా, టైఫాయిడ్, డయేరియా వంటి అనారోగ్యాలు దరి చేరే ప్రమాదం ఉంది. దీని నిరోధించాలంటే వేడి నీటిని మాత్రమే తాగాలి. స్నానానికి కూడా గోరువెచ్చని నీటిని ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు ఉండాలి. రయిన్‌కోటు వంటి ఏర్పాట్లు ఉండేలా జాగ్రత్త పడాలి.



వ్యాధులెక్కువగా ప్రబలే సీజన్ కావడవంతో వ్యాధినిరోధక శక్తిని పెంచేలా ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు, అతి చల్లదనం. తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజ ధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు అతి చల్లదనం, తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం, దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలి. తీపి, నూనె పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఇంటి భోజనానికి పెద్దపీట వేసేలా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు సహా పీచు ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యతనివ్వాలి. దీంతో జీర్ణశక్తి మెరుగు పడుతుంది. త్వరగా అనారోగ్యాలు దరిచేరవు. వీరు విశ్రాంతి తీసుకునే గది, దాని చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉండాలి. గదికి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. లేదంటే వాటిపై దోమలు పెరిగే ప్రాదం ఉంది. గదిలో వెలుతు ఉండేలా చూడాలి. ఇండోర్ ప్లాంట్స్ పెంపకం మంచిది. వీరు నిద్రపోయే గది వెచ్చగా ఉంటే రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. దోమ లెక్కువగా ఉండే ప్రాంతమైతే ఈ సీజన్‌లో కిటికీలకు నెట్ వేయడం మంచిది. లేదంటే దోమకాటు కూడా తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తుంది. ◻

## కాఫీతో.. ఎంతో!





డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

కెఫిన్ వల్ల శరీరంలో ఒక రకమైన వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధులు తగ్గ ముఖం పట్టే అవకాశం ఉంది. కెఫిన్ న్యూరోట్రాన్సి మీటర్స్ అయిన నార్ ఎడ్రినాలిన్, అసిటైల్ కోలిన్, డోపమైన్ స్థాయిల్ని పెంచి ఏకాగ్రత, చురుకుతనం జ్ఞాపకశక్తి మెరుగుపడి, మెటబాలిక్ రేట్ పెరిగి తాత్కాలికంగా హుషారుగా ఉండేటట్లు చేస్తుంది థర్మోజెనిసిస్ (శరీరంలో వేడి)ని మెరుగు పరుస్తుంది. వృద్ధాప్యం దూరమవుతుంది. స్ట్రోక్ 22.25% గుండె వ్యాధులు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగవుతుంది. మెదడు సిఆర్‌సిబిఐ అనే ప్రోటీన్ ఉత్పత్తి 600 కేలరీలు ఖర్చు అవడమే కాక జ్ఞాపకశక్తికి మంచిది. అంతేకాకుండా వత్తిడి, తలనొప్పి, బద్ధకం తగ్గుతుంది. క్రొవ్వుని కరిగించడం వల్ల గుండె క్రమబద్ధంగా పనిచేసి గుండెకు రక్షణ కల్గిస్తుంది. పక్షవాతం రాదు. హానికరమైన కాలేయ ఎంజైమ్‌ల స్థాయిల్ని తగ్గించడం వల్ల లివర్ సిర్రోసిస్, గాల్‌స్టోన్స్, పాంక్రియా టైటిస్, ఫ్యాటీ లివర్, లివర్ వ్యాధులు కొంతవరకు తగ్గుతాయి. టైప్-2 డయాబెటిస్, కొనరీ ఆర్టరీ డిసీజెస్, ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గిస్తుంది. ఆలోచనా సామర్థ్యాన్ని పెంచుతుంది. నర్వస్‌నెస్, డిమెన్షియా తగ్గుతుంది. స్థూలకాయుల్లో కొంతవరకు బరువు తగ్గుతారు. గుండె వైఫల్యాన్ని తగ్గిస్తుంది. అధిక ఆంటీ ఆక్సి డెంట్స్ వల్ల ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని డ్యామేజ్ కాకుండా కాపాడడం వల్ల డిఎన్ఎ బలంగా ఉడడం వల్ల ఓవేరియన్ ప్రోస్టేట్, గొంతు, థైరాయిడ్, గ్యాస్ట్రిక్, కోలన్ రెక్టల్, స్టమర్ కేన్సర్స్‌ని కొంత మేర తగ్గించడంలో, ఉపయోగపడతాయి. ఆపరేషన్స్ అయిన తర్వాత గ్యాస్ట్రిక్ కదలికలు, బవల్‌మూవ్ మెంట్స్‌ని కల్గిస్తుంది. ఇది నాన్ ఆల్కహాలిక్స్‌కి కొంత మేలు కల్గిస్తుంది. పార్కిన్‌సన్ డిసీజ్, ఆటిజమ్, మెంటల్ ఎలక్ట్‌నెస్‌కి మంచిది డిప్రెషన్ రోగుల్లో, మూడ్ ఛేంజ్స్ ఉన్నప్పుడు, మలబద్ధకం, అధిక ఆకలిని తగ్గిస్తుంది.

**స్త్రీలలో కాఫీ చేసే మేలు :** ఆల్జీమర్స్ బాధపడే అమెరికన్స్‌లో మూడింట రెండువంతులు మహిళలున్నారు. మహిళల్లో మరణానికి నాల్గవ ప్రధాన కారణం స్ట్రోక్, డిప్రెషన్ 8% తగ్గుతుంది. 23% స్త్రీలలో పెద్ద ప్రేగు కేన్సర్ ఎండోమెట్రియల్ కేన్సర్ థైరాయిడ్, రొమ్ము, కలోరెక్టల్ కేన్సర్స్ పిరియాడ్స్ అగిపోయిన తర్వాత వచ్చే అవకాశాల్ని తగ్గిస్తుంది. వినికిడి శక్తిని పెంచుతుంది. గర్భిణీలు కాఫీ అలవాటుని మానివేస్తే మంచిది. మానివేయాని ఎడల రోజుకి 1-2 కప్పులు తీసుకోవాలి. ఎక్కువగా, ఎక్కువసార్లు తీసు కుంటే అబార్షన్ కావడం, నెలలు నిండకుండా కాన్పు కావడం, తక్కువ బరువు పిల్లలు పుడతారు. బాలింతలు పాలు ఎక్కువగా వేసుకొని కాఫీ డీకాషన్ తక్కువగా ఉండేలా ఒక కప్పు వరకు తీసుకోవచ్చు. క్రొవ్వు కణాల్ని డీహైడ్రేట్ చేసి సెల్యులైట్ రూపాన్ని తాత్కాలికంగా తగ్గిస్తుంది.

**సౌందర్యపోషణలో కాఫీ పాత్ర:** కాఫీలోని కెఫిన్ మీ చర్మాన్ని బిగుతుగా చేసి వాపుల్ని తగ్గిస్తుంది. రక్త ప్రసరణని మెరుగుపరిచి మృదువైన చర్మ ఆకృతిని ప్రోత్సహిస్తుంది. పొడిచర్మంగలవారు వారానికొకసారి, జిడ్డు చర్మం గలవారు వారా నికి 2-3సార్లు కాఫీపొడిని స్క్రబ్‌గా వాడడం వల్ల చర్మంకాంతి వంతంగా అవుతుంది. కాఫీ ఫేస్ మాస్క్‌లలో ముఖం, చేతులపై సన్ ట్యాన్‌ని, గీతలు, మొటిమలు, మచ్చలు, ముడతలు, వృద్ధాప్య సంకేతాలు తగ్గుతాయి. చర్మకేన్సర్ రాకుండా నిరోధించే శక్తి కాఫీకి ఉంది. కాఫీలోని క్లోరోజెనిక్ ఆసిడ్, ట్రిగోనెల్లిన్, కెఫిక్ ఆసిడ్, డైఫినాల్స్ వంటి ఆంటి ఆక్సిడెంట్స్ వల్ల ముఖం, చర్మ సౌందర్యం ఇనుమడిస్తుంది. ◻

## 'VISA- వింటారా సరదాగా' రెండో గీతం విడుదల



'VISA - వింటారా సరదాగా' చిత్ర బృందం రెండో గీతం 'చింగారి'ని విడుదల చేసింది. హృదయాన్ని హత్తుకునే బాణీలు అందించడంలో పేరుగాంచిన విజయ్ బుల్గానిన్ అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చిన ఈ మెలోడీ గీతాన్ని, తన ప్రత్యేకమైన గానంతో శ్రోతలను అలరించే సిద్ శ్రీరామ్, లిప్సిక ఎంతో అందంగా ఆలపించారు. సనారే రచించిన 'చింగారి' పాట ప్రతి ఒక్కరి గుండెల్ని తాకేలా ఉంది. ప్రేమ లోని నిశ్శబ్ద వేదనను, మనసులో రగిలే భావోద్వేగాలను ఎంతో కవితాత్మకంగా ఆవిష్కరిస్తుంది. 'VISA వింటారా సరదాగా' చిత్రం ప్రతి అప్‌డేట్‌తో ప్రేక్షకుల్లో అంచనా లను భారీగా పెంచుతోంది. ఈ చిత్ర టీజర్ ఒక సరికొత్త కథనంతో, విదేశా ల్లోని తెలుగు విద్యార్థుల జీవితాన్ని ఆవిష్కరిస్తూ ప్రేక్షకు లను ఎంతగానో ఆకట్టుకుంది. తొలి గీతం 'అనగనగా అమెరికా' ఒక హుషారైన పాటగా నిలిచి, అన్ని వేదికల్లో అందరి మనసులను గెలుచుకుంది. ఇప్పుడు విడుదలైన 'చింగారి' పాటతో ఈ చిత్రం తనలోని రొమాంటిక్ కోణాన్ని ఆవిష్కరించింది. హృదయాన్ని తాకే స్వరాలు, సాహిత్యంతో ఈ పాట సంగీత ప్రియుల మనసులను గెలుచుకుంటోంది. నూతన దర్శకుడు ఉద్భవ్ రఘు దర్శకత్వంలో రూపొందు తున్న ఈ చిత్రంలో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, సత్య, వైవా హర్ష, గుండు సుదర్శన్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించను న్నారు. అమెరికాలోని తెలుగు విద్యార్థుల జీవితాల నేపథ్యంతో ఎంతో వైవిధ్యంగా, హృద్యమైన భావోద్వేగాలతో ఈ సినిమా రూపొందుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్టుగా సినిమాలు తీసే అభిరుచి గల నిర్మాతలు కావడంతో 'VISA - వింటారా సరదాగా' పై నమ్మకం మరింత పెరిగింది.

## 'బాలన్ ది బాయ్' పై మణిరత్నం ప్రశంసలు

గ్రాండియర్ ఫిలిం మేకింగ్ కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మించిన మూవీ "బాలన్ ది బాయ్". ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్‌తో "మంజుమ్మెల్ బాయ్స్" చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహించారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమా తెలుగులో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. హీరో నాగచైతన్యతో పాటు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీలు "బాలన్ ది బాయ్" సినిమాకు సపోర్ట్ గా నిలిచారు. మలయాళంలో డైరెక్టర్ ప్రియదర్శన్ అప్రిషియేట్ చేశారు. మరోవైపు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, జ్యోతిక దంపతుల ప్రశంసలు అందుకుంది మూవీ. తాజాగా లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం "బాలన్ ది బాయ్" సినిమాపై ప్రశంసలు కురిపించారు. "బాలన్ ది బాయ్" సినిమా స్పెషల్ స్క్రీనింగ్ కు హాజరైన డైరెక్టర్ మణిరత్నం ఈ చిత్రాన్ని తిలకించారు. ఈ సినిమా స్క్రిప్ట్ ను, నటీనటుల పర్ ఫార్మెన్స్ ను మణిరత్నం అభినందించారు. మణిరత్నం ప్రశంసలు ఎంతో విలువైనవిగా భావిస్తున్నట్లు మూవీ టీమ్ ప్రకటించారు.




## 'ఇమ్మోర్టల్' నుంచి 'లవ్‌వు లవ్‌వు రాకాసి' సాంగ్ రిలీజ్



మల్టీ ట్యాలంటెడ్ జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహార్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్' మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరుణ్ కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'లవ్‌వు లవ్‌వు రాకాసి' సాంగ్ రిలీజ్ చేశారు. యువతను అలరించే క్యాచీ ట్యూన్, ఉత్సాహ భరితమైన బీట్‌లతో రూపొందిన ఈ పాట ఇప్పటికే మంచి స్పంద నను అందుకుంటోంది. ఈ పాటకు సామ్ సి.ఎస్ అద్భుతమైన ట్యూన్ అందించగా, అరవింద్, రేష్మా శ్యామ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్ తో పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. ప్రేమలోని సరదా, అల్లరి భావాలను ప్రతిబిం బించేలా రాజ్‌శ్రీ సుధాకర్ సాహిత్యాన్ని అందిం చారు. మెలోడీ, బీట్, లిరిక్స్ సమన్వయంతో రూపొందిన ఈ పాటలో జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహార్‌ల మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డాన్స్ మూవ్‌మెంట్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్‌తో రూపొందిన ఈ గీతం సినిమా మీద అంచనాలను మరింత పెంచుతోంది.

## 'వదలా' జూలై 17న థియేటర్లలో రిలీజ్



వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు సస్పెన్స్, మిస్టరీ, బలమైన భావోద్వేగాలతో కూడిన సైకలాజికల్ థ్రిల్లర్ 'వదలా'లో ఇంటెన్స్ పాత్రలో కనిపించను న్నారు. అకెళ్ల వి. కృష్ణ దర్శ కత్వం వహిస్తున్న ఈ చిత్రంలో లయ, హృతిక శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చరిత చిత్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మిస్తున్న ఈ చిత్రం, ఇప్పటికే 'ఫస్ట్ గ్లింప్స్'తో ఆసక్తిని రేకెత్తించగా, టీజర్ అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం జూలై 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆకట్టుకునే కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. విడుదల తేదీ పోస్టర్ సినిమా మిస్టీరియస్ వాతావరణాన్ని ఆసక్తికరంగా ప్రతిబింబిస్తోంది. రెడ్ బ్యాక్ డ్రాప్ లో హృతికా శ్రీనివాస్ లోలోపల ఎన్నో రహస్యాలు దాచుకున్నట్లుగా కనిపించే ఎక్స్‌ప్రెషన్‌తో ఆకట్టుకుంటున్నారు. విడుదల తేదీ ఖరారైన నేపథ్యంలో రానున్న రోజుల్లో సినిమా ప్రమోషన్స్‌లో మరింత జోరు పెంచనున్నారు. త్వరలోనే థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి ఛోటా కె. నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కార్తీక్ కొడకండ్ల సంగీతం సమకూరుస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా, లక్ష్మీ భూపాల కథా రచయితగా, బజ్జా బ్రహ్మయ్య ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

తెర

## 'అమీర్ లోగ్' ను రిలీజ్ చేయబోతోన్న రానా 'స్పిరిట్ మీడియా'



'అమీర్ లోగ్' ను భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్న రానా 'స్పిరిట్ మీడియా' అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి రెడ్డి సోమ నిర్మాణంలో రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'అమీర్ లోగ్. ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా నటించిన ఈ చిత్రంలో వేద జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి పలువురు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటి వరకు ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతీ కంటెంట్ ఆడియెన్స్‌ని ఆకట్టుకుంది. ఫస్ట్ లుక్ పోస్టర్, రాహుల్ సిప్లిగంజ్ పాడిన అవ్వల్ దావత్ సాంగ్, టీజర్ ఇలా అన్నీ బజ్‌ను క్రియేట్ చేశాయి. యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా, అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ కామెడీ చిత్రంగా రాబోతోంది 'అమీర్ లోగ్'. రానా 'స్పిరిట్ మీడియా' ఈ 'అమీర్ లోగ్' మూవీ హక్కుల్ని సొంతం చేసుకుంది. ఈ మూవీని స్పిరిట్ మీడియా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోంది. ఈ చిత్రాన్ని చూసి.. అందులోని కంటెంట్ నచ్చి.. రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చింది. హైదరాబాద్ గల్లీలోని ముగ్గురు స్నేహితుల మధ్య జరిగే కథ, వారి ప్రయాణాన్ని, యూత్‌కి ఇచ్చే సందేశం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుంది. అందుకే స్పిరిట్ మీడియా'అమీర్ లోగ్'ను విడుదల చేయబోతోంది.

## 'పినాక' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల



గోల్డెన్ మెగాస్టార్ గణేష్ పుట్టినరోజు సందర్భంగా 'పినాక' చిత్ర నిర్మాతలు సినిమాలోని ఆసక్తికరమైన ప్రపంచాన్ని పరిచయం చేసే ఒక ఆకట్టుకునే కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఒక పురాతన రహస్యాన్ని ఛేదించడంలో నిమగ్నమైన గణేష్‌ను ఒక ప్రత్యేకమైన గెటప్‌లో చూపిస్తున్న ఈ పోస్టర్, సాహసం, పురాణాలు, రహస్యాలు, అద్భుతాలతో నిండిన ఒక సినిమా ప్రయాణ మైన 'పినాక' సారాంశాన్ని సంపూర్ణంగా ఆవిష్కరిస్తుంది. ఈ ఈ పోస్టర్ ఇప్పటికే ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. ఈ సందర్భంగా చిత్రబృందం గోల్డెన్ మెగా స్టార్ గణేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాం క్షలు తెలియజేస్తూ 'పినాక'లో ఆయనను ప్రేక్షకులు ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో చూడబోతున్నారని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలియజేశారు. అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుందని ప్రకటించారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, బి. ధనంజయ దర్శకత్వం వహిస్తున్నారు.

4vzm15:4vzm15.qxd 03-07-2026 21:54 Page 1



## రోటరీ అధ్యక్షుడిగా డాక్టర్ జె సి రాజు ఏకగ్రీవం



**బొబ్బిలి, జూలై 3, ప్రభాతవార్త:**

ప్రతిష్టాత్మక అంతర్జాతీయ రోటరీ సంస్థలో భాగస్వామ్యమైన బొబ్బిలి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని రోటరీ జిల్లా చైర్మన్ కె చంద్ర కిషోర్ ప్రకటించారు. శుక్రవారం రోటరీ కార్యాలయంలో నిర్వహించిన రోటరీ అసెంబ్లీ సమావేశంలో బొబ్బిలి రోటరీ క్లబ్ నూతన కమిటీ ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రొటీరియన్, పాల్ హారిస్ ఫెలో డాక్టర్ జె సి రాజును బొబ్బిలి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులుగా సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అలాగే కార్యదర్శి గా కె శివకాంత్.కోశాధికారిగా చుక్కా శ్రీదేవి, ఉపాధ్యక్షులుగా కొత్తకోట నాగరాజు,ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ గా కె రామ కృష్ణను ఎంపిక చేశారు. అలాగే వివిధ విభాగాల ఛైర్మెన్ లను ప్రకటించారు. మెంబర్ షిప్ చైర్..చంద్ర కిషోర్ఫౌండేషన్ చైర్..డాక్టర్ అప్పల రాజు.సర్వీస్ ప్రాజెక్ట్ చైర్..జి శ్రీనివాస రావు, రోటరాక్ట్ చైర్..ఏం వేణుగోపాల నాయుడు, క్లబ్ సర్వీస్ చైర్..సి హెచ్ జె ప్రవీణ్ కుమార్,వొకేషనల్ సర్వీస్ చైర్.జె సిహెచ్ నారాయణ మూర్తి,విమెన్ ఎంపవర్మెంట్ చైర్ అండ్ డి ఇ ఐ చైర్ లక్ష్మీ దీపవల్లి,ఫెలోషిప్ చైర్.జి శ్రీ ధర్.యూత్ సర్వీస్ చైర్ .నితీష్ఆన్ లైన్ టూల్స్ చైర్ డేవిడ్ జె విక్టర్ లను నియమించారు. అదేవిధంగా రోటరీ జిల్లా చైర్మన్ గా టి ఎన్ ఎస్ కార్తీక్, కె చంద్ర కిషోర్. డిస్ట్రిక్ట్ కో చైర్ గా శ్రీనివాసన్ సింద్రి.శ్రీ హరి.రీజినల్ చైర్ గా ప్రకటించినట్లు డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీ రామ్ తెలియచేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ జె సి రాజు మాట్లాడుతూ సేవాకార్యక్రమాల ద్వారా రోటరీని సమాజంలోకి మరింతగా తీసుకొని వెళ్ళి గుర్తింపు పొందేలా చేస్తామని అన్నారు.

## అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : హెూంమంత్రి

**శృంగవరపుకోట,జూలై3,ప్రభాతవార్త.**



రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర హెూంమంత్రి అనిత తెలిపారు.శుక్రవారం ముషిడిపల్లి పంచాయతీ చీడిపాలెం సమీపంలో జిందాల్ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటులో భాగంగా శంఖుస్థాపన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. శంఖుస్థాపన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగా వర్చువల్గా ప్రారంభించారు.శంఖుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఐటీ మంత్రి లోకేష్ బాబు సారధ్యంలో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా జరుగతుందన్నారు.పరిశ్రమల ఏర్పాటు కోసం వారు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.ఈరోజు బొడ్డవర ప్రాంతంలో సుమారు 1166ఎకరాల్లో పది పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని దాదాపు 45000వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. గత18ఏళ్ల నిరీక్షణ రైతులకు కూటమి ప్రభుత్వం మేలు చేసిందన్నారు.ఈరోజు బొడ్డవర ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు కేవలం సీఎం చంద్రబాబు కృషి వలన పరిశ్రమలు వస్తున్నాయని ఆమె తెలిపారు.రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనువాస్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన వలన నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలు దక్కుతాయని తెలిపారు.ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ఆశయం



**కురుపాం, జూలై 3, ప్రభాతవార్త :**

కురుపాం,జూలై 3 ప్రభాతవార్త. ప్రజల చెంతకే పాలనను చేర్చి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఆశయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కురుపాం మండలం శివన్నపేట గ్రామంలో నియోజకవర్గం లో నాలుగు గ్రామాలు' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విప్, కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, అధికారులే నేరుగా గ్రామాల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. శివన్నపేట పరిసర గ్రామాల ప్రజల ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని, నియోజకవర్గ పరిధి లోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. ఒక నియోజకవర్గం నాలుగు గ్రామాలు కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజల వద్దకు వచ్చి వారి కష్టసుఖాలను తెలుసుకునే అవకాశం లభించిందని అన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది , శివన్నపేట గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలపై కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణి చేశారు.

## ఎంఎల్సీ నాగబాబును మర్యాదపూర్వకంగా కలసిన గుమ్మా

### జనసేన పార్టీ టౌన్ ప్రెసిడెంట్గా దరఖాస్తు అందజేత

**సాలూరు, జూన్ 3, ప్రభాతవార్త :**



జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ పటిష్టత కోసం ఎమ్మెల్సీ నాగబాబు అరకు పార్లమెంట్ పరిధి పర్యటనలో భాగంగా నియోజకవర్గ శారదల సమాచార సేకరణ చేపట్టారు.శుక్రవారం అందులో భాగంగా పీపీఎం మణ్యం జిల్లా దగ్గర ఉన్న నర్సిపురంలో భానుకన్వెన్షన్ పంక్షన్ హాల్లో నాగబాబు పర్యవే క్షణలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ జనసేన నాయకులు గుమ్మా నాగార్జున ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు.అలాగే జనసేన పార్టీ సాలూరు పట్టణ అధ్యక్షునిగా అవకాశం కల్పించాలని నాగబాబును కోరడమే కాకుండా దరఖాస్తు సమర్పించారు.దీనికి ఎమ్మెల్సీ నాగబాబు సాను కూలంగా స్పందించి డీసీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో తెలియజేస్తామని భరోసా కల్పించారని గుమ్మా నాగార్జున చరవాణి ద్వారా స్థానిక విలేకరుల కు తెలియజేశారు.ఇంకా జనసేన పార్టీ నాయకులు 5వ వార్డు మాజీ కౌన్సిలర్ గొల్లపల్లి పల్లి వరప్రసాద్ కూడ పాల్గొని దరఖాస్తు అందజేసి ఎస్సీ సెల్ ప్రెసిడెంట్గా అవకాశం కల్పించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**నెల్లిమర్ల, జులై 3, ప్రభాతవార్త :**

నెల్లిమర్ల –చీపురుపల్లి రోడ్డులో చంపావతి వంతెన వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న గుర్ల మండలం బెల్లానపేట గ్రామానికి చెందిన దుక్క నరసింహులు (31) మృతి చెందాడు. నెల్లిమర్ల పోలీసులు కథనం ప్రకారం నరసింహులు తన భార్యను ప్రసవం కోసం నెల్లిమర్ల లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చాడు. తన భార్యకు, ఆమె వద్ద ఉన్న తన పెద్దమ్మకు రాత్రి భోజనం ఏర్పాట్లు చేసి తిరిగి మోటార్ సైకిల్ పై స్వగ్రామానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పుడు కేసులు పెట్టి ప్రజలను భయబ్రాంతులను చేస్తున్నారు



**బొబ్బిలి, జూలై 3, ప్రభాతవార్త:**

ప్రజలపై సోషల్ మీడియా పై మీడియాపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతుల కు గురి చేస్తున్నారని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బ్లడ్ బుక్ రాజ్యాంగం కొనసాగుతుందని బాడంగి మండలం నుంచి హైదరాబాద్ యూట్యూబ్ ఛానల్ కెవి రెడ్డి పై మాజీ సర్పంచ్ ద్వారా ఛానల్ రిపోర్ట్ పై ప్రభుత్వం సీఎం పీఎం ల పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఉద్దేశంతో కేసు నమోదు చేశారు. ఈ కేసు బొబ్బిలి సిఐ బాడంగి ఎస్సైలు సదరు వ్యక్తికి నోటీసులు అందజేసిన పందించకపోవడంతో బొబ్బిలి కోర్టు ఆదేశాలతో నాన్బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీచేసి మనీ ప్రయత్నంలో ఆయన ఇంటి వద్ద నుంచి అరెస్టు చేసి తీసుకు వచ్చారు. అంతరం కోర్టుకు కె.వి.ఆర్ ను హాజరు పల్చగా జడ్జ్ 14 రోజులు రిమాండ్విధించారు. బొబ్బిలి సబ్ జైల్లో ఉన్న కెవిఆర్ ను మాజీ ఎమ్మెల్యే తో పాటు వైయస్సార్సీపి ముఖ్య నేతలు అంతా జైలుకు వెళ్లి ములకతయ్యారు. ఆయనకు ధైర్యం చెప్పి మేము మీకు అండగా ఉంటామని అని మీ కుటుంబాన్ని కూడా ములాకత్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలా తప్పుడు కేసులతో వైసిపి కార్యకర్తలను జర్నలిస్టులను ఎవర్ని కూడా విడిచిపెట్టకుండా బీభత్సం చేస్తున్నారని ఆయన అన్నారు. సమయం వస్తే అదే తిరగబడుతుందని అన్నారు. కార్యక్రమం లో చోడిగంజి రమేష్ నాయుడు. ఇంటి గోపాలరావు చావు వెంకట మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచ మోటార్ మెకానికల్ దినోత్సవ సందర్భంగా ర్యాలీ

**బొబ్బిలి, జూలై 3, ప్రభాతవార్త:**



ప్రపంచ మోటార్ మెకానికల్ దినోత్సవం సందర్భంగా బొబ్బిలిలో సిఐ నారాయణరావు ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో భారీ హెల్మెట్లతో కూడిన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ రావు మోటార్ వెహికల్ మెకానికులకు డ్రగ్స్ పైన హెల్మెట్లు ధరించడం పైన రాష్ డ్రైవింగ్ పైన గంజాయి మొదలగు మత్తు పదార్థాలు వాటి వాహనాలు నడుపుకూడదని వారికి అవగాహన కల్పించారు. మీరు కొంతమందికి అవగాహన కల్పించి మంచి మార్గంలో నడిచే విధంగా మీరందరూ మాకు సహకరించాలని మీ కుటుంబాన్ని బాగు చేసుకోవాలని ఆయన కేతో పనికారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల మెకానికల్ వంగపండు మహేష్. కంచు మోజు శ్రీనివాసరావు తదితర మోటార్ వాహనాల మెకానిక్ సోదరులందరూ పాల్గొన్నారు.

## నాగబాబుని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన మండల కన్వీనర్



**కురుపాం , జూలై 3 ,ప్రభాతవార్త.**

జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నిర్మాణ సారదుల సమాచార సేకరణ కార్యక్రమానికి మన్యం జిల్లా పార్వతీపురం విచ్చేసిన ఎమ్మెల్సి జనసేన పార్టీ పిఎసి నెంబర్ నాగబాబు నీ కురుపాం జనసేన పార్టీ నాయకులు నేరేడుబిల్లి వంశీ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు ఈ సందర్భంగా నియోజకవర్గ రోడ్లు ఫారెస్ట్ క్లియరెన్స్ జలజీవన పూర్ణపాడు లబేసు వంతెన ఏనుగుల సమస్యలు వివరించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోమని కోరినట్లు తెలిపారు.

## రామతీర్థం దేవస్థానానికి బయోమాస్ స్టవ్‌లు వితరణ

**నెల్లిమర్ల, జూన్ 3, ప్రభాతవార్త :**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీరామస్వామి దేవస్థానం ఆలయ అన్నదాన వంటశాలకు రూ.60 వేల విలువైన రెండు బయోమాస్ స్టవ్‌ల ను శుక్రవారం బహూకరించారు. విశాఖపట్నం లోని హరే కృష్ణ మూమెంట్ ప్రతినిధులు రామతీర్థం దేవస్థానంలోని అన్నదాన వంటశాల కు ప్రతి రోజు స్వామి వారికి జరిగే ప్రసాదము, అన్నదానం కొరకు ఉపయోగించుటకు ఈ రెండు బయోమాస్ స్టవ్‌లను విరాళంగా అందజేసి నట్లు తెలిపారు.ఈ సందర్భంగా హరే కృష్ణ మూమెంట్ అధ్యక్షులు నిష్కిన్సన్ భక్తి దాస్ మాట్లాడుతూ, భక్తులకు మరింత నాణ్యమైన అన్నదాన సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ బయోమాస్ స్టవ్‌లను దేవస్థానము నకు అందజేసినట్లు తెలిపారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వై శ్రీనివాసరావు , ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, ఆలయ సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు శృతి సాగర్ ప్రభు, హరే కృష్ణ మూమెంట్ ప్రతినిధులు, ప్రాజెక్ట్ మేనేజర్ టి. శ్రీనివాసరావు, ఆపరేషన్స్ హెడ్ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



## సామూహిక విత్తన శుద్ధి

**లక్కవరపుకోట, జూలై 3, ప్రభాత వార్త :**

సామూహిక విత్తన శుద్ధి ద్వారా గ్రామాలలో రైతులు వేసే పంటలకు తెగుళ్లు రాకుండా నివారించ వచ్చు అని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా అడిషనల్ డైరెక్టర్ స్వామి నాయుడు తెలిపారు శుక్రవారం చందులూరు లింగంపేట,మార్లపల్లి, లచ్చంపేట, కిత్తన్నపేట, సంతపేట మరియు ఇతర ప్రకృతి వ్యవసాయం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం ద్వారా గ్రామాలలో సామూహికంగా బీజామృతంతో వరి విత్తనాలు శుద్ధిచేసి నార్లు వెయ్యడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం అదనపు ప్రాజెక్టు మేనేజర్ స్వామి నాయుడు పాల్గొని రైతులందరూ కూడా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలని విత్తనశుద్ధి చెయ్యడం వలన విత్తనం ద్వారా గాని భూమి ద్వారా గాని సంక్రమించే తెగులను పురుగులను నివారించవచ్చని అదేవిధంగా విత్తనం మొలక శాతం పెరుగుతుందని తెలియజేశారు.అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని తెలియజేశారు.రైతులకు అవసరమైన కషాయాలు గాని,ద్రావణాలు గానీ విత్తనాలు గాని స్థానిక బయో రీసెర్చ్ సెంటర్ నందు లభ్యమవుతాయని ఆయన రైతులకు తెలియజేశారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపుమారి పంటలు పండించాలని 365 రోజులు భూమిని కప్పిఉంచే విధంగా పంటలు ప్రణాళిక ఉండాలని రైతులకు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తూతూమంత్రంగా రెండో వారం పిజిఆర్ఎస్

**రామభద్రపురం, జూలై 3, ప్రభాత వార్త :**



మండల పరిధిలోని భూసాయవలస ఎస్టీ కళ్యాణ మండపంలో జరిగిన రెండోవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక తూతూమంత్రంగానే జరిగింది. ప్రచార లోపమో,సమస్యల పరిష్కారం పట్ల నిర్లిప్తతో తెలీదు కానీ ముందు ప్రకారం జరిగింది. నియోజక వర్గ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల పరిధిలో ఇరవై మూడు ఫిర్యాదులు వచ్చాయి. బొబ్బిలి రెవిన్యూ డివిజన్ అధికారి మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు అజూరఫీజాన్, ఎం. శ్రీను,ధనం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు కాక రైతుల ఇక్కట్లు



**వేపాడ, జూలై3, ప్రభాతవార్త:**

ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు కాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వేపాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారిని ఎం స్వాతి శాఖపరమైన సమాచారం వివరిస్తుండగా అరిగిపాలెం ఎంపీటీసీ టీ వెంకటరమణ అభ్యంతరం వ్యక్తం చేస్తూ రెండేళ్లుగా అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు కాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించి రైతులకు సహకరించాలని ఆయనతోపాటు ఎంపీపీ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ ఏ ఈశ్వరరావు కోరారు. ఆ మేరకు ఏవో స్వాతి స్పందిస్తూ గతంలో మంజూరైన రైతులకు నిధులు జమవుతున్నాయని కొత్తగా నమోదైన రైతులకు మాత్రమే నిధులు మంజూరు కాలేదని తెలిపారు. పాత వన్ బీ లు కలిగి ఉన్న రైతులకు జూలై 31వ తేదీ లోగా అన్నదాత సుఖీభవ నిధులు ప్రభుత్వం జమ చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నిధులు మంజూరు కానీ రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరిస్తున్నామని రైతులందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. నిరుపేద ప్రజలకు పక్కా గృహాలు మంజూరు కాక అనేక అవస్థలు పడుతున్నా హౌసింగ్ శాఖ పట్టించుకోవడంలేదని ఏవో గంగాధర్ తీరుపై పలువురు సభ్యులు తీవ్ర సంతృప్తిని వ్యక్తం చేశారు. గత ఏడాది గ్రామాల్లో డిజిటల్ సర్వే జరిపినప్పటికీ ఆ జాబితాలను ప్రజా ప్రతినిధులకు ఇవ్వలేదు సరి కదా, అర్హులైన లబ్ధిదారులకు రెండేళ్లుగా పక్కా గృహాలు మంజూరు కాలేదని ఎంపీపీ డి సత్యవంతుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పక్కాగృహం నిర్మించినా మరుగుదొడ్డు బిల్లు నేటికీ మంజూరు చేయలేదని వేపాడ ఎంపీటీసీ గాడి గంగతల్లి ఆవేదన వ్యక్తం చేశారు.

## స్పందించారు .. రహదారి వెడల్పు చేశారు



**చీపురుపల్లి , జూలై 3, ప్రభాతవార్త:**

చీపురుపల్లి పట్టణంలోని రామాంజనేయ కాలనీకి వెళుతున్న రహదారి ఆక్రమణకు గురైందంటూ పత్రికల్లో వచ్చిన వార్తలకు అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం నాడు రహదారి వెడల్పు చేయుటకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారులు మాట్లాడుతూ రహదారి ఆక్రమణకు ఏ ఒక్కరు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## తాటిపూడి జలాశయం నుంచి సాగునీరు విడుదల



**విజయనగరం (గంట్యాడ) జులై 3: ప్రభాతవార్త:**

రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గంట్యాడ మండలంలోని గొర్రెపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం నుంచి శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని మూడు మండలాల్లో సుమారు 15,300 ఎకరాలను సస్యశ్యామలం తాటిపూడి నీటి విడుదల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఆయుకట్టుదారుల సంఘం అధ్యక్షులు కె.జగన్నాధరావు, కూటమి నాయకులు కొండపల్లి కొండలరావు, భాస్కరనాయుడు ఇతర నాయకులు, ఆయుకట్టు సంఘాల నాయకులు, డైరెక్టర్లు తదితరులు, ఇరిగేషన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి వద్ద నిరాశ .. మాజీ డిసీఎం వద్ద ఆశ

### గిరిజన విద్యార్థుల సమస్యలతో రాజన్నదొరకు విన్నపాలు



**సాలూరు , జులై 3 ప్రభాతవార్త :**

సాలూరు పట్టణం బంగారమ్మ కాలనీ బీసీ హాస్టల్లో వసతి ఉంటున్న ఎస్టీ విద్యార్థులను ఇటీవల బంగారమ్మ పేట ఎస్సీ హాస్టల్‌కు తరలించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రాష్ట్రమంత్రి సంధ్యారాణి ఇంకా సంబంధిత అధికారులు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లిన నిరాశ మిగిలిందని ఆవేదన వ్యక్తం చేసారు.ఈ మేరకు శుక్రవారం విద్యార్థులు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర నివాసానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేసారు.అంతేకాకుండా డిగ్రీ,ఇంటర్మీడియట్ కళాశాలలకు వెళ్లేందుకు దూరం పెరగడంతో ప్రతిరోజూ రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్య పరిష్కరిస్తారని ఆశతో మాజీ డిప్యూటీ సీఎం కలిసామని తెలిపారు.అలాగే విద్యార్థుల సమస్య సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడతానని రాజన్నదొర భరోసా కల్పించారు.వైసీపీ నాయకులు దండి.శ్రీను, మువ్వల.ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు వార్షిక కార్యాచరణ ప్రణాళిక పై శిక్షణ




**గరివిడి, జూలై 3, ప్రభాత వార్త:**

గరివిడి మండల సమైక్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్ లో భాగంగా వార్షిక కార్యాచరణ ప్రణాళిక పై రెండు రోజులు పాటు శిక్షణా కార్యక్రమం వెలుగు అధికారులు నిర్వహించారు. గ్రామ సంఘం, సిసి క్లస్టర్ వారిగా గతంలో తయారుచేసిన ప్రణాళికను పరిశీలించారు. కార్యక్రమం పై గ్రామ సంఘం అధ్యక్షులకు , గ్రామ సంఘం సహాయకులకు భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి దీని అమలకు గ్రామ సంఘ సహాయకులు , కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పనిచేయాలని వెలుగు ఏపీఎం ధనలక్ష్మి, ఎల్ సి పి దుర్గా ప్రసాద్ లు అన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో సిసీలు సత్యనారాయణ ,నాగభూషణ్ ,లక్ష్మి , ఆదినారాయణ , గ్రామ సంఘం సభ్యులు, గ్రామ సంఘం సహాయకులు పాల్గొన్నారు.

## పెదపెంకిలో యుద్ధప్రాతిపదికన పనులు వేగవంతం కావాలి

### జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి

### ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమన్వయ శాఖాధికారులతో అత్యవసర సమీక్ష



**బలిజిపేట, జూలై 3, ప్రభాతవార్త**

మండలంలోని పెదపెంకి గ్రామం లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితిలో నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి కావాల్సిందేనని తేల్చిచెప్పారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బలిజిపేట మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లా అధికారులతో ఆమె ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపడుతున్న పనుల పురోగతిని సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ డెప్యూటీ సీఎం గారి పర్యటన అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పరిధిలో జరుగుతున్న ప్రతి పనిలోనూ పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎక్కడా ఎటువంటి అలసత్వానికి తావుండకూడదని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయానికి ముందే అన్ని రకాల పనులను పూర్తి చేసి నివేదికలను సిద్ధంగా ఉంచాలని అధికారులను జేసీ ఆదేశించారు. సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు,జిల్లా పంచాయతీ అధికారి ఎస్.రవీంద్ర, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

04-7pg10.qxd:04-7pg10.qxd 1/1/02 6:25 AM Page 1



# నేడు ఇంగ్లండ్‌తో రెండో టి-20

## టీమిండియా నుంచి ఇద్దరు స్టార్స్ ఔట్





**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగే రెండో టి-20 మ్యాచ్‌కు టీమిండియా తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఇద్దరు స్టార్ బ్యాట్స్‌మెన్ల స్థానంలో ఇద్దరు యంగ్ ప్లేయర్లకు అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. ఐర్లాండ్ సిరీస్‌లో విఫలమైన టీమిండియా ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టి-20లో బ్యాటింగ్ పరంగా ఆకట్టుకుంది. ఈనెల 1న వర్షం కారణంగా రద్దయిన మొదటి టి-20లో టీమిండియా బ్యాటింగ్ లైనప్‌లో కొందరి ప్రదర్శన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలో బుల్లెట్ రైళ్లలా దూసుకుపోయిన ఇద్దరు స్టార్ హిట్టర్లు శ్రేయస్ అయ్యర్ సారథ్యం చేపట్టగానే ఒక్కసారిగా సంజూ శాంసన్, తిలక్ వర్మ ప్యాసింజర్ ట్రైన్‌లా నత్తనడక బ్యాటింగ్‌తో నిరాశపరుస్తున్నారు. తొలి టి-20లో బ్యాటింగ్ ఎంచుకున్న శ్రేయాస్ సేనలో ఓపెనర్ అభిషేక్ శర్మ (59), శివమ్ దూబే (42) మెరుపులు మెరిపించగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (68) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ ఏడు బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేయగా, తిలక్ వర్మ 13 బంతుల్లో 13 పరుగులు మాత్రమే చేశారు. టి-20 వరల్డ్ కప్‌లో అదరగొట్టిన ఈ ఇద్దరు స్టార్ బ్యాట్స్‌మెన్లు ఇంగ్లాండ్‌తో తొలి మ్యాచ్‌లోనే కాదు దీనికి ముందు జరిగిన ఐర్లాండ్ సిరీస్‌లోనూ విఫలమయ్యారు. ఐర్లాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో సంజూ 4 బంతుల్లో 5 రన్స్ చేయగా, రెండో మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు.

ఇక తిలక్ వర్మ పరిస్థితి చూస్తే టి-20 మ్యాచ్‌ను వన్డే తరహాలోఆడాడు. ఐర్లాండ్‌పై మొదటి మ్యాచ్‌లో 21 బంతుల్లో 19 పరుగులు చేసిన తిలక్ రెండో మ్యాచ్‌లో 46 బంతులుతిని 55 పరుగులు చేశాడు. ఇటీవలి టి-20 వరల్డ్ కప్‌లోనూ వీరిద్దరూ విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో అలరించారు. అయితే కెప్టెన్ మారిన వెంటనే గత మూడు మ్యాచ్‌లుగా వీరిద్దరి బ్యాటింగ్ తీరు మారి పోయింది.

అటాకింగ్ గేమ్ కాకుండా డిఫెన్సివ్ మోడ్‌లో ఆడడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలోనే శనివారం జరిగే రెండో టి-20 మ్యాచ్‌లో తుది జట్టులో మార్పులు ఉండే అవకాశం కనిపిస్తోంది. సంజూ శాంసన్ తిరిగి ఫామ్ అందుకోవడంతో పాటు తిలక్ వర్మ తన స్ట్రైక్ రేట్‌ను మెరుగు పరుచుకోవాల్సి ఉంది. లేదంటే వీరిద్దరిపై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐపిఎల్‌లో అదరగొట్టిన వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నాడు. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలని అన్ని వైపులా నుంచి డిమాండ్లు వస్తున్నాయి. అదేవిధంగా తిలక్ వర్మ స్థానంలో ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గేను బరిలోకి దించేందుకు మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది.



## ఆసియా కప్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్.. భారత్‌కు నాలుగు పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లలో ఆతిథ్య దేశమైన భారతదేశం, మూడు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో తన ప్రచారాన్ని ముగించింది. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచిన ఇండియా బి సీనియర్స్ జట్టు అత్యద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఆ తర్వాత జపాన్‌పై 126-125 (1కీలక గోల్) తేడాతో నాటకీయ సెమీఫైనల్ విజయాన్ని నమోదు చేసి, టోర్నమెంట్‌లోని అత్యంత చిరస్మరణీయ విజయాల్లో ఒకటిగా నిలిచి గోల్డ్ మెడల్ ఫైనల్‌లో స్థానం సంపాదించింది. ఆస్ట్రేలియాతో హోరాహోరీగా జరిగిన పోరులో జట్టు చివరికి రజత పతకంతో సరిపెట్టుకుంది. సుకమల్ దాస్, హేమంత్ జలన్, జితేంద్ర సోలానీ, అనిల్ పధ్యే, రాజేష్ దలాల్, రాజు తోలానీలతో కూడిన ఇండియా బి సీనియర్స్ జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది, దీని ఫలితంగా ఫైనల్ చివరి దశల వరకు భారత్ టైటిల్ పోటీలో నిలిచింది. పురుషుల టీమ్ ఛాంపియన్‌షిప్‌లో ఇండియా ఎ జట్టు కాంస్య పతకాన్ని కూడా సాధించింది. మ్యాచ్ పాయింట్ ఫైనల్స్‌లో మహిళల పెయిర్స్‌లో సప్లీన్ థడానీ, సాధనా గుప్తా రజత పతకాలను, సీనియర్స్ పెయిర్స్‌లో సుబీర్ మజుందర్, సుజిత్ కుమార్ భట్టాచార్జీ రజత పతకాలను కైవసం చేసుకున్నారు. టీమ్‌లో స్వర్ణ పతకాలను ఆసియాలోని ప్రముఖ బ్రిడ్జ్ దేశాలు పంచుకున్నాయి. సీనియర్స్ టైటిల్‌ను ఆస్ట్రేలియా గెలుచుకోగా, పురుషుల విభాగంలో హాంకాంగ్ చైనా ఛాంపియన్‌గా నిలిచింది, మహిళల టైటిల్‌ను ఇండోనేషియా కైవసం చేసుకోగా, మిక్స్‌డ్ టీమ్స్ కిరీటాన్ని చైనా కైవసం చేసుకుంది. అరుణ్ బాపత్-అజయ్ ఖరే 616.64 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణంగెలుచుకొని ఛాంపియన్‌లుగా నిలిచారు, కాగా కామ్నా శర్మ-అభిజిత్ పాల్ 586.82 పాయింట్లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు,

## ప్రపంచ ఆర్చరీలో.. భారత్ మిక్స్‌డ్, రికర్వ్ టీమ్‌లకు రెండు స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ పారా సిరీస్‌లో భారత్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ స్వర్ణాన్ని గెలుచుకుంది. నోవే మెస్టోలో జరిగిన ఈ ఆర్చరీ సిరీస్ ఫైనల్‌లో శీతల్ దేవి, శ్యామ్ సుందర్ స్వామి ఇండోనేషియాను 147-143 తేడాతో ఓడించడంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. టైటిల్ పోరులో భారత జంట సంయమనంతో కూడిన ప్రదర్శన కనబరిచి, నాలుగు ఎండ్‌లలోనూ తమ స్థిరత్వాన్ని కొనసాగించి, ప్రత్యర్థులపై నాలుగు పాయింట్ల ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచింది. సెమీఫైనల్స్‌లో ఫ్రాన్స్‌పై 156-144 తేడాతో తిరుగులేని విజయం సాధించారు. ఆ మ్యాచ్‌లో ఈ జంట ఆరంభం నుండి ముగింపు వరకు ఆధిపత్యం చెలాయించి స్వర్ణ పతక పోరులో స్థానం ఖాయం చేసుకుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ కూడా స్వర్ణ పతకాన్ని సాధించింది. రికర్వ్ మిక్స్ టీమ్ ఈవెంట్ ఫైనల్‌లో భావనా, హర్విందర్ సింగ్‌లు ఇండోనేషియాను 6-2 తేడాతో ఓడించడంతో భారత్ మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. భారతదేశపు అతిపెద్ద పారా ఆర్చరీ స్టార్లలో ఒకరైన శీతల్, పారాలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, ఆసియా పారా గేమ్స్‌లో పతకాలు గెలుచుకుని, ఈ క్రీడలో వేగంగా ఎదిగారు. మరోవైపు, శ్యామ్ పలు అంతర్జాతీయ పోడియం విజయాలతో భారతదేశపు కాంపౌండ్ టీమ్ ఈవెంట్లలో ఒక నమ్మకమైన ఆటగాడిగా తనను తాను నిరూపించుకున్నారు.





## గ్రాండ్ చెస్ టూర్..రెండో స్థానానికి గుకేశ్

**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్ జాగ్రెబ్‌లో ప్రపంచ ఛాంపియన్ భారత గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నాడు. గుకేష్, ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బ నుండి కోలుకుని, రెండవ రోజు శుక్రవారం ఈవెంట్‌లో ఆరు రౌండ్ల తర్వాత ఈ స్థానంలో నిలిచాడు. జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్, ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్‌లాగ్రావ్, రొమేనియాకు చెందిన బోగ్డాన్‌డేనియల్ డీక్‌లతో కలిసి రెండవ స్థానాన్ని పంచుకుంటున్నాడు. అలీరెజా ఫిరౌజ్జా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, 12 పాయింట్లకు గాను తన ఆధిక్యాన్ని 10 పాయింట్లకు పెంచుకున్నాడు. ర్యాపిడ్ విభాగంలోని చివరి మూడు రౌండ్లలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, ఈ ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ తన తర్వాతి పోటీదారుల కంటే మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. ఆరంభంలో ఓటమి తర్వాత గుకేశ్ కోలుకున్నాడు బోగ్డాన్‌డేనియల్ డీక్ చేతిలో ఓటమితో గుకేష్ రోజు ప్రారంభమైనప్పటికీ, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌ను ఓడించి బలంగా పుంజుకున్నాడు, ఆ తర్వాత ఫైనల్ రౌండ్‌లో గిరిని అధిగమించాడు. తెల్ల పావులతో గిరిని ఎదుర్కొన్న గుకేశ్ తన ప్రత్యర్థి యొక్క పొరపాట్లను సద్వినియోగం చేసుకుని ఆ ఆధిక్యాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక రెండో రోజు కూడా ఆర్ ప్రజ్ఞానందకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వాన్ ఫోరెస్ట్‌పై విజయంతో రోజును ప్రారంభించిన ఈ భారత ఆటగాడు, నోదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ చేతిలో ఓడిపోయి, ఆ తర్వాత టోర్నమెంట్ లీడర్ ఫిరౌజ్జా చేతిలో మరో పరాజయాన్ని చవిచూశాడు.





## కెనడా ఓపెన్‌లో.. ఆకర్షి, తాన్యలు నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** ఆకర్షి కశ్యప్, తాన్య హేమంత్ రెండో రౌండ్‌లో ఓటమి పాలవడంతో బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత్ ప్రయాణం ముగిసింది. ఒంటారియోలో జరిగిన మహిళల సింగిల్స్ పోటీలో ప్రపంచ ర్యాంకింగ్‌లో 71వ స్థానంలో ఉన్న ఆకర్షి, అమెరికాకు చెందిన నాలుగో సీడ్ బెయివెన్ జాంగ్‌ను ఓడించేంత దగ్గరకు వచ్చి, గంటా ఏడు నిమిషాల పాటు సాగిన పోరులో 20-22, 21-17, 21-17 తేడాతో ఓడిపోయింది.అమెరికన్ క్రీడాకారిణి భారీ ఆధిక్యంతో రెండవ గేమ్‌పై పట్టు సాధించింది, కానీ ఆకర్షి చివరి నిమిషాల్లో పుంజుకున్నప్పటికీ అది ఫలించలేదు. నిర్ణయాత్మక గేమ్ 17-17 స్కోరు వరకు సమంగానే సాగింది. ఆ తర్వాత జాంగ్ వరుసగా చివరి నాలుగు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌ను కైవసంచేసుకుంది. ఈ ఓటమితో జాంగ్‌పై ఆకర్షి ఓటమిరికార్డు 0-3కి చేరింది. అంతకుముందు, జపాన్‌కు చెందిన మూడవ సీడ్ రికో గుంజీ చేతిలో కేవలం 31 నిమిషాల్లో 21-11, 21-11 తేడాతో ఓడిపోవడంతో తాన్యా హేమంత్ ప్రస్థానం ముగిసింది. యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో కూడా ఈ జపనీస్ షట్లర్ చేతిలో తాన్యా ఓడిపోయిన తర్వాత, ఇన్ని వారాల వ్యవధిలో గుంజీ చేతిలో ఆమెకు ఇది రెండవ ఓటమి.

# హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌కు యూరప్ కంపెనీతో రూ.9,500 కోట్ల మెగా ఒప్పందం




**ముంబయి,జులై 3:** దేశీయ ఐటీ దిగ్గజం హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ యూరప్‌కు చెందిన ఫార్చ్యూన్ గ్లోబల్-50 కంపెనీ నుంచి 1.14 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ సేవల కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. భారత కరెన్సీలో ఈ ఒప్పందం విలువ రూ.9500 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో భారతీయ ఐటీ సంస్థ ప్రకటించిన తొలి బిలియన్ డాలర్ల మెగా డీల్ ఇదే కావడం గమనార్హం.ఈ ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 2026 జూలై నుంచి 2031 డిసెంబర్ వరకు కొనసాగనున్న ఈ కాంట్రాక్ట్‌ను మరో ఐదేళ్లు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. ఈ ఒప్పందం ద్వారా హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌కు యేటా సుమారు 228 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఈ ప్రాజెక్టు కింద క్లయింట్‌కు చెందిన గ్లోబల్ డిజిటల్ వర్క్‌ప్లేస్, ఎంటర్‌ప్రైజ్ నెట్‌వర్క్‌ల కోసం కృత్రిమ మేధస్సు ఆధారిత ఆపరేటింగ్ మోడల్‌ను హెచ్‌సీఎల్ రూపొందించనుంది. మొత్తం 1.14 బిలియన్ డాలర్ల విలువైన ఈ ఒప్పందం పూర్తిగా కొత్త వ్యాపారం కావడం మరో ప్రత్యేకతగా కంపెనీ వెల్లడించింది.ఈ మెగా డీల్ హెచ్‌సిఎల్‌కే కాకుండా భారతీయ ఐటీ రంగానికి కీలక మైలురాయిగా భావిస్తున్నారు. 2024 జనవరి తర్వాత భారతీయ ఐటీ రంగానికి లభించిన నాలుగో బిలియన్ డాలర్లకు పైబడిన ఒప్పందం ఇదే. ప్రపంచవ్యాప్తంగా ఐటీ సేవల డిమాండ్ మందగించిన పరిస్థితుల్లో కూడా భారీ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఈ ఒప్పందం స్పష్టం చేస్తోంది.మరోవైపు, హెచ్‌సిఎల్‌కు మూడేళ్ల తర్వాత లభించిన తొలి మెగా కాంట్రాక్ట్ ఇదే. గతంలో 2019లో జిరాక్స్ సంస్థతో 1.3 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ అవుట్‌సోర్సింగ్ ఒప్పందాన్ని హెచ్‌సీఎల్ కుదుర్చుకుంది. ప్రస్తుతం సంస్థ సీఈఓగా ఉన్న విజయకుమార్ నాయకత్వంలో కంపెనీ సాధించిన మూడో బిలియన్ డాలర్ల మెగా డీల్‌గా ఇది నిలిచింది.

# మూడోరోజూ లాభాల్లోనే సెన్సెక్స్, నిఫ్టీ




## ఐటి, హెల్త్‌కేర్, మెటల్ షేర్ల మద్దతు

**ముంబయి,జులై 3:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాలతో ముగిశాయి. అమెరికా ఉపాధి గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగా లేకపోవడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై ఆశలు పెరగడం మార్కెట్లకు ఊతమిచ్చింది. ఐటీ, హెల్త్‌కేర్, మెటల్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సెన్సెక్స్ 262 పాయింట్లు పెరిగి 77 వేల 764 వద్ద ముగియగా నిఫ్టీ 95 పాయింట్లు లాభపడి 24 వేల 271 స్థాయికి చేరుకుంది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ దాదాపు 1.7 శాతం, నిఫ్టీ 1.7 శాతం మేర ర్యాలీ తీసాయి.భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మార్కెట్‌కు ప్రధాన మద్దతిచ్చాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.25శాతం క్షీణించగా స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.09శాతంపెరిగింది. మొత్తంగాచూస్తే బాంబే స్టాక్‌ఎక్స్ఛేంజీలో 2257 కంపెనీల షేర్లుపెరిగితే 1986 షేర్లు క్షీణించాయి. 202 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 95.18వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.43శాతంపెరిగి రూ.1,47,850వద్ద కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఫ్యూచర్ ధరలు బ్యారెల్‌కు 71.85 డాలర్లవద్దకొనసాగాయి ఇక షేర్లపరంగాచూస్తే పిబి ఫిన్‌టెక్ షేరు దాదాపు 6 శాతం పడిపోయింది. భారీ బ్లాక్‌డీల్‌ల కారణంగా ఈ షేరుపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బజాజ్ ఫైనాన్స్ తొలి త్రైమాసికంలో కొత్త రుణాలు 20 శాతం పెరగడంతో షేరు లాభపడింది. సుమిటోమో కెమికల్ ఇండియా 13 శాతానికిపైగా ఎగిసింది.

సెమీకండక్టర్ గ్లాస్‌కోర్ సబ్‌స్ట్రేట్ వ్యాపారంలో జాయింట్‌వెంచర్ ఒప్పందం ఇందుకుకారణమైంది.హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ యూరప్‌కు చెందిన ఫార్చ్యూన్ గ్లోబల్50 కంపెనీతో కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒప్పందం కుదుర్చుకోవడంతో షేరు దాదాపు 6 శాతం పెరిగింది.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లు వరుస త్రైమాసికంతో పోలిస్తే తగ్గడంతో షేరు దాదాపు 4శాతం నష్టపోయింది. జైడస్ లైఫ్‌సైన్సెస్ క్యాన్సర్ గుర్తింపు పరీక్ష కోసం అపోలో హాస్పిటల్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంతో షేరు లాభపడింది. పిసి జువెల్లర్ తొలి త్రైమాసిక ఆదాయం 21 శాతం పెరగడంతో షేరు 4 శాతం ఎగిసింది. మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్ అంచనాలకుతగ్గ డేటాతో షేరు 5శాతానికి పైగా పడిపో యింది. ఐపీఓ అప్‌డేట్‌నాక్ ప్యాకేజింగ్ ఐపీఓకు పెట్టుబడిదారుల నుంచి భారీ స్పందన లభించింది. ఈ ఇష్యూ చివరి రోజు నాటికి 83.14 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఒక్కో షేరు ధరను 161 నుంచి 170 రూపాయల మధ్య నిర్ణయించారు.

## ఇన్సూరెన్స్‌దేఖో-రెన్యూబైల విలీనం

### రూ.4 వేల కోట్ల ఐపిఒకు సన్నాహాలు




**న్యూఢిల్లీ,జులై 3:** దేశంలోని ప్రముఖ బీమా పంపిణీ వేదిక ఇన్సూరెన్స్‌దేఖో, ఇన్సూర్‌టెక్ సంస్థ రిన్యూబై విలీన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మరో కొద్ది రోజుల్లో ఈ విలీనం పూర్తయ్యే అవకాశముంది. ఈ విలీనం అనంతరం ఏర్పడే సంయుక్త సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారీ స్థాయిలో ఐపిఒకు సన్నాహాలు చేస్తోంది.ఇన్సూరెన్స్‌దేఖో వ్యవస్థాపకుడు అంకిత్ అగ్రవాల్, రిన్యూబై చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఇంద్రనీల్ చటర్జీ మాట్లాడుతూ విలీన ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. 2027 మార్చి 31 నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కంపెనీని లిస్ట్ చేయడమే లక్ష్యమని, సుమారు రూ.3,500 కోట్ల నుంచి రూ.4,000 కోట్ల పరిమాణంలో ఐపిఒను తీసుకురావాలని సంస్థ యోచిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొత్త ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రస్తుతం ఉన్న వాటాదారులు విక్రయించే ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉంటుంది. సెప్టెంబరునాటికి సెబీకి డిఆర్‌హెచ్‌పిదాఖలుచేయాలని నిర్ణయించారు. విలీనం ద్వారా ఇన్సూరెన్స్‌దేఖోకు ఉన్న డిజిటల్ బీమా మార్కెట్‌ప్లేస్ బలం, రిన్యూబైకి ఉన్న ఏజెన్సీ ఆధారిత పంపిణీ వ్యవస్థ ఒకే వేదికపైకి రానున్నాయి. జీవిత బీమా, ఆరోగ్య బీమా, సాధారణ బీమా విభాగాల్లో సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు రెండుమూడుశ్రేణి నగరాల్లో విస్తరణకు ఊతం లభించనుంది. భారత్‌లో డిజిటల్ బీమా, ఆర్థిక సేవల రంగాలపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఐపిఒకు ప్రాధాన్యం ఏర్పడింది. వ్యాపార విస్తరణ, సాంకేతికతలో పెట్టుబడులు, పంపిణీ వ్యవస్థ బలోపేతం కోసం మూలధనం సమీకరించడమే ఈ పబ్లిక్ ఇష్యూ ప్రధాన లక్ష్యంగా సంస్థ భావిస్తోంది. ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే, 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత ఇన్సూర్‌టెక్ రంగంలో అత్యంత ప్రాముఖ్యమైన ఐపీఓలలో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఐపిఒకు వస్తున్న పార్లేజీ

### రూ.9530 కోట్లు సేకరణ లక్ష్యం




**ముంబయి,జులై 3:** ప్రముఖ ఆహార ఉత్పత్తులసంస్థ పార్లేజి స్టాక్ మార్కెట్లోకి ప్రవేశిస్తోంది. వచ్చే యేడాది భారీ ఐపిఒకు రావాలని కంపెనీ నిర్ణయించింది. ఈ ఐపిఒ ద్వారా రూ.9,530 కోట్లు నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఐపిఒ సమయంలో కంపెనీ వ్యాల్యుయేషన్‌ను 10.5 బిలియన్ డాలర్లకు సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా అంచనా వేస్తున్నారు. దాదాపు వందేళ్లుగా ప్రైవేట్ సంస్థగా కొనసాగుతున్న పార్లే ప్రొడక్ట్స్ పబ్లిక్ ఇష్యూకు రానుండటం భారత కార్పొరేట్ రంగంలో ఒక ముఖ్యమైన పరిణామం. ఈ ఐపిఒ ప్రక్రియను నిర్వహించేందుకు కంపెనీ ఇప్పటికే కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, హెచ్‌ఎస్‌బిసి సెక్యూరిటీస్‌లను సలహాదారులుగా నియమించుకున్నట్టు తెలుస్తోంది. 1929లో ముంబైలోని విలే పార్లేలో ప్రారంభమైన ఈ సంస్థను చౌహాన్ కుటుంబం ప్రమోట్ చేస్తోంది. పార్లేజీ, క్రాక్‌జాక్, మొనాకో, హైడ్ అండ్ సీక్ వంటి ఐకానిక్ బిస్కెట్లతో పాటు మ్యాంగో బైట్, మెలోడీ, పాపిన్స్ వంటి మిఠాయిలతో ఈ బ్రాండ్ దేశ ప్రజలకు దగ్గరైంది. అమెరికా, యూకే, కెనడా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాలతో పాటు పలు దేశాల్లో పార్లే ఉత్పత్తులకు బలమైన మార్కెట్ ఉంది. 2025 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం 8.5 వృద్ధితో రూ.15,568 కోట్లకు చేరింది. నికరలాభాలు రూ.979 కోట్లుగా నమోదయ్యాయి. ఐపిఒ ఊహాగానాలపై స్పందించిన కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మయాంక్ షా, ప్రస్తుతం వ్యాపార వృద్ధిపైనే దృష్టి సారిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ఐపిఒ వస్తే ఇది భారత ఎఫ్‌ఎంసజి రంగంలోని అతిపెద్ద ఐపిఒలలో ఒకటిగా నిలిచిపోతుంది.

## ఇపిఎఫ్‌ఒలో 31లక్షల నిష్క్రియఖాతాలు




**న్యూఢిల్లీ,జులై 3:** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్) చందాదారుల కోసం సరికొత్త ఇపిఎఫ్ స్కీమ్2026ను నోటిఫై చేసి డిజిటల్ లావాదేవీలకు శ్రీకారం చుట్టింది. మరోవైపు దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల నిరుపయోగ ఇపిఎఫ్ ఖాతాల్లో దాదాపు రూ.9,330 కోట్లకు పైగా కార్మికుల సొమ్ము క్లెయిమ్ చేయకుండా మూలుగుతోందన్న సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. 1952 నాటి పాత పథకం స్థానంలో జూన్ 29 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఇపిఎఫ్ స్కీమ్ 2026, నిబంధనలను సరళతరం చేయడం, వ్యవస్థను డిజిటలైజ్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మంది యాక్టివ్ చందాదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సంస్కరణల నేపథ్యంలో కార్మికుల పదవీ విరమణ పొదుపు ఎంత పెద్ద మొత్తంలో వారికి చేరకుండా నిలిచిపోయిందో కూడా తెలుస్తోంది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సమాచారం ప్రకారం 2026 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 30,91,862 నిరుపయోగ ఖాతాలు ఉన్నాయి. వీటిలో సుమారు రూ.9,330 కోట్లు క్లెయిమ్ చేయని నిల్వలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పరిస్థితి స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, సమస్య తీవ్రత మాత్రం తగ్గలేదు. 2025 మార్చి 31 నాటికి 31.83 లక్షల ఖాతాల్లో రూ.10,181 కోట్లు ఉండగా, యేడాది వ్యవధిలో నిరుపయోగ ఖాతాల సంఖ్య 92,000, క్లెయిమ్ చేయని మొత్తం రూ.851 కోట్లు తగ్గింది. ఇప్పటికీ దాదాపు 31 లక్షల ఖాతాలు నిద్రాణంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఆధార్‌తో అనుసంధానమైన నిరుపయోగ ఖాతాలు, వాటిలోని మొత్తం, ఆటోసెటిల్‌మెంట్ స్థితి వంటి వివరాలను ఇపిఎఫ్ఒ గోప్యంగా ఉంచింది. రూ.5 లక్షలకు పైగా బ్యాలెన్స్ ఉన్న నిరుపయోగ ఖాతాల వివరాలు కోరగా, ఆ ఫార్మాట్‌లో డేటా నిర్వహించడం లేదని బదులిచ్చింది. కొత్త సంస్కరణలు అమలు చేస్తున్నప్పటికీ, కార్మికుల కష్టార్జితం వారికి చేరడంలో దశాబ్దాలుగా ఉన్న సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## బులియన్ రంగంలో తప్పని ఒడిదుడుకులు

**ముంబయి,జులై 3:** అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా సహా వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేట్ల విధానాలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్ రాబోయే రోజుల్లో బంగారం ధరలను శాసించనున్నాయని ప్రపంచ పసిడిమండలి నివేదించింది. 2026 యేడాది మొదటి భాగం బంగారం మార్కెట్‌కు అత్యంత అస్థిరమైన కాలంగా నిలిచింది. జనవరి నెల చివరలో అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 5,405 డాలర్ల చారిత్రక రికార్డు స్థాయికి చేరిరిన పసిడిధరలు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు మారడం, డాలర్ బలోపేతంకావడం, ఇన్వెస్టర్లు పెద్దఎత్తున లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో జూన్ చివరి నాటికి ధర 4,002 డాలర్లకు పడిపోయింది.

ఇది రికార్డు గరిష్ఠం నుంచి దాదాపు 26 శాతం భారీపతనంకావడం గమనార్హం. అమెరికా ఇరాన్ మధ్యరేగిన సైనిక ఉద్రిక్తతలు బంగారానికి రక్షణగానిలిచాయి. డబ్ల్యుజిసి నివేదిక ప్రకారం, ఆసియా, అమెరికా ట్రేడింగ్ సమయాల్లోనే బంగారంధరల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ పసిడి మార్కెట్‌లో ప్రస్తుతం ఆసియా దేశాల పెట్టుబడిదారులే అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని డబ్ల్యూజీసీ వెల్లడించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.